ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 27.08.2025 | సంపుటి : 12 సంచిక : 39 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.APTEL / 2013 /50370
తెలంగాణ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

రాష్ట్ర ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు
నేడు వినాయక చవితి సందర్భంగా మా పత్రికా కార్యాలయాలకు సెలవు. తిరిగి పునర్దర్శనం శుక్రవారం.

# కూటములకు అతీతంగా నాకు మద్దతు

## ఉపరాష్ట్రపతి పదవికి రాజకీయాలతో సంబంధం లేదు

### ఇప్పటికే చాలామంది ఎంపీలతో మాట్లాడాను

- మహా మనుషులు అలంకరించిన గొప్ప పదవి కోసం పోటీపడే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు
- లక్నో పర్యటనలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఎంపీల మద్దతు కోరిన ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి
- న్యాయమూర్తి కంటే మెరుగైన ఎంపిక ఏముంటుంది? : అఖిలేష్ యాదవ్

**లక్నో, ఆగస్ట్ 26 (జనంసాక్షి) :** ఉప రాష్ట్రపతి పదవికి రాజకీయాలతో ఎలాంటి సంబంధమూ లేదని, అందుకే తాను రాజకీయ అంశాలపై మాట్లాడదలుచుకోలేదని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి అన్నారు. యోగ్యత విలువల ప్రాతిపదికన పార్టీలకు అతీతంగా తన అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని పార్లమెంట్ ఉభయ సభల ఎంపీలను ఆయన కోరారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో ఉన్న సమాజ్‌వాదీ పార్టీ ప్రధాన కార్యాలయంలో అఖిలేశ్, కాంగ్రెస్ నేతలతో కలిసి మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చేశారు. ఇండియా కూటమిలో లేని వ్యక్తులూ తనకు మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, వారందరికీ కృతజ్ఞుడిగా ఉంటానని సుదర్శన్ రెడ్డి చెప్పారు. ఇటీవలే తాను దిల్లీలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను, చెన్నైలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌ను కలిసినట్లు మిగతా 2లో..

**దుష్ప్రచారం చేసేందుకు యత్నిస్తున్నారు : జస్టిస్ బీఎస్ రెడ్డి**

తాను నక్సలిజానికి మద్దతు తెలిపానంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన ఆరోపణపై చర్చను పెంచాలనే ఆలోచన లేదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. తనపై దుష్ప్రచారం చేసేందుకు అధికార పక్షం నేతలు యత్నిస్తున్నారని అన్నారు. అమిత్‌షా కామెంట్‌పై ఏం చెప్పాలో ఇప్పటికే చెప్పానని, తన స్పందన కూడా మీడియాలో పతాక శీర్షికన ప్రచురితమైందని గుర్తుచేశారు. ఇంకేదో చెప్పి చర్చను సాగదీయాలని తాను భావించడం లేదన్నారు.





**న్యాయమూర్తి కంటే మెరుగైన ఎంపిక ఏముంటుంది : అఖిలేష్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్**

రాజ్యాంగం, చట్టం, ప్రజల హక్కులను సమర్థించడంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సుదీర్ఘ కెరీర్ ఆయనను అత్యున్నత రాజ్యాంగ పదవికి సాధ్యమైనంత ఉత్తమ ఎంపికగా మార్చిందని సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ అన్నారు. న్యాయం కోసం ఈ పోరాటానికి నాయకత్వం వహించడానికి న్యాయమూర్తి కంటే మెరుగైన ఎంపిక ఏముంటుందని ప్రశ్నించారు. న్యాయానికి విలువ ఇచ్చేవారు తమ మనసుతో ఆలోచించి సుదర్శన్ రెడ్డికి మద్దతు పలుకుతారని నమ్ముతున్నామని అఖిలేష్ యాదవ్ అన్నారు. అయితే ఉప రాష్ట్రపతి ఎన్నికను ఒక ప్రత్యేక భావజాలంతో ముడిపెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, అలాంటి విధానం జాతీయ ప్రయోజనాలకు విరుద్ధమని ఆయన చెప్పారు. ఇది విజయమో, ఓటమి గురించో కాదు.. విలువలు, రాజ్యాంగ సూత్రాలకు సంబంధించినదన్నారు. రాజకీయాలకు అతీతంగా రాజ్యంగ విలువలకు ప్రాతినిథ్యం వహించే అభ్యర్థిని నిలబెట్టడంలో ఉమ్మడి ప్రతిపక్షం ఐక్యత చూపించిందని హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు ప్రమోద్ తివారీ సహా కాంగ్రెస్ నాయకులకు, పార్టీ రాష్ట్ర నాయకత్వానికి అఖిలేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# నేటి నుంచి ట్యాక్సుల బాదుడు



## అమల్లోకి రానున్న ట్రంప్ ఆదేశాలు

### భారత ఎగుమతులపై 50శాతం సుంకాలు

- స్వదేశీ వస్తువులు వాడండి : మోడీ పిలుపు
- విధాన చర్యలతో స్పందిస్తాం : ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్ర

**వాషింగ్టన్, ఆగస్టు 26 (జనంసాక్షి) :** భారతీయ ఎగుమతులపై 50 శాతం సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ సర్కార్.. రష్యా చమురు కొనుగోళ్లను సాకుగా చూపి భారత్‌పై మరో 25 శాతం టారీఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. ఆగస్టు 6న ఈ ఎగ్జిటీవ్ ఆర్డర్‌పై 14329పై సంతకం చేసిన ట్రంప్..ఈ నెల 27 నుంచి 50 శాతం టారీఫ్‌లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. దీంతో తాజాగా 25 అదనపు సుంకాలపై అమెరికా అధికారికంగా బహిరంగ నోటీసులు జారీ చేసింది. భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై కొత్త సుంకాలు ఆగస్టు 27 తెల్లవారుజాము 12.01 గంటల నుంచే అమల్లోకి వస్తాయని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ద్వారా హోమ్‌లాండ్ ఆఫ్ సెక్యూరిటీ- విడుదల చేసిన నోటీసుల్లో పేర్కొంది. ఇదిలావుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన అధిక సుంకాల్లో మొత్తం ఎగుమతిదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటే.. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాత్రం టారిఫ్‌ల ప్రభావంపై మాట్లాడారు. యుఎస్ విధించిన 50 శాతం టారిఫ్‌లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. యుఎస్ టారిఫ్‌లు దేశీయ ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తే ఆర్‌బిఐ తగిన విధాన చర్యలతో స్పందిస్తుందన్నారు. మేము బ్యాంకింగ్ రంగానికి తగినంత నగదు లభ్యతను అందించాము. ముఖ్యంగా ఎక్కువగా ప్రభావితమైన రంగాలకు మద్దతును ఇవ్వడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాము. ఆర్‌బిఐ ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే మరోవైపు ఆర్థిక వృద్ధిపై దృష్టి కోల్పోలేదని మల్హోత్ర అన్నారు.భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని మల్హోత్ర ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ వద్ద ఇప్పటికే 695 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య నిల్వలు ఉన్నాయని.. ఇవి 11 నెలల విదేశీ వాణిజ్యానికి సరిపోతాయన్నారు. సుంకాల మొత్తం ప్రభావం తక్కువగా ఉంటు-ందని మల్హోత్ర తెలిపారు. అయితే.. రత్నాలు, ఆభరణాలు, మిగతా 2లో..

# బీహార్‌లో రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్ర

### సుపాల్‌లో తిరిగి ప్రారంభమైన యాత్రలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

**పాట్నా, (జనంసాక్షి) :** బీహార్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో సాగుతున్న 'వోటర్ అధికార్ యాత్ర' మంగళవారం సుపాల్‌లో తిరిగి ప్రారంభమైంది. ఈ యాత్రలో తెలంగాణ ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డి. అనసూయ (సీతక్క), పొన్నం ప్రభాకర్, తెలం గాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ప్రియాంక గాంధీ వాద్రా, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఇండియా కూటమి ప్రతినిధులు పాల్గొన్నారు. నేతలు ఎస్‌యూవీ పైకప్పుపై కూర్చుని ప్రజలకు అభివాదం చేశారు. ఒక రోజు విరామం తర్వాత ఈ యాత్ర మళ్లీ కొనసాగింది. ఆదివారం అరారియాలో జరిగిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, బీహార్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఇండియా కూటమి నియోజకవర్గాలన్నీ ఐక్యంగా కృషి చేస్తున్నాయని, మంచి ఫలితాలు సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. "మేం సైద్ధాంతికంగా, రాజకీయంగా ఒకరినొకరు గౌరవిస్తూ ఐక్యంగా ముందుకు సాగుతున్నాము. బీహార్ ఎన్నికల సందర్భంగా ఇండియా కూటమి త్వరలో సామాన్య మేనిఫెస్టోను విడుదల చేస్తుంది" అని రాహుల్ పేర్కొన్నారు. ఈ యాత్ర ఓటర్ల జాబితాలో కథిత అవకతవకలకు వ్యతిరేకంగా, ఓటు హక్కును కాపాడే లక్ష్యంతో సాగుతోంది. మిగతా 2లో..

*ఎన్నికలు ఎప్పుడు జరిగినా వాటి తేదీలను ఎన్నికల కమిషన్‌కు బదులుగా బీజేపీ నిర్ణయిస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓట్ల చోరీపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. బిహార్‌లో 'వోటర్ అధికార యాత్ర'లో భాగంగా మధుబనిలో మంగళవారం జరిగిన బహిరంగ సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ఈ ఆరోపణలు చేశారు.*



**వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్**

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలోని విఘ్నాలను తొలగించి అందరికీ ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం ప్రసాదించాలని విఘ్నేశ్వరుడుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. వాడ వాడల వెలిసే గణేష్ మండపాలలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని కోరారు. ఈ గణపతి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సంవత్సరం కూడా వినాయకుని మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# సాదాబైనామాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

- క్రమబద్ధీకరణకు తొలగిన అడ్డంకులు
- త్వరలో 9 లక్షలకుపైగా దరఖాస్తులకు మోక్షం
- న్యాయస్థానం తీర్పుతో పేద ప్రజల కలలు సాకారం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హర్షం



**హైదరాబాద్, ఆగస్ట్ 26 (జనంసాక్షి) :** ఐదేళ్లుగా కొనసాగుతోన్న సాదాబైనామాల క్రమబద్ధీకరణకు సంబంధించిన తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు వెలువరించింది. క్రమబద్ధీకరణకు స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరించేందుకు ఉన్నత న్యాయస్థానం అనుమతించింది. దీంతో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ఉన్న అడ్డంకి తొలగిపోయింది. అక్టోబరు 12, 2020 నుంచి నవంబరు 10 మధ్య దరఖాస్తులను ప్రభుత్వం స్వీకరించింది. ఈ సాదాబైనామాల క్రమబద్ధీకరణకు సంబంధించిన 2020 అక్టోబరు 10న తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది. కానీ, ఈ జీవోపై అదే ఏడాది నవంబరులో హైకోర్టు స్టే విధించింది. మిగతా 2లో..

# 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

### మొత్తం 5 రోజుల పాటు సాగనున్న సభాపర్వం

- కాళేశ్వరం కమిషన్ నివేదికపైనే ప్రధాన చర్చ
- ఉపసభాపతిని ఎంపిక చేయడంపైనా నిర్ణయం




**హైదరాబాద్, ఆగస్ట్ 26 (జనంసాక్షి) :** తెలంగాణ శాసనసభ సమావేశాలకు మళ్లీ వేళయ్యింది. ఈ నెల 30వ తేదీ నుంచి ఈ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. మొత్తం ఐదు రోజుల పాటు సభలో వివిధ అంశాలపై చర్చ సాగనుంది. ఈ నెల 29న తెలంగాణ మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేయనుండగా.. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నిర్ణయాన్ని తీసుకోనున్నట్టు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన కమిషన్ ఇచ్చిన రిపోర్టును చర్చించేందుకే ఈ అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు మిగతా 2లో..

# ఎలక్ట్రిక్ వాహనరంగంలోకి మారుతి

- తొలి ఇవి- విటారా ఉత్పత్తి ప్రారంభం
- వంద దేశాలకు ఎగుమతి లక్ష్యంగా ఉత్పత్తులు
- గుజరాత్ హన్సల్‌పూర్ ప్లాంట్‌లో ప్రారంభించిన మోడీ



**గాంధీనగర్, ఆగస్టు 26 (జనంసాక్షి):** భారత ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలకు అందిస్తున్న ప్రోత్సాహంతో అనేక కంపెనీలు భారత అవసరాలతో పాటు- విదేశాలకు ఎగుమతి చేసేందుకు ఎలక్ట్రిక్ కార్లు, ఈవీ స్కూటర్లను తయారు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మారుతీ సుజుకీ కంపెనీ తయారు చేసిన తొలి మేడిన్ ఇండియా ఎలక్ట్రిక్ కారు విదేశాల్లోనే అమ్మకాలకు సిద్ధం అయ్యింది. దేశంలో విద్యుత్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. ఈక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్‌లోని మిగతా 2లో..



పోక్సో కేసులో నిందితుడికి

# 51 ఏళ్ల శిక్ష

### నల్లగొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు

రూ.85 వేల జరిమానా

**నల్లగొండ బ్యూరో, (జనంసాక్షి):** నల్లగొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఓ బాలికపై జరిగిన అత్యాచారం కేసులో దోషిగా తేలిన వ్యక్తికి 51 ఏండ్ల జైలు శిక్ష, రూ.85 వేల జరిమానా విధించింది. నవంబర్ 3, 2021న తిప్పర్తి మండలానికి చెందిన బాలిక మిగతా 2లో..

# ఆర్థిక బిల్లులను అడ్డుకోవచ్చు

- గవర్నర్‌ల విచక్షణాధికారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..
- ఇది సమస్యాత్మ అంశమని సుప్రీం అభిప్రాయం



**న్యూఢిల్లీ, ఆగస్టు 26 (జనంసాక్షి) :** గవర్నర్ల అధికారాలకు సంబంధించి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్లకు బిల్లులను నిలిపివేసే అధికారం ఉన్నట్లయితే, ఆర్థిక బిల్లులను కూడా అడ్డుకునే అధికారం వారికి ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ అంశం సమస్యాత్మకమని, గవర్నర్లు బిల్లులకు ఆమోదం తిరస్కరించి వీటో అధికారాన్ని మిగతా 2లో..

# బంగాళాఖాతంలో అల్పపీడనం

- తెలుగు రాష్ట్రాలకు వర్ష హెచ్చరికలు
- తెలంగాణలోనూ అతి భారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరిక



**అమరావతి, ఆగస్ట్ 26 (జనంసాక్షి) :** వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల వెంబడి అల్పపీడనం ఏర్పడిందని.. ఇది రాబోయే రెండు రోజుల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదిలి మరింత బలపడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి మిగతా 2లో..




# గ్రామ పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం

### ఓటర్ల జాబితా విడుదలకు ఈసీ నోటిఫికేషన్

సెప్టెంబర్ 2న జీపీల్లో వార్డులవారీగా జాబితా ప్రదర్శన

**హైదరాబాద్, ఆగస్టు 26 (జనంసాక్షి) :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. నోటిఫై చేసిన అన్ని గ్రామ పంచాయతీల్లోని ఫోటో ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని పంచాయతీ అధికారులను ఆదేశించింది. గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా తయారీ ప్రచురణ కోసం షెడ్యూల్ సైతం విడుదల చేసింది. తెలంగాణలోని మిగతా 2లో..



# క్లౌడ్ బరస్ట్‌తో నలుగురు మృతి

### కాశ్మీర్‌లో మళ్లీ భారీ వర్షాలు

- విపత్కర వాతావరణ పరిస్థితుల కారణంగా విద్యాసంస్థలకు సెలవు
- కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని అధికారుల హెచ్చరిక

**శ్రీనగర్, ఆగస్టు 26 (జనంసాక్షి):** జమ్మూకశ్మీర్‌ను భారీ వర్షాలు కుదిపేస్తున్నాయి. స్థానికంగా ఆకస్మిక వరదలు విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలోనే డోడా జిల్లాలో క్లౌడ్‌బరస్ట్ కారణంగా నలుగురు మృతి చెందారు. మిగతా 12లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
27 ఆగస్టు 2025

# బీహార్‌లో రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్ర

ఎన్నికల తేదీలను ఎన్నికల కమిషన్‌కు బదులు బీజేపీ ఖరారు చేస్తోందని, ఓట్లు చోరీ ద్వారా ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల కమిషన్ బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. బీహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా మంగళవారం మధుబనిలో జరిగిన బహిరంగ సభలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.
ఓట్ల చోరీపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎందుకు నోరు మెదపడం లేదని రాహుల్ ప్రశ్నించారు. ఎన్డీఏ 40 ఏళ్లపాటు అధికారంలో ఉంటుందని అమిత్ షా చెప్పిన విషయం ఆయనకు ఎలా తెలుసని, ఓట్ల చోరీ ద్వారా ఎన్డీఏనే అధికారంలో ఉండవచ్చని ఎద్దేవా చేశారు. గుజరాత్ ఎన్నికల్లో మొదలైన ఓట్ల చోరీ ఇప్పుడు కేంద్ర స్థాయి వరకు విస్తరించిందని, ప్రతి రాష్ట్రంలో ఎన్నికల తేదీలను బీజేపీ ఖరారు చేస్తోందని ఆరోపించారు.ఎన్నికల అక్రమాలపై ఎవరూ ప్రశ్నించకుండా, ఎన్నికల కమిషన్‌పై కేసులు నమోదు చేయకుండా చట్టం తీసుకొచ్చారని రాహుల్ ఆరోపించారు. మహారాష్ట్ర, కర్ణాటక, మణిపూర్‌లలో కొత్త ఓటర్లు చేరిన చోట బీజేపీ విజయం సాధించిందని, ఎన్నికల కమిషన్ అధికారులు తమ విధానాలను రెండుసార్లు ఆలోచించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై ఎప్పటికైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీహార్ ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు ఇండియా కూటమి ఎంత దూరమైనా వెళ్తుందని, అరెస్సెస్ రాజ్యాంగ విలువలకు వ్యతిరేకమని రాహుల్ అన్నారు. ఓటు హక్కును కోల్పోతే రాజ్యాంగాన్ని రక్షించుకోలేమని ఆయన హెచ్చరించారు. ఈ సభలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌తో పాటు ఇండియా కూటమి నేతలు పాల్గొన్నారు.




# బీహార్ ఎన్నికల ముందు బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపికకు సన్నాహాలు

### సెప్టెంబరు 9 తర్వాత నూతన సారథి ఎంపికపై దృష్టి

న్యూఢిల్లీ, ఆగస్టు 26: బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీ ప్రకటనకు ముందే కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు బీజేపీ సన్నాహాలు చేస్తోంది. సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక తర్వాత ఈ ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు సమాచారం. పార్టీ అగ్రనాయకుల మధ్య ఇప్పటికే సంప్రదింపులు జరుగుతున్నాయి. కొందరు సంభావ్య నాయకుల పేర్లను పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తోందని, ఈసారి మహిళా నాయకురాలికి అధ్యక్ష పదవి ఇచ్చే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఏపీ బీజేపీ ఎంపీ పురందేశ్వరి వంటి వారి పేర్లు చర్చలో ఉన్నాయి.పార్టీని బలోపేతం చేయగల నాయకుడిని ఎన్నుకోవడానికి బీజేపీ ప్రాధాన్యం ఇస్తోందని, సామాజిక సమీకరణాల కంటే సంస్థాగత బలం పెంపొందించే నేతను ఎంచుకోవాలని భావిస్తోందని సమాచారం. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 2019 నుంచి ఈ పదవిలో కొనసాగుతున్నారు. ఆయన రెండో టర్మ్ 2024 జూన్‌లో ముగిసినప్పటికీ, ప్రస్తుతం కేంద్ర మంత్రిగా, జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



కొత్త అధ్యక్షుడి ఎంపికకు ముందు, 50 శాతం రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. బూత్, మండల, జిల్లా స్థాయిలో ఎన్నికలు నిర్వహించాలి. అయితే, హర్యానా, జార్ఖండ్, మహారాష్ట్ర, ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంటు సమావేశాల కారణంగా ఈ ప్రక్రియ ఆలస్యమైంది. బీహార్ ఎన్నికల ముందు నూతన అధ్యక్షుడి ఎంపికతో పార్టీ సంస్థాగతంగా బలపడాలని బీజేపీ భావిస్తోందని సమాచారం.

# బిజెపి సంస్థాగత కార్యదర్శికి ఫుట్‌బాల్ ఇచ్చి నిరసన

### నన్ను ఫుట్ బాల్ ఆడుకుంటున్నారన్న ఎంపి కొండా

**హైదరాబాద్ :** తెలంగాణలో భాజపా వ్యవహారంపై ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. తనను ఫుట్‌బాల్‌లా ఆడుకుంటున్నారని నిరసన తెలిపారు. ఇందుకు అనుగుణంగా భాజపా రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీకి కానుకగా ఫుట్‌బాల్ ఇచ్చి నిరసన తెలిపారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పార్టీ వ్యవహారంపై విశ్వేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తనను ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ తివారీని కలిస్తే.. రామచందర్ రావును కలవమంటున్నారు. రామచందర్‌రావును కలిస్తే.. అభయ్ పాటిల్‌ను కలవమంటున్నారు. ఒకరిని కలిస్తే మరొకరి పేరు చెబుతున్నారని మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుల తీరు, పార్టీ కార్యక్రమాల్లో సమన్వయ లోపంపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతుల పూజ

### సమాచారశాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక

హైదరాబాద్,ఆగస్ట్26 : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్. ప్రియాంక సూచించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం ప్రాంగణంలోని మీడియా సెంటర్‌లో సుమారు 150 మట్టి వినాయక విగ్రహాలను జర్నలిస్టు సోదరులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి నష్టం జరగకుండా మట్టి వినాయకులనే పూజించాలని, పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరుకుంటూ ప్రజలకు వినాయక చవిత హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు సంచాలకులు డిఎస్ జగన్, జాయింట్ కె. వెంకటరమణ, సమాచారశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సాహితీ ఇన్ఫ్రా సందు పూర్ణచందర్రావును అరెస్ట్ చేసిన ఈడీ

హైదరాబాద్: సాహితీ ఇన్ఫ్రా కేసులో సంస్థ మాజీ డైరెక్టర్ సందు పూర్ణచంద్రావును ఈడీ అధికారులు అరెస్టు చేశారు. ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో వినియోగదారుల నుంచి రూ.కోట్లలో డబ్బులు వసూలు చేసినట్టు సాహితీ ఇన్ఫ్రా సంస్థపై ఆరోపణలున్నాయి. ప్రజల నుంచి సాహితీ ఇన్ఫ్రా సంస్థ రూ.800 కోట్లు వసూలు చేసినట్టు అభియోగం.

తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ (భూసేకరణ) శాఖ

**ఫారం-6**

**(ప్రాథమిక ప్రకటన)**

(తెలంగాణ సవరణ చట్టం 2016లోని ఛాప్టర్ IIIఎ లోని 10ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)

గెజిట్ నెం.61/2025 తేది:23-08-2025
జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి తేది:19-08-2025
ఫైల్ నెం.జి4/3919/2025
ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), తేది:15-07-2025
యాదాద్రి భువనగిరి ఫైల్ నెం.సి/1189/4/2017

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామములో విస్తీర్ణం ఎ.1.00 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం JCRGLIP-Phase-III 24 R of L2 of Main Canal Package-7 Nawabpet Reservoir నిర్మాణములో దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీ చేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం.63 I&CAD (LA.R&R/A2) శాఖ, తేది: 29.07.2017 ద్వారా JCRGLIP-Phase-III 24 R of L2 of Main Canal Package-7 Nawabpet Reservoir కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాధి కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం-2013లోని చాప్టర్-II (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు చాప్టర్-III (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

కావున, పైన తెలిపిన భాగముగా JCRGLIP-Phase-III 24 R of L2 of Main Canal Package-7 Nawabpet Reservoir నిర్మాణ నిమిత్తం యాదాద్రి యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామములో విస్తీర్ణం ఎ. 1.00 గుంటల భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

షెడ్యూల్

గ్రామం: బండకొత్తపల్లి మండలం: గుండాల
జిల్లా:యాదాద్రి భువనగిరి

| సర్వే నెం. విస్తీర్ణం | భూమి రకం (ఖుష్కి/తరి) (పట్టా/ప్రభుత్వ/ఇనాం) | పట్టాదారుని పేరు తండ్రి/భర్త పేరు | అనుభవదారుని పేరు తండ్రి/భర్త పేరు | భూసేకరణ చేయు విస్తీర్ణం | నిర్మాణం రకం/ గ్రామం రకం | రిమార్క్స్ |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 268/ 0.29 | ఖుష్కి/ పట్టా | మెండే శంకర్ | మెండే శంకర్ | 0.29 | | కోర్టు కేస్ |
| 269/ 0.11 | ఖుష్కి/ పట్టా | యస్.సుందీప్ రెడ్డి | యస్.సుందీప్ రెడ్డి | 0.11 | | కోర్టు కేస్ |
| | | | మొత్తం: | 1.00 | | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) యొక్క నిబంధనలను అనుసరించి సంబంధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పనివేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), విభాగము-2, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీ చేసిన తేదీ నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు / తాకట్టు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలు గానీ, ఆక్షేపణలు గానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీ చేసిన తేదీ నుండి 60 (అరవై) దినములలోపు జిల్లా కలెక్టరు / అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా
సం/- అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి
సం/- జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి

DIPR RO.No.531/LA/PP/Advt/Pub/2025-26

# విశాఖలో రెండు యుద్ధనౌకలు జాతికి అంకితం

### ఆపరేషన్ సిందూర్ ముగియలేదన్న రాజ్‌నాథ్

**విశాఖపట్నం :** ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగి యలేదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. పాక్ ఉల్లంఘనలరకు పాల్పడితే మరో మారు బుద్ధి చెప్పడానికి సైనిక బలగాలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. కొత్తగా తయారు చేసిన యుద్ధ నౌకలు 'ఉదయగిరి', 'హిమగిరి'లను విశాఖపట్నంలో ఏర్పాటు- చేసిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ జాతికి అంకితం చేశారు. ఈ నౌకలను డిజైన్, స్టెల్త్, ఆయుధాలు, సెన్సార్ వ్యవస్థల్లో అత్యాధునిక సాంకేతికతో తయారు చేశారు. దేశంలోని వేర్వేరు షిప్‌యార్డులలో నిర్మించిన రెండు ఫ్రంట్‌లైన్ సర్ఫేస్ యుద్ధ నౌకలను ఒకేసారి జాతికి అంకితం చేయడం ఇదే ప్రథమం. బ్లూ వాటర్ పరిస్థితుల్లో రక్షణ బాధ్యతలను నిర్వర్తించే సామర్థం ఈ నౌకల సొంతం అని తెలిపారు. ఈ రెండు నౌకలు బహుళ పాత్రలు పోషించనున్నాయని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. స్వదేశీ యుద్ధనౌక సామర్థ్యానికి ఈ నౌకలు ప్రతీక. ఆత్మనిర్భర్ భారత్‌కి ఇవి నిదర్శనం. సాంకేతిక పరిజ్ఞానం ఈనౌకల తయారీలో ప్రతిబింబిస్తోంది. 2050 నాటికి 200 యుద్ధనౌకలు నిర్మాణం చేస్తాం అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

# జగన్ అక్రమాస్తుల కేసులో వాన్‌పిక్‌కు చుక్కెదురు

### ఛార్జిషీటులో పేరును తొలగించాలన్న పిటిషన్ కొట్టివేత

**హైదరాబాద్:** జగన్ అక్రమాస్తుల కేసులో సీబీఐ ఛార్జ్‌షీట్ నుంచి తమ సంస్థ పేరును తొలగించాలం టూ వాన్‌పిక్ దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. గతంలో వాన్‌పిక్ పేరును సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. ప్రస్తుతం ఈ కేసు నాంపల్లి సీబీఐ కోర్టులో విచారణలో ఉంది. అయితే, 2022 జులైలో వాన్‌పిక్ ప్రాజెక్ట్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. తమ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా వాన్‌పిక్ ప్రాజెక్ట్ పిటిషన్‌ను అనుమతించారని వాదించింది. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకు న్న సర్వోన్నత న్యాయస్థానం మరోసారి పిటిషన్‌ను విచారించాలని హైకోర్టును ఆదేశించింది. ఈ నేప థ్యంలో మరోసారి వాన్‌పిక్ ప్రాజెక్టుపై వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. పిటిషన్‌ను కొట్టివేసింది.

# ఎలక్ట్రిక్ వాహనరంగంలోకి మారుతి

హన్సల్‌పూర్ మారుతీసుజుకీ మోటార్ ప్లాంట్‌లో రెండు కీలక ప్రాజెక్టులు ప్రారంభించారు. మారుతీ సుజుకీ తొలికారు ఇ-విటారా తో పాటు- హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ ఉత్పత్తి చేసే తొలి ప్లాంట్‌కు జెండా ఊపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, జపాన్ రాయబారి కీచీ ఒనో పాల్గొన్నారు. భారత్ స్వావలంబన సాధించేందుకు చేస్తోన్న ప్రయత్నాలకు ఇది ప్రత్యేకమైన రోజు. ఇక్కడ ఉత్పత్తి కానున్న కార్లు 100 దేశాలకు ఎగుమతి కానున్నాయని ఈ కార్యక్రమానికి ముందు మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇ-విటారా తొలికారు యూకేకు ఎగుమతి కానుంది. తొషిబా, డెన్సో, సుజుకీసంస్థల భాగస్వామ్యంతో ఆ ప్లాంట్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ తయారుకానున్నాయి. దాంతో 80 శాతం బ్యాటరీ దేశీయంగా సిద్ధం కానుంది. ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ తన తొలి విద్యుత్ కారు ఇ-విటారా జనవరిలో ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. ఈ కారును 100కు పైగా దేశాలకు ఎగుమతి చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా భారత్‌ను గ్లోబల్ ప్రొడక్షన్ హబ్‌గా తీర్చిదిద్దాలనుకుంటున్నట్లు సుజుకీ మోటార్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ అప్పుడు వెల్లడించారు. మారుతీ సుజుకీ ఇ-విటారా రెండు బ్యాటరీ ఆప్షన్లతో వస్తోంది.

49 కిలోవాట్ అవర్ బ్యాటరీతో వస్తున్న కారు 144 హెచ్‌పీ శక్తిని, 189 కప టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 61÷ఔఠ బ్యాటరీ 174 బీహెచ్‌పీని 189 కప టార్క్‌ను విడుదల చేస్తుందని తెలుస్తోంది. అతిపెద్ద బ్యాటరీ వేరియంట్ 500 కిలోమీటర్లకు పైగా రేంజ్ ఇస్తుందని కంపెనీ ప్రదర్శించిన వీడియోలో పేర్కొంది. భారత్‌లో ఇ-విటారా తయారీకి రూ.2,100 కోట్లు- వెచ్చించినట్లు- మారుతీ సుజుకీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ హిసాషి టకేయుచి గతంలో తెలిపారు. మారుతీ సుజుకీ ఈవీలు కొనుగోలు చేసేవారికి స్మార్ట్ హోమ్ ఛార్జర్, ఇన్‌స్టలేషన్ సపోర్ట్‌ను అందించనున్నట్లు- తెలిపారు. తొలిదశలో 100 ప్రధాన నగరాల్లో ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయాలను అందించనున్నట్లు- వివరించారు. ప్రతి 5-10 కిలోమీటర్లకు మారుతీ సుజుకీ ఛార్జింగ్ పాయింట్లను అందుబాటు-లోకి తేనున్నట్లు- చెప్పారు.

# కూటములకు అతీతంగా నాకు మద్దతు

వివరించారు. దేశంలోని విపక్ష కూటమి ప్రగాఢ విశ్వాసంతో తనకు ఈ గొప్ప అవకా శాన్ని ఇచ్చిందన్నారు.అఖిలేష్ యాదవ్ సహ కారం కూడా ఇందులో మరువలేనిదని గుర్తు చేశారు. గతంలో ఉప రాష్ట్రపతి పదవిని చేపట్టి న మహానుభావుల్లో డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్, డాక్టర్ జాకిర్ హుసేన్, డాక్టర్ కేఆర్ నారాయణన్, హమీద్ అన్సారీ ఉన్నారని, అలాంటి మహా మనుషులు అలంకరించిన గొప్ప పదవి కోసం పోటీపడే అవకాశాన్ని తనకు ఇచ్చినందుకు విపక్ష పార్టీలకు కృతజ్ఞుడిగా ఉంటానన్నారు.



**హిందీలో ప్రసంగించడం నేర్చుకోలేదు..**

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ఎంపీల మద్దతును కోరేందుకే లఖ్‌నవూకు వచ్చానన్నారు. తనకు ఉప రాష్ట్రపతి పదవి లభిస్తే రాజ్యాంగ విలువల ప్రకారం బాధ్యతాయుతంగా నడుచుకుంటానని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా, సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్‌ల నుంచి తాను చాలా నేర్చుకున్నట్లు తెలిపారు. తాను దక్షిణ భారతీయుడిని అయినందున, హిందీలో ఎలా ప్రసంగించాలో ఎన్నడూ సరిగ్గా నేర్చుకోలేదన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, హిమాచల్ ప్రదేశ్‌లకు వెళ్లినప్పుడల్లా తాను హిందీలో మాట్లాడేందుకు ట్రై చేసేవాడినని ఆయన చెప్పారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు (ఐ।శా శ) కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవా లని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు సూచించారు. మరోవైపు.. తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు- భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసరాల్లో ఒడిశా వెస్ట్ బెంగాల్ తీరాలకు సమీపంలో ఉపరితల ఆవర్తనం కొనసాగిందని.. దీని ప్రభావంతో మంగళవారం ఉదయం అదే ప్రాంతంలో ఒక అల్పపీడన ప్రాంతం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల చక్రవాత ఆవర్తనం సగటు- సముద్ర మట్టం నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తువరకు కొనసాగుతూ.. ఎత్తు పెరిగే కొద్ది నైరుతి దిక్కుకు వాలి ఉందని తెలిపారు. ఈ అల్పపీడనం రాగల రెండు రోజుల్లో వాయువ్యదిశలో కదిలి మరింత బలపడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. రుతుపవన ద్రోణి ఈరోజు గంగానగర్, శిరసా, ఆగ్రా, బండ, సిద్ధి, సంబల్పూర్, వాయువ్య బంగాళాఖాతం ప్రాంతంలో ఉన్న అల్పపీడన ప్రాంతం కేంద్రం, ఆ తర్వాత తూర్పు ఆగ్నేయ దిశలో తూర్పు, మధ్య బంగాళాఖాతం వరకు సగటు- సముద్రం మట్టం నుంచి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉందని తెలిపారు. రేపు(బుధవారం), ఎల్లుండి(గురువారం) రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వివరించారు. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఈరోజు, రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 51 ఏళ్ల శిక్ష

బస్టాప్ వద్ద వేచి ఉండగా షేక్ ఖయ్యూం అనే వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమెను బలవంతంగా బండి ఎక్కించుకున్నాడు. ఓ పాడుపడ్డ ఇంట్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై ఐదు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. మూడున్నరేండ్ల విచారణ అనంతరం సదరు వ్యక్తి దోషిగా తేలడంతో పోక్సో కోర్టు ఇన్‌చార్జి జడ్జి రోజా రమణి మంగళవారం శిక్ష విధిస్తూ తుది తీర్పు వెల్లడించారు. అత్యాచారానికి సంబంధించి 20 సంవత్సరాలు, పోక్సో కేసులో మరో 20 ఏండ్లు, ఎస్సీ, ఎస్టీ కేసులో ఇంకో 10 సంవత్సరాలు అలాగే బెదిరింపులకు సంబంధించిన కేసులో మరొక ఏడాది జైలు శిక్షతో పాటు రూ.85 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.7 లక్షల నష్ట పరిహారం ప్రకటించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ వాదనలు వినిపించారు. ఐ.ఓ లుగా జి.వెంకటేశ్వర్ రెడ్డి, మట్టయ్య, కోర్ట్ పి.సి డి.కిరణ్ కుమార్ (3209), ప్రస్తుత ఎస్.హెచ్.ఓ గా ఎన్.శంకర్ కీలకంగా వ్యవహరించారు.

# జమ్ముకశ్మీర్‌లో క్లౌడ్‌బరస్ట్

కరువా, కిశ్త్‌వాడ్‌లోనూ ఇటువంటి విపత్తులు సంభవించాయి. జమ్మూ రీజియన్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. కరువా, సాంబా, దోడా, జమ్మూ, రాంబన్, కిశ్త్‌వాడ్ జిల్లాల పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్కర వాతావరణ పరిస్థితుల కారణంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. భారీ వర్షాలకుతోడు రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్, కేలా మోర్, బ్యాటరీ చెష్మా వద్ద కొండచరియలు విరిగిపడటంతో.. ముందు జాగ్రత్త చర్యగా జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను నిలిపేశారు. వరదల ధాటికి కిశ్త్‌వాడ్, దోడా, రాజౌరీ జిల్లాల్లో పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చీనాబ్, తావి, రావి తదితర నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. ఈ నెల 27వరకు క్లౌడ్ బరస్ట్‌లు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో సహాయక బృందాలను అప్రమత్తం చేసినట్లు- తెలిపారు. జమ్మూకశ్మీర్ అంతటా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంగలు పొంగుతున్నాయి. తావి, రావి వంటి ప్రధాన నదులు ప్రమాదస్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. దోడా జిల్లాలో మంగళవారం నాడు మెరుపు వరదల కారణంగా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. పదికి పైగా ఇళ్లు దెబ్బతిన్నాయి. జమ్మూలోని కథువా, సాంబ, దోడా, జమ్మూ, రాంబాన్, కిష్త్వార్ జిల్లాలతో సహా పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. వాతావరణ ప్రతికూలత దృష్ట్యా జమ్మూ డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు- పాఠశాలలను మూసివేశారు. కొండచరియలు విరిగిపడుతుండటంతో ముందుజాగ్రత్త చర్యగా జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారి వెంబడి రాకపోకలను నిలిపివేశారు. దోదాలోని కీలకమైన రోడ్డు కొట్టు-కుపోయింది. తావి నది పొంగి పొర్లుతోంది. పలు నదులు ఇప్పటికే ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నట్టు- అధికారులు తెలిపారు. జమ్మూ ప్రాంతంలో ఫ్లడ్ అలర్ట్ ప్రకటించారు. ప్రజలు నదీ ప్రవాహాలు, కొండచరియలు విరిగిపడే ప్రదేశాలకు దూరంగా ఉండాలని సూచించారు.కాగా, కథువా జిల్లాలో గత 24 గంటల్లో అత్యధికంగా 155.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దోడాలోని బదెర్వాహ్ 99.9 మి.మీ., జమ్మూలో 81.5 మి.మీ., కాత్రాలో 68.9 మి.మీ. వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. ఎత్తైన ప్రాంతాల్లో క్రౌడ్‌బరస్ట్‌లు, మెరుపు వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కశ్మీర్‌లోని సదరన్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతుండగా, జీలం నదిలో ప్రవాహం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతానికి ఫ్లడ్ అలర్ట్ ప్రకటించలేదు. సెంట్రల్ కశ్మీర్‌లో చెదురుమదురు వర్షాలు పడుతుండగా, నార్త్ కశ్మీర్‌లో ఓ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్‌లో పలు నదుల్లో నీటిమట్టం పెరుగుతుండటంతో ప్రభుత్వ యంత్రాంగం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. హెల్ప్‌లైన్ మెంబర్లను జారీ చేసింది.

# గ్రామ పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం

గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 2న ప్రదర్శించాలని అధికారులకు ఈసీ ఆదేశాలు ఇచ్చింది. ఈ నెల 28న గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో డ్రాఫ్ట్ రోల్స్ ప్రదర్శిస్తారు. ఈ నెల 29న జిల్లా స్థాయి సమావేశం, 30న మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తారు. ఆగస్టు 28 నుంచి 30వ తేదీ మధ్య అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఆగస్టు 31న వాటిని పరిష్కరిస్తారు. ఇక వచ్చే నెల 2న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్నారు.మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు జూన్ 25న తుది తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. గ్రామ పంచాయతీ ఎన్నికలను 3 నెలల్లో నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీలైనంత త్వరగా వార్డుల విభజన పూర్తిచేసి, ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచనలు చేసింది.

# 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇటీవల ఆకస్మికంగా మరణించిన జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు.. సమావేశాల తొలి రోజే అసెంబ్లీలో సంతాపం ప్రకటించనున్నారు. అదే సమయంలో ఈ సమావేశాల్లోనే ఉపసభాపతిని ఎంపిక చేయడంపైనా నిర్ణయం తీసుకోనున్నారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికకు ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది.ఈ నేపథ్యంలోనే ఈ సమావేశాల్లో పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇక ఈ సమావేశాల్లోనే సభలోని ఎమ్మెల్యేలందరికీ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌ను ప్రభుత్వం అందించనున్నట్లు తెలుస్తోంది. జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన రిపోర్టు 600 పేజీలకు పైగా ఉంది. ఈ ఈ రిపోర్టును సభ్యులందరికీ అందజేసి.. అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకుని.. ఆ తర్వాత దీనిపై పూర్తి స్థాయిలో చర్చించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. చర్చల తర్వాత.. కాళేశ్వరం కమిషన్ రిపోర్టుకు సంబంధించి తుది నిర్ణయాలు తీసుకోనున్నారు. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌ను సవాల్ చేస్తూ.. కేసీఆర్, హరీష్ రావులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే.

**కేసీఆర్ హాజరవుతారా..?**

బిఆర్‌ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కె. చంద్రశేఖర్ రావు సభకు హాజరవుతారా? అనే చర్చ కూడా రాజకీయ పార్టీలు, విశ్లేషకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కెసిఆర్ సభకు హాజరైతే కాళేశ్వరంపై చాలా లోతుగా వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. కాళేశ్వరం నిర్మాణం వల్ల లక్షలాది ఎకరాలకు సాగు నీరు అందుతున్నదని, కెసిఆర్ అభినవ భగరీథుడని బిఆర్‌ఎస్ నాయకులు పొగుడుతుండగా, మేడిగడ్డ కుంగుబాటు, కోట్లాది రూపాయల దుర్వినియోగం, అవినీతి జరిగిందని అధికార పార్టీ ఇప్పటికే ధ్వజ మెత్తుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశం ఉంది.

# నేటి నుంచి ట్యాక్సుల బాదుడు

-టె-క్స్-టైల్స్, దుస్తులు, ఎంఎస్‌ఎంఇ రంగాలపై కొంత ప్రభావం ఉండవచ్చన్నారు. ప్రభుత్వం ఉచిత వాణిజ్య ఒప్పందాలపై కూడా దృష్టి సారిస్తోందన్నారు. వృద్ధికి తమ వంతుగా ఇప్పటికే రెపోరేటు-ను 100 బేసిస్ పాయింట్లు- తగ్గించిందని గుర్తు చేశారు. అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న అంశాలను అధిగమించేందుకు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. బ్యాంక్ రుణాలను విస్తరించేందుకు అవసరమైన చర్యలను తాము పరిశీలిస్తున్నామన్నారు. పెట్టుబడుల సైకిల్‌ను సృష్టించేందుకు వీలుగా కార్పొరేట్‌లు, బ్యాంక్‌లు ఓ తాటి పైకి వచ్చి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే దేశాభివృద్ధి ముందుకెళ్తుందని మల్హోత్ర అన్నారు. ధరల స్థిరీకరణ, ఆర్థికవృద్ధే లక్ష్యంగా ద్రవ్య పరపతి విధానం కొనసాగుతుం దన్నారు. స్థూలంగా భారత ఆర్థికవ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయన్నారు.

# ఆర్థిక బిల్లులను అడ్డుకోవచ్చు

వినియోగిస్తే, ఆర్థిక బిల్లులను సైతం నిలువరించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలతో సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే ఏకీభవించారు. బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్లు మరియు రాష్ట్రపతికి కాలపరిమితి విధించడంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ప్రస్తుతం విచారణ జరుపుతోంది. గతంలో జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం బిల్లులను మూడు నెలల్లో ఆమోదించాలని ఇచ్చిన తీర్పు వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 12 సందేహాలను లేవనెత్తారు. రాజ్యాంగంలో లేని అధికారాలపై సుప్రీంకోర్టు తీర్పులు ఎలా ఇవ్వగలదని 12 ప్రశ్నలతో అపెక్స్ కోర్టుకు లేఖ రాశారు. ఈ సందర్భంలో సీజేఐ బీఆర్ గవాయ్, న్యాయమూర్తులు సూర్యకాంత్, విక్రమ్ నాథ్, పీఎస్ నరసింహా, ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారణ నిర్వహించింది. ఈ విచారణలో గవర్నర్ల విచక్షణాధికారం మరియు బిల్లుల ఆమోద ప్రక్రియపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# సాదాబైనామాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

చట్టంలో నిబంధనలు లేకుండా ఎలా క్రమబద్ధీకరిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. అయితే, కొత్తగా తెచ్చిన భూభారతి చట్టంలో ఈ క్రమబద్ధీకరణ అంశం పొందుపరిచినట్లు కోర్టుకు తాజాగా ప్రభుత్వం తెలియజేసింది. ఈ వివరణతో సంతృప్తి చెందిన న్యాయస్థానం.. సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అనుమతిస్తూ కేసు విచారణను ముగించింది. కోర్టు తీర్పుతో తెలంగాణలోని 9.5 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. ఎటువంటి రిజిస్ట్రేషన్ పత్రాలు లేకుండా సాగు చేసుకుంటున్న రైతులకు ఊరటనిచ్చేలా తీర్పు వెలువరించింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతవారం లోనే హైకోర్టు స్టే తొలగించగా.. ఇప్పుడు కేసు విచారణ ముగించి, రిజిస్ట్రేషన్‌కు అనుమతించింది.

**పరిష్కారానికి గ్రౌండ్ వర్క్ పూర్తి : మంత్రి పొంగులేటి**

సాదాబైనామాల అంశంపై హైకోర్టు స్టే తొలగించడంతో ఆ దరఖాస్తుల పరిష్కారానికి మార్గం సుగమమైందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. భూభారతి చట్టం.. సాదాబైనామాల పరిష్కారానికి దారి చూపిందని, త్వరలో 9 లక్షలకు పైగా దరఖాస్తులకు మోక్షం లభిస్తుందని అన్నారు. హైకోర్టు తీర్పు లక్షలాది మంది పేద ప్రజల కలలను సాకారం చేస్తుందని అభిప్రాయపడ్డారు. సాదాబైనామాల విషయంలో గత ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.. కానీ, పరిష్కారం చూపలేదన్నారు. ఫలితంగా 9.26 లక్షల దరఖాస్తులు పరిష్కారం కాకుండా నిలిచిపోయాయని, కొందరు హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. సాదాబైనామాల దరఖాస్తుల పరిష్కారానికి ఇప్పటికే గ్రౌండ్ వర్క్ పూర్తి చేసినట్లు మంత్రి పొంగులేటి వివరించారు.

# సీఎం రేవంత్ రెడ్డిది బజారు భాష

- ప్రజలను మభ్య పెట్టేందుకు ఎత్తులు
- ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని గుర్తించాలి
- మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు మధుసూధనాచారి, జోగు




**హైదరాబాద్, ఆగస్ట్26 (జనంసాక్షి) :** సీఎం రేవంత్ రెడ్డి బజారు భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. మంగళవారం తెలంగాణభవన్ లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఫామ్‌హౌజ్‌లో మానవ మృగాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం తీవ్రమైన విషయమన్నారు. కేసీఆర్‌కు, తెలంగాణ ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని మధుసూదనాచారి డిమాండ్ చేశారు. అహింస పద్ధతుల్లో తెలంగాణ తెచ్చిన మరో గాంధీ కేసీఆర్ అని అన్నారు. మృగత్వానికి ప్రతిరూపాలు కాంగ్రెస్ పాలకులే అని చెప్పారు. ఎమర్జెన్సీ పెట్టి ప్రజలతో హాహాకారాలు చేయించిన ఇందిరాగాంధీ మృగత్వానికి ప్రతీక అన్నారు. నాడు ఢిల్లీలో టర్క్ మెన్ గేట్ దగ్గర వెలాది పేదల ఇండ్లు కూల్చిన మృగత్వం కాంగ్రెస్ పార్టీ సొంతమని విమర్శించారు. 1969 ఉద్యమంలో వందలాది మందిని పొట్టన పెట్టు-కున్న మృగత్వం కాంగ్రెస్ పార్టీదేనని, సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మృగత్వం ఆనవాళ్లను వంట పట్టించుకున్నారని మధుసూదనాచారి విమర్శించారు. హామీలను నెరవేర్చడం చేతగాకనే సీఎం రేవంత్ రెడ్డి పిచ్చి భాష మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణను సువర్ణ తెలంగాణగా మార్చిన కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. తెలంగాణలో ప్రధాన సమస్యలన్నింటిని కేసీఆర్ పరిష్కరించారని అన్నారు. సీఎం రేవంత్‌కు అధికారంతో ఒళ్ళు కొవ్వెక్కిందని మధుసూదనాచారి ఆగ్రహం వ్యక్తంచేశారు. అందుకే బలుపు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం మాటలకు విశ్వసనీయత లేదని అన్నారు. అది నోరా.. మోరా..? అని మండిపడ్డారు. యూరియా ఇవ్వని అసమర్థుడు రేవంత్ రెడ్డి అని చెప్పారు. గతంలో ఏ కాంగ్రెస్ సీఎం ఇంత నీచమైన భాష మాట్లాడలేదన్నారు. రేవంత్ రెడ్డి ఓయూను స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలు చేస్తాననడం హాస్యాస్పదమన్నారు. ప్రజలను క్షోభ పెడుతూ రేవంత్ మాయమాటలు చెబుతున్నారని మధుసూదనాచారి మండిపడ్డారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వంద సీట్లు-గెలుస్తామంటున్నాడని, ముందుగా పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలిపించుకోవాలి సవాల్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే సీఎం రేవంత్ రెడ్డికి రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. ప్రగతి భవన్ కంచెలు తీశామని చెబుతూ ఓయూలో కంచెలు ఎందుకు ఏర్పాటు చేశావని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సీఎం పోస్టుకు గౌరవం పెంచేలా మాట్లాడాలని, పిచ్చి వాగుడు వాగితే ప్రజలే బుద్ది చెబుతారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రవర్తన ఏమాత్రం బాగలేదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. రేవంత్ రెడ్డి ఎక్కడికి వెళ్లినా కాళేశ్వరం పాట పాడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థుల దగ్గరకు వెళ్లి కూడా కేసీఆర్ గురించి మాట్లాడుతున్నారని, నిత్యం కేసీఆర్‌ను తలుచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ప్రవర్తన వల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటు-ందని జోగు రామన్న మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో కట్టిన భవనాలకు రేవంత్ రెడ్డి రిబ్బన్ కట్ చేస్తున్నారని, ఆయన కొత్తగా చేసిన అభివృద్ధి ఏమీ ఏమీ లేదని అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా విఫలమయ్యారని విమర్శించారు. రేవంత్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

# నేడు ఖైరతాబాద్ వినాయకుడికి ప్రాణప్రతిష్ట

- ప్రత్యేక ఏర్పాట్లతో పాటు బందోబస్తు
- ట్రాఫిక్ మళ్లింపు ప్రకటించిన పోలీసులు



**హైదరాబాద్, ఆగస్ట్26 (జనంసాక్షి) :** గణేశ్ ఉత్సవాల్లో ఖైరతాబాద్ గణేశుడికి ఏటా ఆదరన పెరుగుతోంది. ప్రతిరోజూ లక్ష నుంచి రెండు లక్షల మంది భక్తులు ఖైరతాబాద్ గణపతి వద్దకు వస్తుంటారు. ఇక వారాంతపు రోజులైన శని, ఆదివారాల్లో ఈ సంఖ్య 3 నుంచి 5 లక్షల వరకు ఉంటుంది. ఈసారి ఇంతకు మించి భక్తులు వస్తారనే అంచనాల నేపథ్యంలో ఖైరతాబాద్ గణపతి వద్ద పోలీసులు ఎప్పుడూ లేనంత బందోబస్తును నిర్వహించనున్నారు. ఈ విషయమై సైఫాబాద్ ఏసీపీ ఆర్. సంజయ్‌కుమార్ వివరాలను మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. ఇక్కడ ఆరుగురు డీఎస్పీలు, 23 మంది ఇన్‌స్పెక్టర్లు, 52 మంది ఎస్ఐలు, 150 మంది కానిస్టేబుళ్లు, 50 మంది మహిళా కానిస్టేబుళ్లు, 22 ప్లటూన్ల సిబ్బందిని వినయోగిస్తున్నట్లు- తెలిపారు. ప్రతి రోజూ తరచుగా డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తాయని, 60 సీసీ కెమెరాల ద్వారా భక్తుల భద్రతను సమీక్షిస్తామని తెలిపారు. అన్ని మార్గాల్లో డోర్ ఫ్రేం, హ్యాండ్ మెటల్ డిటెక్టర్లతో భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకే దర్శనానికి అనుమతి ఉంటుందన్నారు. భక్తులు విలువైన ఆభరణాలను, వస్తువులను తీసుకొని రాకూడదని తెలిపారు. ఉత్సవ కమిటీల ప్రతినిధులు అతిథులు, వీఐపీలను సాధ్యమైనంత వరకు ఉదయం నుంచి మధ్యాహ్నంలోపే వచ్చేలా ఆహ్వానించాలని కోరారు. ఉత్సవ కమిటీ-తరపున 100 మంది ప్రైవేట్ సెక్యూరిటీ-సిబ్బందిని తమకు అందించాలని పోలీసులు కోరారు. తమ సిబ్బందికి అదనంగా వారి సేవలను 3 షిఫ్టుల్లో వాడుకుంటామని, మొత్తం 100 మందిని తమకు అప్పగిస్తే వారికి పోలీసు అధికారులు అవసరం మేరకు వినియోగించుకుంటారని ఏసీపీ సంజయ్ కుమార్ తెలిపారు. ఖైరతాబాద్‌లో బుధవారం బడా గణేశ్ కొలువు దీరనున్నాడు. గణనాథుడిని చూసేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారు. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్ చుట్టుపక్కల పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని వెల్లడించారు. ఖైరతాబాద్, షాదన్ కాలేజీ, నిరంకారి, ఓల్డ్ పీఎస్ సైఫాబాద్, మింట్‌కాంపౌండ్, నెక్లెస్ రోటరీ వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశాలు ఎక్కువ అని తెలిపారు. ఈ నేపథ్యంలో పది రోజులపాటు వాహనాలు దారిమళ్లింపులు ఉంటాయని చెప్పారు. ఈ నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు.

## సీఎం ప్రజావాణిలో 282 దరఖాస్తులు

- దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 282 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 107, రెవెన్యూ శాఖకు సంబంధించి 48, విద్యుత్ శాఖకు 17, ఇందిరమ్మ ఇండ్ల కోసం 58, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 51 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## తెలంగాణ యువజన సంఘం ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులుగా దాసరి శాశంకర్ నియామకం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ యువజన సంఘం ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులుగా దాసరి శశాంకర్ (రీసెర్చ్ స్కాలర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లిష్)ను నియమిస్తూ తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు నియామక ఉత్తర్వులు జారీ చేసారు. ఈ సందర్భంగా దాసరి శాశంకర్ మాట్లాడుతూ తనని ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులు గా నియమించిన తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు గారికి ధన్యవాదములు తెలియజేసారు. ఉస్మానియా యూనివర్సిటీలో తెలంగాణ యువజన సంఘము బలోపేతం కోసం కృషి చేస్తానని, విద్యార్థి, యువత ఎదురకొంటున్న సమస్యల పరిష్కారం కై భవిష్యత్తు పోరాటాలు నిర్వహిస్తానని శాశంకర్ తెలియజేసారు.



## ఈ అమ్మాయిలంతా ఇంతేనా సినిమా పోస్టర్ ఆవిష్కరణ

- ఆవిష్కరించిన మాజీమంత్రి మల్లారెడ్డి

**చెన్నారావుపేట, ఆగస్టు 26 (జనం సాక్షి):** ఈ అమ్మాయిలంతా ఇంతేనా సినిమా పోస్టర్ ను మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆవిష్కరించారు. సినీ ప్రేక్షకులకు మంచి చిత్రాలను అందించాలనే తపనతో చిత్రాలను రూపొందించే దర్శకుడు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం అక్కల్ చెడ గ్రామానికి చెందిన జాల దేవరాజ్ అని మల్లారెడ్డి ఈ సందర్భంగా కొనియాడారు. బాస్విక్ రెడ్డి ఆర్ట్స్ క్రియేషన్స్, డీఆర్ ప్రొడక్షన్స్ పై రాబోతున్న ఈ అమ్మాయిలంతా ఇంతేనా సినిమా పోస్టర్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి మల్లారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు దేవరాజ్ మాట్లాడుతూ త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుందన్నారు. చెన్నారావుపేట మండలం అక్కల్ చెడ నుండి వచ్చిన నేను ఎంతో టాలెంట్ ఉన్నా సరైన ప్రోత్సాహం లేకపోయినా ఈ చిత్రాన్ని చాలా కష్టపడి రూపొందించానన్నారు. డి10 టైటిల్ విన్నర్ రాజు, విజయ్ హీరోగా హీరోయిన్ కావ్య, నటులు- కృష్ణ, సదానందం, ప్రభు, రక్షిత, పుష్ప, బాబురావు, బబ్లూ, తదితరులు ఈ సినిమాలో నటించినట్లు తెలిపారు. సినిమాటో గ్రఫీ - కాసింకోట సతీష్, డైలాగ్స్ రాజేష్ బాబు, అదనపు డైలాగ్స్- దేవరాజ్, శశిధర్, ఎడిటర్ గా -ప్రభు వ్యవహరించారని తెలిపారు. ప్రేక్షకులు మంచి సినిమాలను ఆదరించాలని దర్శకుడు దేవరాజ్ ఈ సందర్భంగా కోరారు.

# ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తా

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**లింగాల గణపురం, ఆగస్టు 26 ( జనం సాక్షి ) :** ఏడాదిలో దేవాదులపనులు పూర్తిచేసి నియోజకవర్గం లోని ప్రతీ ఎకరానికి సాగు నీరు అందిస్తానని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభి వృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర-2025 కార్యక్రమంలో భాగంగా లింగాల ఘనపూర్ మండలం లోని కళ్లెం, సిరిపురం, జీడికల్, గుమ్మడివెల్లి, లింగాల ఘనపూర్, నెలపోగుల, కొత్తపల్లి, వడిచర్ల, నెల్లూట్ల గ్రామాలలో 2కోట్ల 75 లక్షల తో ఎస్సి కాలనీలలో నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణా నికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఎమ్మెల్యేఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజలకు సాగు నీటిపై ఒక స్పష్టమైన హామీ ఇచ్చానని, దానికి అనుగుణంగానే ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత అనేక సార్లు నీటి పారుదల శాఖ అధికారులతో దేవాదుల ప్రాజెక్టుపై సమీక్షా సమావేశాలు నిర్వహించానని తెలి పారు. దేవాదుల ద్వారా నియోజకవర్గంలో లక్షా 20 వేల ఎకరాలకు సాగు నీరు అందించే అవకాశం ఉంద ని దానికి చేపట్టాల్సినపనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికీ, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిదృష్టికి తీసుకువెళ్లి ఘనపూర్ రిజర్వాయర్ నుండి నవాబ్ పేట రిజర్వాయర్ ప్రధాన కాలువ సిసి లైనింగ్ కు 150కోట్లు మంజూరు చేయించానని అన్నారు. ప్రస్తుతం ఆ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పుడు ఆ కాలువ ద్వారానే నవాబ్ పేట రిజర్వాయ ర్ కు నీళ్లు తీసుకురాగాలిగమని వెల్లడించారు. అలాగే అశ్వరావుపల్లి రిజర్వాయర్ కింద 38వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని రఘునాథపల్లి, లింగాల ఘనపూర్ మండలాలలో 18వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని అన్నారు. మొట్టమొదటి సారిగా జీడికల్ దేవస్థానంచెరువుకు గోదావరిజలాలు తీసుకు వచ్చానని అన్నారు. గండిరామారం కుడికాలువద్వారా 5వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 26 కోట్ల తో చేపట్టిన పనులు పూర్తి అయ్యాయని ఈ నెల 29 లేదా 30న లిఫ్ట్ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపా రు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి లింగాల ఘనపూర్ మండలాన్ని అన్ని రకాలుగా అభి వృద్ధి చేసుకుందామని, దానికి కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, జనగామ మార్కెట్ కమి టి వైస్ చైర్మన్ కొల్లూరి శివకుమార్, ఆర్డీఓ గోపీరామ్, జిల్లా గ్రామీణ అభివృద్ధిసంస్థ అధికారి వసంత, తహసీ ల్దార్ రవీందర్, ఎంపిడిఓ రఘురామకృష్ణ, మాజీ జెడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి, వంగ నాగరాజ్, కామెడీ బిక్షపతి, బిట్ల బాబు, సదానం దం, పోరెడ్డి మల్లారెడ్డి, నాగేందర్, నీల మోహన్, గుగ్గిళ్ల నరసయ్య, కీసర దిలీప్ రెడ్డి, శ్రీలత రెడ్డి, నీలం మోహన్, శ్రీలత, జీడికల్ ఆలయ చైర్మన్ ఎలా మూర్తి, బస్వాగాని అనిల్, సంపత్, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## యశోద ఆసుపత్రిలో అరుదైన సయాటికా నరాల శస్త్ర చికిత్స




**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 26 (జనంసాక్షి) :** అతి క్లిష్టమైన సయాటికా నరాల శస్త్రచికిత్సను యశోద ఆసుపత్రి డాక్టర్లు విజయవంతం చేశారని, స్పర్శ కోల్పోయి తొమ్మిది నెలలుగా బెడ్ కే పరిమితమైన 24 ఏళ్ల యువకుడిని ఆరోగ్యవంతుడిగా చేశామని యశోద ఆసుపత్రి అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) పాలకుర్తి నవీన్ కుమార్ తెలిపారు. మంగళవారం నాడు మంచిర్యాల పట్టణంలోని నార్త్ ఇన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) పాలకుర్తి నవీన్ కుమార్ మాట్లాడుతూ.. కొమురం భీమ్ ఆసిఫాబాద్ కు చెందిన 24 ఏళ్ల పవన్ కుమార్ రోడ్డు ప్రమాదానికి గురైన పేషేంట్ తొమ్మిది నెలలుగా ఎటువంటి మెరుగుదల లేకుండా నిరంతరంగా వివిధ లక్షణాలతో బాధ పడుతూ ఉన్నాడని తెలిపారు. తీవ్రమైన న్యూరోపతిక్ నొప్పి కారణంగా అతను కూర్చో లేకపోయాడు. ఆయన నడవలేక అనేక ఇబ్బందులు పడేవాడిని అతి కష్టంగా అడుగులు వేస్తూ నడవాల్సి వచ్చింది. పేషేంట్ కు నిరంతర నొప్పి, స్పర్శ కోల్పోవడం, ఫుట్ డ్రాప్ మరియు టెండో ఆచిల్లెస్ స్నాయువు యొక్క తీవ్రమైన సంకోచంతో బాధ పడుతున్నాడు. సర్జరీ పూర్తయిన తర్వాత కొన్ని నెలలపాటు ఫిజియోథెరపీ అందించినప్పటికీ అతని పరిస్థితి మెరుగుపడలేదు. క్షుణ్ణంగా పరీక్షలు చేసిన తర్వాత, ప్లాస్టిక్, పునర్నిర్మాణ శస్త్రచికిత్స విభాగం మార్చి 22, 2025న సంక్లిష్టమైన సయాటిక్ నరాల న్యూరోలిసిస్ మరియు టెండోఅచిల్లెస్ లెంగ్దే నింగ్ సర్జరీని నిర్వహించామని పేర్కొన్నారు. శస్త్రచికిత్స సమయంలో, గత శస్త్రచికిత్స ఇంప్లాంట్ల చుట్టూ ఉన్న మచ్చ కణజాలంలో సయాటిక్ నరం చిక్కుకున్నట్లు వైద్యులు కనుగొన్నారు. నాడిని జాగ్రత్తగా విడుదల చేసి, న్యూరోలైసిస్ చేసి, వైద్యంను ప్రోత్సహించడానికి హైడ్రోకార్టిసోన్ ఇచ్చారు. అదనంగా, పాదం యొక్క డోర్సిఫ్లెక్షన్ను పునరుద్ధరించడానికి టెండో అచిల్లెస్ స్నాయువు -ప్లాస్టీ లెంగ్లెనింగ్ నిర్వహించబడింది. శస్త్రచికిత్స తర్వాత, రోగికి గణనీయంగా స్పర్శ తెలియడం మరియు పాదాల పనితీరు మెరుగుపడింది. దీంతో అరుదైన శస్త్ర చికిత్స విజయవంతమైనది. గత 30 సంవత్సరాల గా హైదరాబాదులోని యశోద హాస్పిటల్ లు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నాలుగు బ్రాంచ్ లు(సికింద్రాబాద్, సోమాజిగూడ, మలక్ పేట్, హైటెక్ సిటీ) 4000 పడకలు కలిగి ఉన్న అద్భుతంగా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్. అది నాకున్న సాంకేతికతో వైద్య సేవలు అందిస్తున్నామని అసిస్టెంట్ మేనేజర్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లా?

- పాలకుర్తిలో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా



**పాలకుర్తి, అగస్టు 26 (జనంసాక్షి) :** స్థానిక సమస్యలను పరిష్కరించలేని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని, డిమాండ్ చేస్తూ, మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారతీ జనతాపార్టీ ఆదద్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు కాంగ్రెస్ కార్యకర్తలకు అందిస్తున్నారని ఆరోపించారు. అందులో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు ఇవ్వకుండా కాంగ్రెస్ కార్యకర్తలకే మంజూరి చేశారని అన్నారు. గత ప్రభుత్వం గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను అర్హులైన నిరుపేదలను గుర్తించి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సైడ్ డ్రైనేజీల నిర్మాణం వెంటనే చేపట్టాలని, గ్రామాల్లో పెండింగ్లో ఉన్న మౌళిక సౌకర్యాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో సింగిల్ ఫేస్ విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ నాగేశ్వరాచారికి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో చింత సృజన్, దుంపల సంపత్, పులిగిల్ల ఉపేందర్, కడుదుల నిరం జన్రెడ్డి, వేల్పుల దేవరాజ్, పెనుగొండ సోమేశ్వర్, లాకావత్ రవి, బెల్లి సతీష్, రాము, మారజోడు శంకర్ ఉన్నారు.

## బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

**హైదరాబాద్, ఆగస్ట్26 (జనంసాక్షి) :** ఉపరితల ఆవర్తన ప్రభావంతో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తనం పశ్చిమ వాయువ్య దిశలో కదిలి ఉత్తర ఒడిశా దాని సమీపంలోని చత్తీస్‌గఢ్‌ల మీదుగా కదిలే అవకాశం ఉందని పేర్కొంది. రాబోయే రెండు రోజుల్లో అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉందని వివరించింది. తెలంగాణతో పాటు-ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురువనున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురువనున్నాయి. కాకినాడ, పోలవరం, ఏలూరులో భారీ వర్షాలు, ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

## జగన్ అక్రమాస్తుల కేసులో వాన్‌పిక్‌కు చుక్కెదురు

- ఛార్జిషీటులో పేరును తొలగించాలన్న పిటిషన్ కొట్టివేత

**హైదరాబాద్, ఆగస్ట్26 (జనంసాక్షి) :** జగన్ అక్రమాస్తుల కేసులో సీబీఐ ఛార్జ్‌షీట్ నుంచి తమ సంస్థ పేరును తొలగించాలంటూ వాన్‌పిక్ దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. గతంలో వాన్‌పిక్ పేరును సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. ప్రస్తుతం ఈ కేసు నాంపల్లి సీబీఐ కోర్టులో విచారణలో ఉంది. 2022 జులైలో వాన్‌పిక్ ప్రాజెక్ట్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. తమ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా వాన్‌పిక్ ప్రాజెక్ట్ పిటిషన్‌ను అనుమతించారని వాదించింది. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం మరోసారి పిటిషన్‌ను విచారించాలని హైకోర్టును ఆదేశించింది. ఈ నేపథ్యంలో మరోసారి వాన్‌పిక్ ప్రాజెక్టుపై వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. పిటిషన్‌ను కొట్టివేసింది.

## బిజెపి సంస్థాగత కార్యదర్శికి ఫుట్‌బాల్ ఇచ్చి నిరసన

- నన్ను ఫుట్ బాల్ ఆడుకుంటున్నారన్న ఎంపి కొండా



**హైదరాబాద్, ఆగస్ట్26 (జనంసాక్షి) :** తెలంగాణలో భాజపా వ్యవహారంపై ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. తనను ఫుట్‌బాల్‌లా ఆడుకుంటున్నారని నిరసన తెలిపారు. ఇందుకు అనుగుణంగా భాజపా రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీకి కానుకగా ఫుట్‌బాల్ ఇచ్చి నిరసన తెలిపారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పార్టీ వ్యవహారంపై విశ్వేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తనను ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ తివారీని కలిస్తే.. రామచందర్ రావును కలవమంటున్నారు. రామచందర్‌రావును కలిస్తే.. అభయ్ పాటిల్‌ను కలవమంటున్నారు. ఒకరిని కలిస్తే మరొకరి పేరు చెబుతున్నారని మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుల తీరు, పార్టీ కార్యక్రమాల్లో సమన్వయ లోపంపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

## ఎ(ర)రు వేస్తే..

ఎరవేస్తే
విశ్వాసిత కుక్కై నీ ఇంటికి నీ చేనుకి
రేబవళ్లు కాపలా అవుతుంది
ఎరువేస్తే
మొక్క చెట్టులా చెట్టు వృక్షంలా
ఎ(ఒ)దిగి
ఎండలో నీడలా
వానలో గొడుగులా వీధికి పెద్దదిక్కులా

**కోటం చంద్రశేఖర్, 9492043348**

## అమ్మ కొంగుచాటున

పిల్లాడు దాక్కున్నట్టు
మేఘాల మాటున
సూరీడు దాక్కుండి పోయాడు
ఆకాశం కిందకి దిగివచ్చిందా అన్నట్లు
పొగ మంచు పర్వతపు అంచులని
తడి చేస్తూ తాకుతూ వెలుతోంది
ఆకాశం నుంచి జారిన
వర్షపు చినుకులు
నిశ్చలమైన నీటి మడుగులో
పడ్డప్పుడు వచ్చిన శబ్దంతో
అడుగున నిద్రిస్తున్న చేప
టక్కున కళ్ళు తెరిచింది
ఏటికి ఎదురీదే సమయం ఆసన్నమైందని
రెక్కలు విప్పి విహరిస్తున్న పక్షి
గూటికి చేరి ఒనుకుతూ
పిల్లలకి తన ఒడిలో వెచ్చదనాన్ని
ఇస్తూ ఒదిగిపోయింది
వర్షంలో చిక్కుకున్న
చీమల గుంపు ఒకటి
ఒకదానికొకటి అంటిపెట్టుకొని
గొలుసుకట్టులా మారి
ముందుకు వెళుతునే ఉన్నాయ్
కొన్ని ప్రయాణాలు
వర్షంతోనే మొదలవుతాయి
కొన్ని వర్షంతోనే ఆగిపోతాయి
ఇంకొన్ని ప్రయాణాలు
వర్షం వచ్చినా రాకున్నా
ఆగిపోకుండా
ముందుకు సాగిపోతూనే ఉంటాయ్
అలుపెరుగని బాటసారిలా

**కోనేటి నరేష్**
**శ్రీ సత్యసాయి జిల్లా**
**8499847863**

# కష్టజీవుల పోరాటయోధుడు కామ్రేడ్ సురవరం

మార్క్సిజం వెలుగులో ఎర్రజెండా నీడలో అంతిమ శ్వాస వరకు ఎత్తిన జెండా దించకుండా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఒకే పార్టీలో కొనసాగి ఎందరికో ఆదర్శ ప్రాయుడుగా నిలిచి పేద ప్రజల గుండెల్లో చిరస్మరణీయమైన ముద్రవేసిన కష్టజీవుల పోరాటయోధుడు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి ఈ నెల 22 నాడు మరణించడం కడు విషాదకరం. విద్యార్థి దశ నుండి పోరాట స్వభావాన్ని ఆయన అలవర్చుకొని అతి సాధారణ కార్యకర్త నుండి అంచెలంచెలుగా ఎదిగి జాతీయ రాజకీయాలోకి ప్రవేశించి తెలుగు నేల నుండి మూడు పర్యాయాలు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి గాను, రెండు పర్యాయాలు నల్గొండ పార్లమెంట్ సభ్యుడు గాను నిరుపమాన సేవలు అందించారు. తన వాగ్ధాటితో ఆయన ఎందరినో ఆకట్టుకుని గొప్ప జనార్షక నేతగా వెలుగొందారు. పెట్టుబడిదారీ - సామ్రాజ్యవాద విధానాలను ఆయన తీవ్రంగా ప్రతిఘటించారు. అలాగే మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా లౌకిక ప్రజాతంత్ర ఉద్యమాల ద్వారా ఆయన తీవ్రంగా నిరసించారు. తన జీవితమంతా ఆయన కష్టజీవుల అభ్యున్నతి కోసం అంకితం చేసి ఆ దిశగా నిరంతరం ఉద్యమించారు. ఆయన అనేక సవాళ్లను అధిగమించి సాధారణ స్థాయి నుండి ఉన్నత స్థానానికి ఎదిగిననూ కూడా అతి సాధారణ జీవితాన్ని గడిపారు.

కష్టజీవుల పోరాటయోధుడు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని కోడేరు మండలంలో గల కొండ్రావుపల్లి గ్రామంలో సురవరం వెంకట్రామిరెడ్డి, ఈశ్వరమ్మ దంపతులకు 1942 మార్చి 25 నాడు ప్రథమ సంతానంగా జన్మించారు. నేటి జోగులాంబ గద్వాల జిల్లాలోని ఉండవల్లి మండలం కంచుపాడు ఆయన స్వగ్రామం. తండ్రి సురవరం వెంకట్రామిరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడు మరియు తెలంగాణా సాయుధ పోరాట యోధుడు. తండ్రి నుండి ఆయన చిన్నతనంలోనే పోరాట స్వభావాన్ని అలవర్చుకున్నారు. తెలంగాణ సాంస్కృతిక రంగ వైతాళికుడు, గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడు సురవరం ప్రతాపరెడ్డి ఆయనకు పెదనాన్న కావడం గమనార్హం. ఒకవైపు తండ్రి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న సురవరం మరోవైపు పెదనాన్న కొనసాగించిన సాంస్కృతిక ఉద్యమ ఆదర్శాలను అనుసరించడం విశేషం. స్వగ్రామమైన కంచుపాడుపై ఉన్న మమకారంతో ఆయన తన తండ్రి వెంకట్రామిరెడ్డి పేరు మీద విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎందరినో విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దారు.

సురవరం సుధాకర్‌రెడ్డి తన పదేళ్ల వయస్సులోనే సాహిత్యం చదవడం అలవరచుకున్నారు. విద్యార్థి దశలో ఉన్నప్పుడే ఆయనను కమ్యూనిస్టు భావజాలం ఎంతగానో ఆకర్షించింది. ఫలితంగా ఆయన విద్యార్థి దశ నుంచి ప్రశ్నించడం అలవరచుకున్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి 1957లో కర్నూలులోని మున్సిపల్ పాఠశాలలో ఎస్.ఎస్.ఎల్.సి చదువుతున్న సమయంలో 15 ఏళ్ల వయసులో పాఠశాలల్లో బ్లాక్ బోర్డ్స్, చాక్‌పీస్ మరియు ప్రాథమిక అవసరాల కోసం చేపట్టిన ఆందోళన కర్నూలు జిల్లాలోని అన్ని పాఠశాలలకు విస్తరించి ఉద్యమంగా మారడంతో ఆయన జీవితానికి రాజకీయ బాటలు పరిచింది అని చెప్పవచ్చు.



సురవరం సుధాకర్‌రెడ్డి 19 ఏళ్లకే అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎ.ఐ.ఎస్.ఎఫ్) కర్నూలు పట్టణ విభాగానికి కార్యదర్శిగా ఎన్నికై 1960 నాటికి కర్నూలు జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1962లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆయా విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం 56 రోజుల పాటు ఏకధాటిగా పెద్దఎత్తున నిర్వహించిన సమ్మెకు సురవరం సుధాకర్ రెడ్డి నాయకత్వం వహించి సరికొత్త చరిత్ర సృష్టించారు. ఆయన 1964లో కర్నూలులో బి.ఏ చదువుతున్న సమయంలో కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ప్రతి విద్యార్థికి చదువు మరియు పోరాటం రెండు కళ్ళు అని ఆయన తరచుగా పేర్కొనేవారు.

డిగ్రీ తర్వాత విజయవాడలోని విశాలాంధ్ర దినపత్రికలో సురవరం సుధాకర్‌రెడ్డి పనిచేయాలనుకున్నారు. కాని పార్టీ ఆదేశం మేరకు ఆయన 1965లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.బి కోర్సులో చేరి కళాశాల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఎ.ఐ.ఎస్.ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాధ్యతలు చేపట్టారు. 1966లో ఎ.ఐ.ఎస్.ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1967లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని లా కాలేజీ నుండి ఎల్.ఎల్.బి డిగ్రీని పొందారు. 1968లో ఎల్.ఎల్.ఎమ్ కోర్సులో చేరినప్పటికి ఆయన విద్యార్థి నాయకుడిగా కొనసాగుతుండటంతో దాన్ని పూర్తి చేయలేకపోయారు.

కేరళకు చెందిన చంద్రప్పన్‌తో కలిసి సురవరం సుధాకర్‌రెడ్డి '18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించాలి' అని 1969 లో పార్లమెంటు ముందు మహాప్రదర్శన నిర్వహించారు. 1970లో సురవరం సుధాకర్‌రెడ్డి ఎ.ఐ.ఎస్.ఎఫ్ జాతీయ అధ్యక్షుడుగా ఎన్నికై అనేక విద్యారంగ సమస్యల పరిష్కారాల కోసం ఉద్యమించారు. అలాగే ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో విద్యార్థి సంఘాన్ని పునరుద్ధించడంలో అయిన ప్రముఖ పాత్ర వహించాడు. సోవియట్ యూనియన్, చెకొస్లొవేకియా, హంగేరి, ఆఫ్ఘనిస్తాన్ లాంటి దేశాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన అంతర్జాతీయ విద్యార్థి సంఘం కార్యవర్గ సభ్యుని హోదాలో పాల్గొన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి 1972లో ఎ.ఐ.వై.ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి కాశ్మీర్ నుంచి కేరళ వరకూ విద్యార్థి, యువజనోద్యమాల బలోపేతానికి విస్తృతంగా పర్యటించారు. విద్యార్థి, యువజన ఉద్యమాల్లో నిరసనలు చేస్తున్న క్రమంలో ఆయన దేశవ్యాప్తంగా ఢిల్లీ, కోల్‌కత్తా, పాట్నా, లక్నోలతోపాటు అనేక చోట్ల నిర్బంధాలకు గురయ్యారు.

రాజమండ్రిలో 1974లో జరిగిన సి.పి.ఐ రాష్ట్ర మహాసభలో సురవరం సుధాకర్‌రెడ్డి పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికై రెండు పర్యాయాలు 1984 వరకు ఆ బాధ్యతలు నిర్వహించారు. తన తల్లి తరపు బంధువులు ఉన్న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సురవరం సుధాకర్‌రెడ్డి 1985, 1989 లలో ఎం.ఎల్.ఎ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. మళ్ళీ పార్టీ అదేశానుసారం 1994 లో కర్నూలు జిల్లాలో పార్టీ బలంగా ఉన్న డోన్ నియోజకవర్గంలో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డిపై పోటీ చేసిననూ ఆ ప్రాంతాల్లో ఫ్యాక్షన్ ముఠాలు రిగ్గింగ్‌లకు పాల్పడటంతో ఆయన ఓటమి చెందారు.

సురవరం సుధాకర్‌రెడ్డి 2000 సంవత్సరంలో సి.పి.ఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి గాను మరియు జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ 2000 సంవత్సరంలో విద్యుత్ బిల్లుల పెంపునకు వ్యతిరేకంగా వామపక్షాలు చేసిన పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 2004లో నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సుధాకర్‌రెడ్డి పోటీ చేసి 14 వ లోక్ సభకు రెండవసారి ఎన్నికయ్యారు. ఆ విధంగా ఆయన నల్గొండ నియోజకవర్గం నుండి రెండుసార్లు (1998 మరియు 2004) పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ సమయంలోనే ఆయన గ్రామీణాభివృద్ధి కమిటి, హౌస్ కమిటి, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలో సలహా కార్యవర్గ సమితి సభ్యుడిగా కొనసాగారు. లోక్‌సభలో ప్రజా సమస్యలను లేవనెత్తడంలో సురవరం సుధాకర్‌రెడ్డి ముందుండేవారు.

హైదరాబాద్‌లో 2008లో జరిగిన పార్టీ జాతీయ 20 వ మహాసభలో సి.పి.ఐ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా సురవరం సుధాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. 2012 (పాట్నాలో), 2015 (పుదుచ్చేరిలో), 2018 (కొల్లం) లలో జరిగిన జాతీయ కాంగ్రెస్ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి సి.పి.ఐ జనరల్ సెక్రటరీగా వరుసగా మూడుసార్లు ఎన్నికై సరికొత్త చరిత్రను సృష్టించారు. చంద్రరాజేశ్వర రావు తరువాత సి.పి.ఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రెండో తెలుగు వ్యక్తిగా సురవరం సుధాకర్‌రెడ్డి చరిత్ర సృష్టించారు. చంద్ర రాజేశ్వరరావు అడుగుజాడలలో సురవరం సుధాకర్‌రెడ్డి పురోగమించారు. క్షేత్రస్థాయి వాస్తవాలకు అనుగుణంగా ఆయన ముందుకు పయనించారు. ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధిగా ఆయన అమెరికా, చైనా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, ఫ్రాన్స్, పాకిస్తాన్, ఇటలీ దేశాల్లో ఆయా కమ్యూనిస్టు పార్టీల సమావేశాలకు హాజరయ్యారు. తెలంగాణ ఉద్యమంలో సురవరం సుధాకర్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. మొదట్లో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు తెలిపిన సి.పి.ఐ పార్టీ తర్వాత ప్రత్యేక ప్యాకేజీని సైతం తోసివేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధనకు మద్దతు పలకడం గమనార్హం. గతంలో విశాలాంధ్ర కోసం ఉద్యమించిన భారత కమ్యూనిస్ట్ పార్టీ మలిదశ తెలంగాణ పోరాటంలో క్రమంగా తన నిర్ణయాన్ని మార్చుకోవడంలో సురవరం సుధాకర్‌రెడ్డి క్రియాశీలంగా వ్యవహరించారు అని నిర్దిష్టంగా చెప్పవచ్చు.

భూస్వామ్య కుటుంబంలో జన్మించిన సురవరం సుధాకర్‌రెడ్డి తొలిసారిగా కర్నూలు జిల్లా మొలగవల్లి గ్రామంలో మిగులు భూములపై భూపోరాటంలో పాల్గొన్నారు. అనేక పోరాటాల ఫలితంగా ఎట్టకేలకు 250 మంది పేద కుటుంబాలకు పంపిణీ చేశారు. మెదక్, నల్లగొండ, అనంతపురం జిల్లాలలో జరిగిన అనేక భూపోరాటాలలో ఆయన ముందుండి ఉద్యమించారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లా పెదకొత్తపల్లి మండలంలో భూపోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావుతో కలిసి భూ ఆక్రమణోద్యమ ఫలితంగా 300 ఎకరాలను పేదలకు పంచజేయడంలో ఆయన ప్రముఖంగా ఉద్యమించారు. అలాగే పేదలకు కరువు పెన్షన్ కోసం ఆయన ఎంతగానో ఉద్యమించి విజయం సాధించారు.

ఆదర్శాలు అందరూ నొక్కి వక్కాణిస్తారు. కాని కొందరు మాత్రమే ఆ ఆదర్శాలను కడదాకా ఆచరించి భావి సమాజానికి ఆదర్శప్రాయులుగా నిలుస్తారు. అంతిమంగా అతి సామాన్యమైన మరియు నిరాడంబరమైన జీవితాన్ని గడిపి కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయంగా నిలిచిన సురవరం సుధాకర్‌రెడ్డి రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ అదే పోరాట స్ఫూర్తితో ఆయన ఆశయాలను సాధించే దిశగా ' 'వర్గ దోపిడీలేని సమసమాజ స్థాపన' కోసం నిరంతర పోరాటాలు కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి కాగలదు. ఈ సందర్భంగా ఆయనకు వినమ్ర నివాళులు అర్పిస్తున్నాను.



**జె.జె.సి.పి. బాబూరావు**
**రీసెర్చ్ స్కాలర్, 94933 19690**

# క్లౌడ్‌బరస్ట్.. వాతావరణ మార్పులపై తక్షణ కర్తవ్యం

**మన స్వాతంత్ర్య దినోత్సవానికి ముందురోజు జమ్మూ కాశ్మీర్‌లోని సుందరమైన లోయలలో ఒక పెను విషాదం చోటుచేసుకుంది. ఈ సంఘటన కిష్త్వార్ జిల్లాలోని చసోటి పట్టణంలో జరిగింది. హిమాలయ రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లోని భారీ వరదలు, బురదజల్లులు ఒక గ్రామాన్ని మొత్తం ముంచెత్తిన వారం రోజుల తర్వాత ఇది సంభవించింది.**

ఆగస్టు 14, 2025న సంభవించిన వినాశకరమైన 'క్లౌడ్‌బరస్ట్' (మేఘ విస్ఫోటనం - కుండపోత వర్షం) ఆ ప్రాంతంలో నీటిని, బురదను ప్రవాహంగా మార్చి, విధ్వంసాన్ని మిగిల్చింది. ప్రకృతి వైపరీత్యాలకు ఆ ప్రాంతం ఎంత సున్నితంగా ఉందో ఈ ఘటన మరోసారి నొక్కి చెప్పింది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ మనం కేవలం నష్టానికి చింతించడమే కాకుండా, ఇలాంటి విపత్తుల వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలు, వాటి తీవ్రతను పెంచడంలో మన పాత్ర, భవిష్యత్తులో వీటిని ఎదుర్కోవడానికి అవసరమైన పటిష్టమైన వ్యూహం గురించి చర్చించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆగస్టు 14 నాటి జల ప్రళయం విషాదానికి ఒక నిలువుటద్దం:**

జమ్మూ కాశ్మీర్‌లోని ప్రభావిత ప్రాంతాల నుండి అందుతున్న ప్రాథమిక నివేదికలు భయానక చిత్రాన్ని చూపుతున్నాయి. ఒక చిన్న ప్రాంతంలో అకస్మాత్తుగా, అతి తీవ్రంగా కురిసిన వర్షం వల్ల ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడ్డాయి. నదులు క్షణాల్లో ఉప్పొంగి ఇళ్లను, వంతెనలను, రోడ్లను తుడిచిపెట్టేశాయి. నీటి ప్రవాహ వేగం, పరిమాణం ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళే సమయం కూడా ఇవ్వలేదు. దీని ఫలితంగా తీవ్రమైన ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. ఇది ఏదో అరుదుగా జరిగిన సంఘటన కాదు, హిమాలయ రాష్ట్రాలను ఆందోళనకర స్థాయిలో పట్టిపీడిస్తున్న వాతావరణ సంబంధిత విపత్తుల పరంపరలో ఇది తాజా ఘటన మాత్రమే. ఈ విపత్తును అర్థం చేసుకుందాం.

**క్లౌడ్‌బరస్ట్ అంటే ఏమిటి?**

క్లౌడ్‌బరస్ట్ అనేది ఒక తీవ్రమైన వర్షపాత ఘటన. భారత వాతావరణ శాఖ ప్రకారం, సుమారు 20 నుండి 30 చదరపు కిలోమీటర్ల భౌగోళిక ప్రాంతంలో, గంటకు 100 మిల్లీమీటర్ల (లేదా 10 సెంటీమీటర్ల) కంటే ఎక్కువ వర్షపాతం అకస్మాత్తుగా కురిస్తే దానిని 'క్లౌడ్‌బరస్ట్' అంటారు. ఆకాశంలో నీటితో నిండిన ఒక పెద్ద బెలూన్ ఒక్కసారిగా పగిలిపోతే ఎలా ఉంటుందో, క్లౌడ్‌బరస్ట్ కూడా అలాంటిదే.

**కారణాలు - పర్యవసానాలు:**

సాధారణంగా, అధిక తేమను కలిగిన క్యుములోనింబస్ మేఘాల వల్ల ఇవి సంభవిస్తాయి. వెచ్చని, తేమతో కూడిన గాలి పైకి లేచినప్పుడు, నీటి బిందువులు కింద పడకుండా బలమైన గాలి ప్రవాహాల వల్ల పైకి నెట్టబడతాయి. దీనివల్ల చాలా పెద్ద మొత్తంలో నీరు ఒకేచోట పేరుకుపోతుంది. ఆ గాలి ప్రవాహాలు ఇక ఆ నీటి బరువును మోయలేనప్పుడు, ఆ నీరంతా ఒక్కసారిగా కుండపోతలా కిందకు పడుతుంది. జమ్మూ కాశ్మీర్ వంటి పర్వత ప్రాంతాలు ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తాయి. అక్కడి నిటారుగా ఉండే కొండ వాలుల కారణంగా, ఆ నీరు అపారమైన వేగంతో, శక్తితో కిందికి ప్రవహించి, వినాశకరమైన ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, బురద ప్రవాహాలకు కారణమవుతుంది.

**మానవుడి పాత్ర:**

క్లౌడ్‌బరస్ట్‌లు సహజమైనవే అయినప్పటికీ వాటి సంఖ్య, తీవ్రత పెరగడానికి మానవ ప్రేరిత వాతావరణ మార్పులే ప్రధాన కారణం. భూతాపం పెరగడం వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి, వాతావరణం ఎక్కువ తేమను పట్టి ఉంచే సామర్థ్యాన్ని పొందుతుంది. ఇలా అదనపు శక్తిని పుంజుకున్న వాతావరణం తీవ్రమైన వర్షపాతాలకు దారితీస్తుంది. అంతేకాకుండా, పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతాలలో విచ్చలవిడిగా, అస్తవ్యస్తంగా జరుగుతున్న పట్టణీకరణ, అటవీ నిర్మూలన, నిర్మాణ పనులు సహజ నీటి ప్రవాహ మార్గాలను అడ్డుకుంటున్నాయి. ఇది కొండ వాలులను బలహీనపరిచి, క్లౌడ్‌బరస్ట్ యొక్క విధ్వంసక శక్తిని మరింత పెంచుతుంది.



**విధ్వంస చరిత్ర - మన దేశంలో క్లౌడ్‌బరస్ట్ ఘటనలు:**

మన దేశంలో క్లౌడ్‌బరస్ట్‌ల వల్ల జరిగిన విషాదాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. 2013లో ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో సంభవించిన క్లౌడ్‌బరస్ట్, దాని తర్వాతి వరదలు వేలాది మంది మరణానికి కారణమయ్యాయి. ఆ ఘటన మన బలహీనతను గుర్తుచేస్తూనే ఉంటుంది. ఇతర ముఖ్యమైన సంఘటనల గురించి తెలుసుకుంటే 2010లో లేహ్, లడఖ్‌లో వరుస క్లౌడ్‌బరస్ట్‌ల వల్ల ఆకస్మిక వరదలు, బురద ప్రవాహాలు ఏర్పడి విస్తృతమైన విధ్వంసం జరిగింది. అలాగే, 2005లో ముంబైలో సంభవించిన అపూర్వమైన క్లౌడ్‌బరస్ట్ దేశ ఆర్థిక రాజధానిని స్తంభింపజేసి, వెయ్యి మందికి పైగా ప్రాణాలను బలిగొంది. 2022లో పవిత్ర అమర్‌నాథ్ గుహ సమీపంలో జరిగిన క్లౌడ్‌బరస్ట్ వల్ల యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనలన్నీ ఒక భయంకరమైన నిజాన్ని నొక్కి చెబుతున్నాయి. హిమాలయాల నుండి తీరప్రాంతాల వరకు, ఏ ప్రాంతమూ సురక్షితం కాదు. వీటివల్ల కలిగే ప్రధాన ప్రమాదాలు ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, మౌలిక సదుపాయాల నాశనం, వ్యవసాయ భూముల నష్టం, భారీ ప్రాణ నష్టం.

**సమస్యకు మూల కారణాలు:**

క్లౌడ్‌బరస్ట్‌ల ముప్పు పెరగడానికి గల ప్రధాన కారణాలను పరిశీలిస్తే మొదటగా వాతావరణ మార్పును చెప్పుకోవచ్చు. పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతలు జల చక్రాన్ని తీవ్రతరం చేసి తీవ్రమైన వాతావరణ సంఘటనలకు దారితీస్తున్నాయి. ఇక రెండవది భౌగోళిక స్వరూపం. హిమాలయ ప్రాంతంలోని నిటారుగా, అస్థిరంగా ఉండే కొండ వాలులు సహజంగానే కొండచరియలు విరిగిపడే ప్రమాదాన్ని కలిగి ఉంటాయి. తీవ్రమైన వర్షపాతం ఈ ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. చివరిగా మానవ కారకాలు కూడా ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. నియంత్రణ లేని నిర్మాణాలు, వ్యవసాయం మౌలిక సదుపాయాల కోసం అటవీ నిర్మూలన, నదీ తీరాలను ఆక్రమించడం వంటివి విపత్తు ప్రమాదాన్ని పెంచుతున్నాయి.

**భవిష్యత్తు మార్గం:**

క్లౌడ్‌బరస్ట్ వంటి సహజ దృగ్విషయాన్ని నివారించడం అసాధ్యం. కానీ దాని ప్రభావాన్ని మనం ఖచ్చితంగా తగ్గించగలం. దీనికి బహుముఖ విధానం అవసరం. పర్యావరణపరంగా సున్నితమైన మండలాల్లో నిర్మాణం, భూ వినియోగంపై కఠినమైన నిబంధనలను అమలు చేయాలి. ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రణాళికను రూపొందించాలి. ముఖ్యంగా కొండ వాలులపై విస్తృతంగా చెట్లను నాటడం వల్ల నేల కోతను అరికట్టవచ్చు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. అంతేకాకుండా, చెక్ డ్యామ్‌లు, నీటి సంరక్షణ నిర్మాణాలను నిర్మించడం ద్వారా తీవ్రమైన వర్షపాతం సమయంలో నీటి ప్రవాహాన్ని నియంత్రించవచ్చు. ప్రజలలో అవగాహన కల్పించడం కూడా చాలా ముఖ్యం. స్థానిక సమాజాలకు ప్రమాదాల గురించి అవగాహన కల్పించడం, విపత్తు సంసిద్ధతలో వారికి శిక్షణ ఇవ్వడం ప్రాణాలను కాపాడటానికి కీలకం. అంచనా వేయడంలో సవాలు విపత్తు అనంతర చర్యలుబ్ క్లౌడ్‌బరస్ట్‌లను కచ్చితంగా అంచనా వేయడం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ శాస్త్రవేత్తలకు ఒక పెద్ద సవాలుగా మిగిలిపోయింది. అవి చాలా చిన్న ప్రాంతంలో, వేగంగా ఏర్పడటం వల్ల వాటిని ముందుగా ఊహించడం కష్టం. అయినప్పటికీ డాప్లర్ రాడార్ సాంకేతికత, వాతావరణ నమూనాలలో వస్తున్న పురోగతి స్వల్పకాలిక హెచ్చరికలను అందించగలవు. ఇది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి కీలకమైన సమయాన్ని ఇస్తుంది. క్లౌడ్‌బరస్ట్ జరిగిన తర్వాత వేగవంతమైన, సమన్వయంతో కూడిన ప్రతిస్పందనపై దృష్టి పెట్టాలి. ఇందులో భాగంగా తక్షణ సహాయక చర్యల కోసం గాలింపు, సహాయక చర్యల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలి. అలాగే, కమ్యూనికేషన్ లైన్లు, విద్యుత్, రవాణా మార్గాలను పునరుద్ధరించడానికి తక్షణ చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. అంతేకాకుండా, ప్రభావిత ప్రజలు ఆ దిగ్భ్రాంతి నుండి కోలుకోవడానికి వారికి కౌన్సెలింగ్, మద్దతు అందించాలి.

**మనందరికీ ఒక మేల్కొలుపు:**

ఆగస్టు 14, 2025న జమ్మూ కాశ్మీర్‌లో సంభవించిన క్లౌడ్‌బరస్ట్ మనందరికీ ఒక మేల్కొలుపు. ఇలాంటి సంఘటనలను మనం ఇకపై అప్పుడప్పుడు జరిగే ప్రకృతి వైపరీత్యాలుగా చూడలేము. అవి మన చర్యల వల్ల తీవ్రమవుతున్న స్పష్టమైన, తక్షణ ప్రమాదాలు. ఒక దేశంగా, మనం మరింత స్థితిస్థాపకమైన, సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించడానికి ఏకమవ్వాలి. ఆ భవిష్యత్తులో అభివృద్ధి అనేది మానవ ప్రాణాలు, పర్యావరణ సమగ్రతను పణంగా పెట్టి జరగకూడదు.

**జనక మోహన రావు దుంగ**
**8247045230**

# ఇంజనీరింగ్ చదువుల డొల్లతనం

## అంచనాలకు, వాస్తవాలకు మధ్య పెరిగిన అంతరం

భారతదేశంలో ఒకప్పుడు ఇంజనీరింగ్ అంటే విజయానికి పాస్‌పోర్ట్ అని నమ్మకం. డిగ్రీ పొందిన వెంటనే ఉద్యోగం దొరుకుతుందని, స్థిరమైన జీవితం వస్తుందని ప్రతి తల్లిదండ్రి, ప్రతి విద్యార్థి కలలు కనేవారు. అయితే నేడు ఆ నమ్మకం క్రమంగా సన్నగిల్లుతోంది. నాలుగేళ్ల కఠోర శ్రమ, లక్షల రూపాయల ఫీజులు చెల్లించినా లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు లభించడం లేదు. "మీకు డిగ్రీ ఉంది కానీ మాకు కావాల్సిన నైపుణ్యాలు లేవు" అంటున్న పరిశ్రమలు నేటి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌ల దుస్థితిని సూటిగా చెబుతోంది. ఈ పరిస్థితికి కేవలం కాలం చెల్లిన సిలబస్ మాత్రమే కాకుండా, మన విద్యా వ్యవస్థలో పాతుకుపోయిన అనేక అంతర్గత లోపాలు కూడా కారణం. ఇంకా ఇది కేవలం వ్యక్తిగత లోపం కాదు. దేశం మొత్తం ఎదుర్కొంటున్న ఒక వ్యవస్థాత్మక వైఫల్యం.




అధికారిక రిపోర్టులు చూస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తుంది. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రకారం, ఇంజనీరింగ్ చదివిన వారిలో కేవలం 40% మందికి మాత్రమే వారి విద్యకు తగిన ఉద్యోగాలు లభిస్తున్నాయి. కొన్ని సర్వేలు అయితే దాదాపు 80% మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌లకు సరైన నైపుణ్యాలు లేకపోవడం వల్ల ఉద్యోగాలు లభించడం లేదని చెప్తున్నాయి. అంటే మన కాలేజీల్లో నేర్పించే విద్యకు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలకు చాలా అంతరం ఉందన్నమాట.

**సంప్రదాయం వెర్సెస్ ఆధునికత :** నేటి పరిశ్రమ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఎలక్ట్రిక్ వెహికల్స్ వంటి విప్లవాత్మక సాంకేతికతలతో ముందుకు దూసుకుపోతుంటే, మన ఇంజనీరింగ్ కోర్సులు మాత్రం పాతకాలపు సిద్ధాంతాలకే పరిమితమయ్యాయి. ఈ కాలం చెల్లిన సిలబస్ కారణంగానే విద్యార్థులు ఆధునిక పరిశ్రమ డిమాండ్లకు అనుగుణంగా తయారవట్లేదు.

**కంప్యూటర్ సైన్స్:** ఈ రంగంలో వేగంగా వస్తున్న మార్పులకు మన సిలబస్ సరిపోవడం లేదు. విద్యార్థులు ఇప్పటికీ 'సి' , 'సి ప్లస్ ప్లస్', జావా వంటి ప్రాథమిక భాషలపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. కానీ పరిశ్రమలకు ఇప్పుడు పైథాన్, గో, రస్ట్ వంటి ఆధునిక భాషలుబీ రియాక్ట్, నోడ్.జెఎస్ వంటి ఫ్రేమ్‌వర్క్‌లుబీ ఎడబ్ల్యుఎస్, అజూర్ వంటి క్లౌడ్ ప్లాట్‌ఫారమ్‌లుబీ డాకర్, కుబెర్నెటీస్ వంటి దెవఅప్స్ సాధనాలపై పట్టున్న నిపుణులు కావాలి.

**ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ :** చాలా కళాశాలలు ఇంకా పాత మైక్రోప్రాసెసర్‌లైన 8085/8086కే ప్రాధాన్యత ఇస్తున్నాయి. కానీ, నేటి ప్రపంచం విఎల్ఎస్ఐ డిజైన్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఆధునిక ఎఆర్ఎం కంట్రోలర్లు, 5జి టెక్నాలజీ, చిప్ డిజైనింగ్ వంటి అధునాతన రంగాల వైపు వేగంగా నడుస్తోంది.

**మెకానికల్ ఇంజనీరింగ్:** సంప్రదాయ థర్మోడైనమిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్ వంటి అంశాలు అవసరమే అయినా, పరిశ్రమకు కావాల్సింది సాలిడ్‌వర్క్స్, క్యాటియా వంటి ఆధునిక సిఏడి, సిఏఎమ్ సాఫ్ట్‌వేర్లలో నైపుణ్యం, ఆటోమేషన్, రోబోటిక్స్, 3డి ప్రింటింగ్‌పై అవగాహన ఉన్న ఇంజనీర్లు.

**మూల కారణాలు- వ్యవస్థలోని లోపాలు:** ఈ సంక్షోభానికి కేవలం పాతబడిన సిలబస్ మాత్రమే కాదు, వ్యవస్థలో పాతుకుపోయిన అనేక అంతర్గత లోపాలు ఉన్నాయి.

**అధ్యాపకులకు తగిన శిక్షణ లేకపోవడం:** చాలా మంది అధ్యాపకులకు, ముఖ్యంగా చిన్న కళాశాలల్లో, పరిశ్రమ అనుభవం తక్కువగా ఉంది. వారు కేవలం సైద్ధాంతిక భావనలను మాత్రమే బోధించడం వల్ల విద్యార్థులకు నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించాలో తెలియడం లేదు.

**పరిశ్రమ, విద్యా సంస్థల మధ్య సంబంధాలు లేకపోవడం:** కాలేజీలకు, పరిశ్రమలకు మధ్య సరైన అనుసంధానం లేదు. ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమలతో కలిసి ప్రాజెక్టులు చేయడం, నిపుణులను ఆహ్వానించి మాట్లాడించడం వంటివి చాలా అరుదుగా జరుగుతున్నాయి. దీనివల్ల విద్యా సంస్థలకు పరిశ్రమల అవసరాలు తెలియడం లేదు.

**మౌలిక సదుపాయాలు లేకపోవడం:** చాలా కళాశాలల్లోని ప్రయోగశాలలు పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా లేని పాత యంత్రాలు, సాఫ్ట్‌వేర్‌లతో అమర్చబడి ఉన్నాయి. అధునాతన డిజైన్, సాఫ్ట్‌వేర్‌లు చాలా కళాశాలలకు అందుబాటులో లేవు.

**పరిష్కారాలు - భవిష్యత్తు కోసం మార్పులు:** ఈ సమస్యలను అధిగమించడానికి ఒక సమగ్ర, బహుముఖ విధానం అవసరం. ప్రభుత్వం, విద్యా సంస్థలు, పరిశ్రమలు అందరూ కలిసి కృషి చేయాలి. పరిశ్రమ-ఆధారిత సిలబస్: పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా సిలబస్‌ను ఎప్పటికప్పుడు మార్చాలి. సిద్ధాంతాల మీద కాకుండా, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వాలి. కృత్రిమ మేధ , డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక విషయాలను చేర్చాలి.

**అధ్యాపకులకు తప్పనిసరి శిక్షణ:** అధ్యాపకులకు పరిశ్రమల్లో కొంతకాలం పనిచేసేలా ప్రోత్సహించాలి. దీనివల్ల వారికి అనుభవం వస్తుంది. పరిశ్రమల్లోని అనుభవజ్ఞులను కూడా కళాశాలలకు వచ్చి క్లాసులు చెప్పమని ఆహ్వానించాలి. కాలేజీలు, కంపెనీలు కలిసి విద్యార్థులకు వాస్తవ ప్రాజెక్టులపై పనిచేసే అవకాశాలు కల్పించాలి. బట్టీ పట్టడం నుంచి కేస్-స్టడీ, ప్రాజెక్ట్-ఆధారిత మూల్యాంకనం వైపు మారాలి. అత్యాధునిక ల్యాబ్‌లు, సాఫ్ట్‌వేర్ లైసెన్స్‌లు పరిశోధన సౌకర్యాలలో భారీగా పెట్టుబడి పెట్టాలి.

**నిజమైన ఇంజనీరింగ్:** ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి కేవలం టెక్నికల్ నైపుణ్యం సంపాదించడం కాదు. అతడు ఒక తత్వవేత్తలాగే జీవితం గురించి ప్రశ్నలు వేయగలగాలి "ఎందుకు ఇది ఇలా జరుగుతోంది?" అనే సందేహమే శాస్త్రానికి బీజం. "ఇది మనిషికి ఎలా ఉపయోగపడుతుంది?" అనే ఆలోచన తత్వానికి మూలం. ఈ రెండు కలిసినప్పుడు మాత్రమే నిజమైన ఇంజనీరింగ్ పుడుతుంది.

**ధర్మాన రవితేజ**
**ఫోన్: 70937 05620**

# పాఠశాల, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరి

- విద్యాసంస్థల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
- విద్యాసంస్థల్లో అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష
- వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 26 (జనం సాక్షి) :** అందోల్ నియోజకవర్గ విద్యాసంస్థల్లో అమ్మలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ విద్యాసంస్థల లో జరుగుతున్న నిర్మాణం పనులు, అభివృద్ధి పనుల పై అందోల్ పాలిటెక్నిక్ కళాశాలలో విస్తృతస్థాయిలో మంత్రి సమీక్ష జరిపారు.అందోల్ నియోజకవర్గంలోని విద్యా సంస్థల అభివృద్ధి, మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచించారు. నియోజకవర్గంలోని పలు విద్యాసంస్థల పరిస్థితులను సమీక్షించి, అవసరమైన వసతుల కల్పనపై ప్రిన్సిపాల్‌లు, అధికారులతో మంత్రి చర్చించారు. నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత,విద్యాసంస్థలలో మౌలిక వసతుల బలోపేతం పై మంత్రి మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి, పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం మౌలిక సదుపాయాలు పునాదిగా నిలుస్తాయని, అందుకే ప్రతి విద్యాసంస్థలో అవసరమైన సౌకర్యాలను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో పుల్కల్, అందోల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), అందోల్ మహిళా పాలిటెక్నిక్ కాలేజీ, శివ్వంపేట పాలిటెక్నిక్, సంగుపేటలో వ్యవసాయ పాలిటెక్నిక్ వంటి సంస్థల ప్రస్తుత పరిస్థితులు చర్చకు వచ్చాయి. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరంగా అడిగి తెలుసుకుని, అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. అక్సాన్ పల్లి, పోతుల బొగడ, బస్వాపూర్‌లోని మోడల్ పాఠశాల, అలాగే సామాజిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న అందోల్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, సింగూర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలల్లో సౌకర్యాల పరిస్థితులపై కూడా విస్తృత చర్చ జరిగింది. విద్యార్థులకు వసతి, ఆహారం, క్రీడా సదుపాయాల నాణ్యతను మరింత మెరుగుపరిచే దిశగా సూచనలు జారీ చేశారు.

### బుదేరా మహిళా డిగ్రీ, పీజీ కళాశాలను మోడల్ తీర్చిదిద్దాలి

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ మరియు పీజీ కాలేజ్ ఫర్ ఉమెన్, బుదేరా విద్యాసంస్థ ప్రాధాన్యం పై మంత్రి ప్రత్యేకంగా చర్చించారు. ఈ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, హాస్టల్లో వసతి సదుపాయాల పెంపు, డార్మెటరీ సౌకర్యాలు, డైనింగ్ హాల్ విస్తరణ, నూతన కిచెన్ పరికరాలు, ల్యాబ్ సామగ్రి వంటి అవసరాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీ ఎస్ ఈ టి ఎస్ ఈ డబ్ల్యు ఐ డి సి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి ఈ ఈ రవి కుమార్ , రెవిన్యూ , పోలీస్ , వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమతుల్య ఎరువుల వాడకమే లాభదాయకం



**కొడంగల్, ఆగస్టు 26 (జనం సాక్షి) :** బుల్కాపూర్ గ్రామంలో రైతులకు భూసార పరీక్ష ప్రాముఖ్యతపై వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ ఏఈఓ రాజు రాథోడ్ పాల్గొని రైతులకు భూసార పరీక్ష గురించి వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్ష చేయించుకోవడం ద్వారా నేలలో ఉన్న పోషకాల స్థితి, లోపాలు ఏవో స్పష్టంగా తెలుసుకోవచ్చు. దానికి అనుగుణంగా సరైన ఎరువులు సరైన మోతాదులో వాడితే పంటల దిగుబడి పెరుగుతుంది. రైతుల ఉత్పత్తి వ్యయాలు తగ్గుతాయి. ఆర్గానిక్ విధానాలు, సమతుల్య ఎరువుల వినియోగం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు.అలాగే రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి, శాస్త్రీయ సూచనల మేరకు పంటల సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొని భూసార పరీక్షపై అవగాహన పొందారు.

## ఇందిరమ్మ ఇండ్ల పనులను త్వరగా పూర్తి చేసుకోవాలి



**ఊర్కొండ, ఆగస్టు 26 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణయ్య పేర్కొన్నారు.మంగళవారం మండల పరిధిలోని ఊర్కొండపేట,మాదారం గ్రామాలను సందర్శించి వివిధ దశలలో వున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించడం జరిగిందని అన్నారు.ఇదివరకే బేస్మెంట్ బిల్లులు వచ్చిన లబ్ధిదారులు గోడల పనులను ప్రారంభించాలని,గోడలు రూఫ్ లెవెల్ కు దగ్గరగా వున్న లబ్ధిదారులు పూర్తిచేస్తే రెండవ బిల్లులు కూడా త్వరగా వస్తాయని తెలియజేయడం జరిగిందని సాంకేతికంగా సమస్యలు వున్న లబ్ధిదారులు ప్రభుత్వ సూచనల మేరకే ఇండ్లు నిర్మించుకోవాలని,నిర్దేశించిన కొలతల ప్రకారమే ఇండ్లు నిర్మించుకోవాలని సూచించడం జరిగిందని అన్నారు.ఈ సందర్శనలో ఎంపీఓ లక్ష్మణ్, ఏ ఈ హౌజింగ్ తరుణ్, పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం,ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మస్థలికి హద్దులను ఏర్పాటు చేయాలి



**నిజాంపేట్, ఆగస్టు 26 (జనం సాక్షి) :** జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం హిందువుల గ్రేవి యార్డ్, ధార్మిక కార్యక్రమాలకు కేటాయించిన స్థలం యొక్క హద్దులను చూపించకపోవడం పై 2023లో ఆర్డీవో పంచనామా ప్రకారం కేటాయించిన న్యాయబద్ధంగా రావలసిన 3.20 ఎకరాల భూమికి 1.20 ఎకరాలనే ల్యాండ్ ఎవైలబిలిటీని చూపిస్తూ కేటాయించటం అదేవిధంగా నిన్న ఒక వర్గానికి సంబంధించిన ల్యాండ్‌ని హద్దులను చూయించి హిందువుల కేటాయించిన భూమికి మాత్రం హద్దులను చూపకపోవడం ఇది హిందూ సమాజాన్ని కించపరచడమేనని సనాతన ధర్మసేన ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సనాతన ధర్మసేన ప్రతినిధులు అడిషనల్ కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే ప్రొసీడింగ్ కాపీలో పొందుపరిచిన విధంగా ఇక్కడున్న అధికారుల వ్యవహరించాలని అలాగే కొంతమంది ఆ స్థలంలో అక్రమ కట్టడాల నిర్మించి ఒక్కొక్క దాన్ని 20 నుండి 50 లక్షల అమ్మడానికి సిద్ధంగా ఉన్నారని, అలాంటి వారి పైన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మా విన్నపానికి స్పందించిన అడిషనల్ కలెక్టర్ మీ ప్రతిపాదనను పరిశీలించి మిగిలిన రెండు ఎకరాలను కూడా త్వరలోనే కేటాయిస్తామని అదేవిధంగా ప్రస్తుతం కేటాయించిన 1.20 ఎకరాల భూమి యొక్క హద్దులను వెంటనే ఏర్పాటు చేయాలని స్థానిక రెవిన్యూ ఇన్స్పెక్టర్ మరియు సర్వేయర్ కు ఆదేశాలను జారీ చేయడమే కాకుండా పారదర్శకంగా వ్యవహరించాలని వెంటనే వారికి కేటాయించిన భూమి యొక్క హద్దులను చూపించి ఇవ్వవలసిందిగా సూచించారు. తమ యొక్క అభ్యర్థులను మన్నించి కలెక్టర్ ఆదేశాల యొక్క ఉత్తర్వులను ప్రొసీడింగ్ కు ఆదేశించిన అడిషనల్ కలెక్టర్ కి నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ హిందువుల తరఫున సనాతన ధర్మసేన ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ భూముల కబ్జాపై ఆరా తీసిన అడిషనల్ కలెక్టర్ భూఆక్రములను ఎట్టి పరిస్థితుల్లో సహించే ప్రసక్తి లేదని ఎవరైనా ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలని ప్రయత్నిస్తే తమ దృష్టికి తీసుకురావాలని ప్రభుత్వ భూములను రక్షించటం తమ బాధ్యత అని తెలియజేశారు. అడిషనల్ కలెక్టర్ ఆదేశాల పైన సనాతన ధర్మసేన ప్రతినిధులు హర్షం వ్యక్తం చేసి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## సెప్టెంబర్ 9న జరిగే మహా గర్జనను విజయవంతం చేయాలి

- మందకృష్ణ మాదిగ



**అచ్చంపేట, ఆగస్టు 26 (జనం సాక్షి) :** పట్టణంలోని నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ హాజరయ్యారు. వృద్ధులకు, వితంతువుల, బీడీ, గీత, కృష్ఠి, ఎయిడ్స్, ఒంటరి మహిళలకు 2000 రూపాయల నుండి 4000 రూపాయలు మరియు వికలాంగులకు 4000 నుండి 6000 రూపాయలు, కండరాల బలహీనత బాధితులకు 15000 పిన్షన్ పెంచుతామని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టులో హామీ ఇచ్చి నేటికీ రెండు సంవత్సరాలు గడుస్తున్న పెంచిన ఫించన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరాటం చేస్తామని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పెన్షన్ దారుల విషయంలో నోరు ఇప్పటం లేదని గర్జించారు, అలాగే ఇతర ప్రతిపక్ష పార్టీలు ఎవ్వరు కూడా పెన్షన్ దారుల విషయంలో మాట్లాడకుండా మౌనంగా ఉన్నారని, ఎవరు మాట్లాడినా మాట్లాడకపోయినా పెన్షన్ దారుల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టి అయిన పెన్షన్ దార్లకు మేనిఫెస్టోలో పెట్టిన పెన్షన్స్ ఇచ్చేదాకా కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడుతామని ఇవ్వని ఎడల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చరించారు. ఈ సదస్సుకు అచ్చంపేట నియోజకవర్గానికి చెందినటువంటి అన్ని రకాల పెన్షన్దారులు పెద్ద మొత్తంలో హాజరై ఈ సదస్సును విజయవంతం చేశారు. ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకోవడానికి సెప్టెంబర్ 09 న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో తలపెట్టే పిన్షన్ దారుల మహా గర్జన సభను విజయవంతం చేయాలనీ కోరారు. బహిరంగ సభకు ప్రతి గ్రామం నుండి పిన్షన్ దారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

# రైతులకు యూరియాను సకాలంలో అందించాలి



**చేవెళ్ల, ఆగస్టు 26 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపుమేరకు రైతులకు యూరియా సకాలంలో అందించాలని కోరుతూ అన్ని మండల కేంద్రాలు జిల్లా కేంద్రాలు డివిజన్ కేంద్రాల్లో ధర్నాలు చేయాలని రైతు సంఘం ఇచ్చిన పిలుపుమేరకు చేవెళ్లలోని ఆర్డిఓ డివిజన్ కార్యాలయం దగ్గర రంగారెడ్డి జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు యం.సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చేవెళ్ల నియోజకవర్గం కన్వీనర్ కే రామస్వామి రైతు సంఘం జిల్లా కార్యదర్శి యం.ప్రభులింగం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని రైతులకు యూరియా సకాలంలో అందించాలన్నారు. యూరియా దొరకక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. నకిలీ ఎరువులను నకిలీ మందులను తక్షణమే అరికట్టాలని రైతు సంక్షేమం కోసం సబ్సిడీలు ఇవ్వాలని వారి సందర్భం కోరారు. గత ప్రభుత్వాలు రైతులకు కొన్ని సబ్సిడీలు ఇచ్చి ఇప్పుడున్న ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీ తీసేయడం భావ్యం కాదని వారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రైతు నాయకులు మల్గారి సత్తిరెడ్డి, పాపయ్య, మహిళా రైతులు వెంకటమ్మ, గంగోత్రి, దేవి, లలిత తదితరులు పాల్గొన్నారు.

## చార్జింగ్ స్టేషన్‌ను విరమించండి

- కమీషనర్‌కు వినతి పత్రం ఇచ్చిన హనుమాన్ దేవాలయ కమిటీ



**బోడుప్పల్, ఆగస్టు 26 (జనంసాక్షి) :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి హనుమాన్ దేవాలయం ప్రక్కన ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్ ను విరమించుకోవాలని దేవాలయ చైర్మన్ కావడపు రామ్ రెడ్డి కోరారు.కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల కోసం చార్జింగ్ స్టేషన్ లను నిర్మిస్తున్న సందర్భంగా హనుమాన్ దేవాలయం ప్రక్కన ఉన్న స్థలంలో చార్జింగ్ స్టేషన్ నిర్మించాలని కమీషనర్ సూత్రప్రాయంగా సర్వే నిర్వహించారు.ఈ స్థలంలో చార్జింగ్ స్టేషన్ పెట్టవద్దని మంగళవారం దేవాలయ కమిటీ కమీషనర్ కు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఇదే స్థలంలో పెట్రోల్ పంపు,బస్టాండ్ నిర్మించాడనికి ప్రతిపాదనలు వచ్చాయని ఈ స్థలంలో శ్రీరామనవమి ఉత్సవాలు,బతుకమ్మ ఉత్సవాలు, దసరా ఉత్సవాలు నగర ప్రజల జరుపుకుంటు మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతున్నారని తెలిపారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని కమీషనర్ ను కోరారు.అదేవిధంగా గత ప్రభుత్వం యువతకు క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి తేవాలని హడావుడిగా ఈ స్థలంలో క్రీడా ప్రాంగణమని బోర్డుని పెట్టారను దానిని తక్షణమే తొలగించి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానానికి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ డైరెక్టర్లు శ్రీను నాయక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 26 (జనం సాక్షి) :** మెదక్ మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతూ జంతు జనన నియంత్రణ చర్యలు చేపడుతూ ప్రజారోగ్యం- స్వచ్ఛమైన తాగునీరు పరిసరాల పరిశుభ్రతపై పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపాలిటీలో విస్తృతంగా పర్యటించి న కలెక్టర్ జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. జంతు జనన నియంత్రణ కోసం చేపడుతున్న ఆపరేషన్ ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపాలిటీలో పర్యటిస్తూ పరిసరాల పరిశుభ్రతలో భాగంగా తడి చెత్త పొడి చెత్త వేరుచేసి శానిటేషన్ సిబ్బందికి అందించాలని మెదక్ మున్సిపాలిటీ స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని వార్డు ల వారీగా పట్టణ ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి నివృత్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రత- స్వచ్ఛమైన తాగునీరు ప్రజారోగ్యం అంశాలను ప్రధాన ఏజెండాగా చేసుకుని ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు దోమలు పుట్టకుండా కుట్టకుండా దోమల లార్వాలను సమూలంగా నిర్మించేందుకు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ చేయాలని ఫాగింగ్ సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలు వ్యక్తిగత శారీరక పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని కాలానుగుణ వ్యాధులను సమూలంగా నిర్మూలించేందుకు పట్టణ ప్రజలు ప్రజారోగ్య, మున్సిపాలిటీ అధికారులకు సహకరించాలన్నారు. మెదక్ పట్టణంలో వ్యాపారులు ఇష్టమైన రీతిలో చెత్తను ఎక్కడ బడితే అక్కడ పార వేయకుండా కట్టుదిట్టమైన క్రమశిక్షణ చర్యలు చేపడుతూ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం తగదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి టౌన్ ప్లానింగ్ అధికారి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలి



**హయత్‌నగర్, ఆగస్టు 26 (జనం సాక్షి) :** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హయత్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యం లో హయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన సమావేశంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరిగే విధంగా జిహెచ్ఎంసి, పోలీస్ శాఖ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేయాలని వారు కోరారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని వారు సూచించారు. గణేష్ మండపాల వద్ద ఎప్పుడు ఎవరో, ఒకరు కమిటీ సభ్యులు కచ్చితంగా ఉండాలని వారు సూచించారు. నాణ్యతతో కూడిన విద్యుత్ తీగలు వాడాలని, ఫైర్ సేఫ్టీ ఎక్విప్మెంట్ ఏర్పాటు చేసుకోవాలని, వీలైతే పోర్టబుల్ సీసీ కెమెరా కూడా ఏర్పాటు చేసుకోవాల్సిందిగా వారు తెలియజేశారు. గణేష్ మండపా నిర్వాహకులకు వారు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో డి ఐ వంశీ క్రిష్ణ, పోలీస్ శాఖ, జలమండలి, విద్యుత్, జాతీయ రోడ్డు విస్తరణ అధికారులు, ఫైర్ స్టేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తోలుకట్టలో ప్రభుత్వ భూములను కాపాడాలని తహసీల్దార్‌కు వినతి

- వాగులు, వంకలు పూర్తిగా కబ్జాలకు గురి..



**మొయినాబాద్, ఆగస్టు 26 (జనం సాక్షి) :** తోలుకట్ట గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 137/3 విస్తీర్ణం రెండెకరాల భూమిలో నల్లవాగు ఉన్నది కొన్ని సంవత్సరాలనుంచి ఈ వాగు నీటి పర్వం పారుతూ ఈసి వాగులోకి వెళ్తుంది అని తెలుపుతూ మండల తాసిల్దార్ గౌతం కుమార్ కు తోలకట్ట గ్రామస్తులు భానూరి శంకర్ గౌడ్ కుమ్మరి గోపాల్ తదితరులు కలిసి మంగళవారం నాడు వినతిపత్రం ద్వారా అందిస్తూ తెలిపారు. ఈ సందర్భంగా వారు వినతిపత్రం అందించి తాసిల్దార్ గౌతమ్ కుమార్ కు వివరిస్తూ తొలికట్ట గ్రామంలోని సర్వే నంబర్ 137 బై ఆ 3 ప్రభుత్వ భూమిలో విస్తీర్ణం రెండెకరాలలో గలదు ఇట్టి భూమిలో ఉన్న వాగును సామి రామానంద తీర్థ ఇనిస్ట్యూట్ ఆఫ్ సోషియా ఎకనామిక్ సర్వే నేషనల్ ఇంటిగ్రేట్ వారు పూర్తిగా కబ్జా చేయడం జరిగిందని అన్నారు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కోల్కత్త గ్రామంలో ప్రభుత్వ భూములు ఎన్నో అన్యాక్రాంతమవుతున్నప్పటికీని అధికారులు కృషి చేస్తున్న అక్కడక్కడ మళ్ళీ మొదలవుతున్నాయని తెలిపారు 137/3 సర్వే నంబర్లు వాగు ఉన్నది దానిని పూర్తిగా కబ్జా చేసి నీళ్లు రాకుండా చేశారని తెలిపారు రామానంద తీర్థ ఇనిస్ట్యూట్ ఆఫ్ సోషియా ఎకనామిక్ రీసెర్చ్ నేషనల్ ఇంటిగ్రేషన్ వారు పూర్తిగా కబ్జా చేయడం జరిగిందన్నారు కోల్కట్ట గ్రామస్తులు 19 95 అప్పటి ఇండ్ల స్థలాలు పోరాటం భానూరి లింగం గౌడ్ ఆధ్వర్యంలో సోల్కట్ట గ్రామస్తులకు 2 గజాల ఇంటి పత్రాలు ఇవ్వడం జరిగింది దీనిలో అక్కడ ఏర్పాటు చేశారు ప్రజలు దసరా పండుగకు జమ్మి వృక్షం సర్వేనెంబర్ 137/3 రెండెకరాల నల్లవాగు జమ్మి చెట్టుకు వెళ్లేవారని వివరించారు కబ్జా చేయడంతో ఇప్పుడు అక్కడ వాగుకుతున్నారని తెలిపారు కావున ఈ విషయాన్ని అధికారులు గమనించి ప్రభుత్వ భూమి లో ఉన్న నల్లవాగును కాపాడాలని కోరడం జరుగుతుంది.ఔషధ మొక్కల ఉత్పత్తి ద్వారా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించి ఉచితంగా పంపిణీ చేయుట కొరకు ఈ యొక్క సమస్త కు అప్పట్లో ఇవ్వడం జరిగిందన్నారు కానీ ఇక్కడ 30 ఎకరాల లో కుటుంబ వ్యవహారాలు టిఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణిదేవి అల్లుడు శేఖర్ కబ్జా చేయడం గ్రామ ప్రజలను అందులోకి రానివ్వకుండా క్రిమి కేసులు పెడుతున్నారని అన్నారు ఈ స్థలం ప్రైవేటుదని గేటు బయట బోడు పెట్టడం జరిగిందని పేర్కొంటూ తాసిల్దార్ కు వివరించడం జరిగిందని తెలిపారు రెవెన్యూపరంగా ప్రభుత్వ భూములను కాపాడాలని తాసిల్దార్ కోరినట్లు తెలిపారు.

జనంసాక్షి www.janamsakshi.org | బుధవారం 27 ఆగస్టు 2025

# విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 26 (జనం సాక్షి) :** విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ, భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని అందించడం మనందరి బాధ్యతని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్‌తో కలిసి మొక్కలు నాటి అందరిలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ వాతావరణ సమతుల్యాన్ని కాపాడి భావితరాలకు స్వచ్ఛమైన గాలి అందించేందుకు ప్రభుత్వం వనమహోత్సవం ద్వారా పచ్చదనాన్ని పెంపొందిస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. జిల్లాలో అటవీ విస్తీర్ణం చాలా తక్కువగా ఉన్నందున భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలన్నారు. జిల్లాలో అటవీ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకొని పచ్చదనాన్ని పెంపొందించడానికి కృషి చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలోనూ మొక్కల పెంపకంపై కచ్చితమైన పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఇది ఒక కార్యక్రమం కాదని,మన సమాజ బాధ్యతగా భావించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో ప్రతి



ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. గద్వాల జిల్లా అటవీ విస్తీర్ణం తక్కువగా ఉండటంతో,అందరూ జిల్లాలో పచ్చదనం పెంపొందించి ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అభివృద్ధి చేయాలని అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడానికి ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.ఇది ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రజల ఉద్యమంగా మారాలని, అందరూ సమిష్టిగా ముందుకు రావాలని కోరారు. ప్రతి ఒక్కరు కనీసం పది మందికి చెట్లు నాటమని చెప్పాలని, ఆ పది మంది మరికొందరికి చెప్పాలని,ఈ విధంగా అవగాహన విస్తరించి భావితరాలకు శుభ్రమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలని అన్నారు. జిల్లాకు కేటాయించిన 15 లక్షల మొక్కల లక్ష్యంలో ఇప్పటి వరకు 88 శాతం పూర్తి అయిందని తెలిపారు. జూలై-సెప్టెంబర్ నెలల్లో సమృద్ధిగా వర్షాలు ఉండే ఈ సమయంలో అన్ని శాఖలు తమ లక్ష్యాలను పూర్తిగా సాధించి, నాటిన ప్రతి మొక్కను భాధ్యతగా సంరక్షించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా అటవీ అధికారి కె.ఏ.వి.ఎస్.ప్రసాద్ రెడ్డి, ఐ.ఎఫ్.ఎస్.మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించిందని తెలిపారు. గద్వాల జిల్లాలో భాగంగా గ్రామీణ అభివృద్ధి శాఖకు 6.8 లక్షలు,హార్టికల్చర్ శాఖకు 2 లక్షలు, పంచాయతీ రాజ్ శాఖకు 3.6 లక్షలు,మున్సిపాలిటీలకు 6 లక్షల మొక్కల లక్ష్యాలు కేటాయించబడ్డాయని వివరించారు. ఇప్పటికే జిల్లాలో గణనీయమైన లక్ష్య సాధన జరగిందని తెలిపారు.ఈ రోజు మేడికల్ కళాశాల ఆవరణలో 100 చెట్లు నాటుతున్నట్లు తెలిపారు. గద్వాల అటవీ ప్రాంతం తక్కువ విస్తీర్ణంలో ఉన్నందున,నాటిన ప్రతి మొక్కను ప్రాణంలా భావించి కాపాడుకోవాలని సూచించారు. ప్రజలు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,మార్కెట్ యార్డ్ చైర్మన్ నల్ల హనుమంతు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పర్వేజ్ అహ్మద్, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ మహబూబ్ ఖాన్, హాస్పిటల్ సూపరిండెంట్ ఇందిరా, కళాశాల సూపరిండెంట్ నాగేశ్వర్ రావు,ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 26 (జనం సాక్షి) :** భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ భూ భారతికి సంబంధించిన ఫైళ్ళు, రిజిస్టర్లు, ఇతర రికార్డులను సవివరంగా పరిశీలించారు.అన్ని రికార్డులు సక్రమంగా ఉండాలని సూచించారు. కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను శ్రద్ధగా విని,ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సులో ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రెవిన్యూ అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి సేవలు ప్రజలకు మరింత సులభంగా, ఉపయోగకరంగా ఉండేలా చూడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అలివేలు,ఏ.ఓ వెంకట్ రావు,సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో



**మానవపాడు, ఆగస్టు 26 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండల పరిధిలోని గోకులపాడు గ్రామ పంచాయతీని సందర్శించడం జరిగింది అని ఎంపీడీవో రాఘవ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తొందరగానే ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించడం జరిగింది. అదేవిధంగా గ్రామంలో ప్రాథమిక పాఠశాలను కూడా సందర్శించడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని మరియు విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారని పరిశీలించడం జరిగిందని తెలిపారు. మిడ్ డే మిల్స్ కూడా సక్రమంగా అందిస్తున్నారా లేదా అని సమాచారం కనుక్కొని విద్యార్థులతో మాట్లాడి.. విద్యార్థులతో పాటు మధ్యాహ్న భోజనం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవ, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వర్ రెడ్డి, ఐకెపి డిపార్ట్మెంట్ సీసీ బాష, మరియు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## మట్టి గణపతి తయారీపై విద్యార్థులకు అవగాహన



**చిన్నశంకరంపేట, ఆగస్టు 26 (జనం సాక్షి) :** మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని రక్షించాలని ఉద్దేశంతో చిన్న శంకరంపేట మండలం చందాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరమేశ్వర్ రెడ్డి విద్యార్థులకు మట్టి గణపతి తయారీపై అవగాహన కలిగించారు పిఓపి తో తయారుచేసిన వినాయకుల వల్ల పర్యావరణం దెబ్బతింటుందని మట్టితో చేసిన వినాయకులనే తయారుచేసి పూజించాలని ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులే మేలు

- ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి

**నారాయణఖేడ్, ఆగస్టు 26 (జనం సాక్షి) :** నారాయణఖేడు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ గురుకులాలు, ఉన్నంత పాఠశాలల విద్యార్థులకు స్థానిక సబ్ కలెక్టర్ ఉమా హారతి పర్యావరణ హితంగా మట్టి, ఇతర సహజ వనరులతో గణనాథుల తయారీపై డివిజన్ లో మండలాలలో పోటీలకు శ్రీకారం చుట్టారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ఆమె ప్రత్యేకంగా నిర్వహించారు. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని 14 గురుకులాల్లో పోటీలు పూర్తి అయ్యాయి. విద్యార్థులు మట్టి, సహజ వనరులతో గణపతిలను తయారు చేశారు. విద్యార్థులకు ఎంపిక చేసి, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. నారాయణఖేడ్ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలకు ప్రథమ బహుమతి దక్కింది.

### మట్టి విగ్రహాలు పంపిణీ..

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కుమారతి కోరిక మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వాసవి



మా ఇల్లు సంస్థ అధ్యక్షులు తోపాజి అనంత కిషన్ గుప్తా, ప్రధాన కార్యదర్శి పుల్లూరు ప్రకాష్ లా సౌజన్యంతో మంగళవారము మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. నారాయణఖేడ్‌లో మట్టి వినాయకులను అందించడం అభినందించదగ్గ విషయమని సబ్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ హసీనా బేగం, డిప్యూటీ తాసిల్దార్ రాజు పటేల్, సంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ నాయకులు మునిగాల మాణిక్ ప్రభు గుప్తా, ఆర్ ఐ మాధవరెడ్డి రెవెన్యూ సిబ్బంది స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఏటీసీలో 100 శాతం ప్రవేశాలు పూర్తి



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 26 (జనం సాక్షి) :** జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా శెట్టి ఆత్మకూరులో ఏర్పాటు చేయబడిన ఏటీసీలో 100% ప్రవేశాలు పూర్తి అయ్యాయని జోగులాంబ గద్వాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా టి గేట్ సభ్యుల పని తీరును అభినదించారు. రిజిస్ట్రేషన్ చేసుకుని సీట్లు లభ్యం కాని విద్యార్థులకు ఏదో ఒక ఉపాధి మార్గం చూపించాలి అని సూచించారు. ఈ సమావేశంలో టి గేట్ చైర్మన్ పి.జె.మహేష్ కుమార్,సభ్యులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## యూరియా కోసం పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే సునీత రెడ్డి నిరసన

- రైతుల రాస్తారోకో... భారీగా నిలిచిన వాహనాలు



**నర్సాపూర్, ఆగస్టు 26 (జనం సాక్షి) :** నర్సాపూర్ పట్టణంలో యూరియా కొరతకు నిరసిస్తూ సోమవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద రైతులతో కలిసి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి రాస్తారోకో నిర్వహించారు, నాలుగు వైపులా వాహనాలు భారీ ఎత్తున నిలిచిపోయాయి. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని ఎమ్మెల్యేతో పాటు రైతులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిదానాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు,గత మూడు రోజులుగా గ్రామాల్లో నుండి రైతులు యూరియా కోసం ఉదయం ఆరు గంటల నుండి తిండీ తిప్పలులేకుండా సాయంత్రం వరకు క్యూ లైన్‌లో నిలబడితే ఒక్క బస్తా యూరియా కూడా రైతులకు అందడం లేదన్నారు. ప్రభుత్వానికి ముందుచూపుతో ప్రణాళిక లేనందువల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు,దళారులుఒక బస్తా యూరియా 260 రూపాయల సంచిని 400 రూపాయలకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారని అన్నారు. తక్షణమే రైతులకు సరిపడ యూరియా ఇవ్వాలని లేనిపక్షంలో రైతుల ఆగ్రహాన్ని ప్రభుత్వం చూడాల్సి వస్తుందని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సత్యం గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు భోగ శేఖర్, పట్టణ అధ్యక్షులు పంబల్ల బిక్షపతి, నాయకులు, రింగుల ప్రసాద్, పడిగే నర్సింలు,అందూరి గణేష్, సుధాకర్ రెడ్డి,సుదీప్, తదితరులు వున్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- ఎమ్మార్వోకి వినతిపత్రం అందించిన మండలబిజెపి నాయకులు



**నంగునూరు, ఆగస్టు 26 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మెదక్ బిజెపి ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆదేశాను సారం నంగునూరు ఎమ్మార్వోకి వినతిపత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నంగునూరు మండల బిజెపి అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ న్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని, మండల వ్యాప్తంగా గ్రామాల్లో స్థానిక సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారని, పారిశుద్ధ్యం పడకేసిందని, ట్రాన్స్ఫార్మర్ల విషయంలో రైతులు ఇబ్బంది ఎదుర్కొంటూ ఉన్నారు. పాఠశాలల్లో, సాంఘిక గురుకుల పాఠశాలలో సమస్యలు విలయ తాండవం చేస్తా ఉన్నాయని అని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ హాస్టల్లో పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తిరుపతి రెడ్డి, బండి సతీష్, రత్నాకర్ రెడ్డి,సతీష్ గౌడ్, నరేష్,రజనీకార్ రెడ్డి కృష్ణా శ్రీనివాస్ గౌడ్, యాదగిరి,గంధం పరమేశ్వర్ రెడ్డి,కిషోర్ పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహ కాలనీ సమస్యలను పరిష్కరించాలి

- ఐద్వా నేతల డిమాండ్

**వనపర్తి, ఆగస్టు 26 (జనంసాక్షి) :** వనపర్తి టౌన్ పరిధిలోని లక్ష్మీనరసింహ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కమీషనర్ కు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు.ఐద్వా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. కాలనీలో మోరి, కాలువలు లేకపోవడం వల్ల మురుగు నీరు రోడ్లపై నిలిచిపోవడం, చెత్త పేరుకుపోవడం,



దుర్వాసనతో పాటు పాములు, పురుగులు ఇళ్లలోకి రావడం వంటి సమస్యలను కాలనీవాసులు వివరించారు. స్పందించిన కమిషనర్ గారు తక్షణమే మోరి, కాలువ పనులు చేపడతాం, అదేవిధంగా కాలనీలో శుభ్రతా కార్యక్రమాలను వెంటనే ప్రారంభిస్తాం అని హామీ ఇచ్చారు. రేపు ఉదయం 8 గంటలకు కాలనీని స్వయంగా సందర్శించి పరిస్థితిని పరిశీలిస్తాను అని కూడా తెలిపారు.ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సాయిలీల మాట్లాడుతూ కాలనీ ప్రజలు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, మున్సిపాలిటీ తక్షణమే చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలి. ఐద్వా తరఫున మేము నిరంతరం ప్రజల సమస్యలపై పోరాడుతాం అని అన్నారు. ఐద్వా కమిటీ ఉపాధ్యక్షురాలు శాంతమ్మ సభ్యులు లలిత, సుశీల,రమీజాబి కూడా కమిషనర్ గారితో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలపై దృష్టి సారించాలని కోరారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 26 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ అన్నారు. మంగళవారం ఐ.డి.ఓ.సి ఆవరణలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి తయారు చేసిన 2000 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాల వినియోగం ఎంతో ముఖ్యమని అన్నారు. సాధారణంగా,ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నదులు లేదా చెరువుల్లో వేయడం ద్వారా వాటిలోని రసాయన పదార్థాలు నీటిని కలుషితం చేస్తాయని తెలిపారు. మట్టి విగ్రహాలు సహజంగా కరిగి పోతాయని,వాటి వినియోగం పర్యావరణానికి ఎటువంటి హానీ కలిగించదని వివరించారు. పట్టణాలతో పాటు గ్రామాలలో కూడా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు.పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, గణేష్ చతుర్థి పర్యావరణహిత పండుగగా జరుపుకోవాలన్నారు.ఈ సందర్భంగా కలెక్టరేట్లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,ఏఓ భూపాల్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిశిత,బిసి సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ విమల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్

**సదాశివపేట, ఆగస్టు 26 (జనం సాక్షి) :** మున్సిపల్ కార్మికులకు పెండింగ్లో ఉన్న జీతాలు వెంటనే ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కమీషనర్ శివాజీ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సదాశివపేట మున్సిపాలిటీ లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు అనేక రకాల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో తమ వంతు పాత్ర పోషిస్తున్న మున్సిపల్ కార్మికులు వారి సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. చాలీ చాలని జీతాలతో జీవితం సాగిస్తున్న కార్మికులు సకాలంలో జీతాలు రావడం లేదని అన్నారు.




పెండింగ్లో ఉన్న జీతాలను తక్షణమే ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీతాలు రాకపోవడంతో అప్పులు చేసి సరుకులు కొనుక్కోవలసిన పరిస్థితి వస్తుందన్నారు. అదేవిధంగా వర్షాకాలంలో ప్రతి సంవత్సరం జర్కిన్ ఇచ్చి ఆనవాయితీ ఉంది. వర్షాకాలం వచ్చి రెండు నెలలవుతున్న ఇంకా ఇవ్వలేదని, తక్షణమే జర్కిన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సబ్బులు నూనెలు బట్టలు టవ్వాళాలు పరికరాలు పెండింగ్లో ఉన్నాయన్నారు. అనేక సంవత్సరాలు పనిచేస్తున్న కార్మికులకు మున్సిపల్ ఆఫీస్ నుండి గుర్తింపు కార్డులు లేవని మున్సిపల్ కార్మికులకు అందరికీ తక్షణమే గుర్తింపు కార్డు ఇచ్చి ప్రతి ఒక్క కార్మికునికి హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రమేష్ గౌడ్ మున్సిపల్ యూనియన్ నాయకులు అంజయ్య, శ్రీనివాస్, నర్సింలు సిహెచ్ మల్లేష్, రవికుమార్, యాదయ్య, గణేష్, నగేష్, రుక్కమ్మ, లక్ష్మి, సంతోష, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ఆసుపత్రిలో ల్యాబ్, మందుల నిల్వలు, పరిశీలించిన కలెక్టర్
- 10వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించిన కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 26 (జనంసాక్షి) :** ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .. ప్రభుత్వం ప్రజల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు అందించే ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తో కలిసి పట్టణంలో అమృత్ 2.0లో భాగంగా చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్ల ద్వారా ఇంటింటికి శుద్ధమైన త్రాగునీటిని అందించడం జరుగుతుందని, అమృత్ 2.0 ద్వారా అన్ని నివాసాలకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ తో కలిసి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, తరగతి గదులు, వంటశాల, పరిసరాలు పరిశీలించారు. విద్య రంగ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ, అదనపు గదులు ఇతర సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వంట సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలలో పాడైన ఆర్.ఓ. ప్లాంట్ స్థానంలో క్రొత్తది ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇంటర్మీడియట్ ఎం.పి.సి. విద్యార్థులకు, 10వ తరగతి విద్యార్థులకు స్వయంగా పాఠ్యాంశాలు బోధించారు. విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు.

# స్టూడెంట్స్ బాగు కోసం అందరూ కృషి చేయాలి

- జయశంకర్ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- హాస్టళ్లను తనిఖీ చేస్తున్న అధికారులు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** విద్యార్థులు ఆరోగ్యవంతంగా, ఉత్సాహ భరితంగా, విద్యలో సృజనాత్మకంగా ముందుకు సాగేందుకు అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు, పోలీస్, క్లస్టర్ అధికారులు సోమవారం నుండి వసతి గృహాలను తనిఖీ చేస్తూ, వసతి గృహాల్లో మెనూ అమలు తీరు, అక్కడి సౌకర్యాలను పరిశీలిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక, పోలీస్ అధికారులు విద్యార్థులతో కలిసి అల్పాహారం, మధ్యాహ్న భోజనం చేస్తూ విద్యార్థుల సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకుంటున్నారన్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా నిర్భయంగా అధికారులకు తెలియజేయాలని సూచించారు. స్టూడెంట్స్ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించి, వారి విద్యాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఉపాధ్యాయులు, వార్డెన్లు విద్యార్థులతో స్నేహితుల్లా ఉండాలని, వారిపై కాఠిన్యం చూపిస్తే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా అవసరమైతే పోలీస్ కేసులు నమోదుతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేద విద్యార్థుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని, ప్రతి ఒక్కరూ దీన్ని గమనించి, బాధ్యతతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయాలని సూచించారు. పిల్లలను మన పిల్లల మాదిరిగా చూడాలని, వారు ఎలాంటి సమస్య ఎదుర్కొంటున్నా సఖ్యతతో పరిష్కరించాలని, అపుడే విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా చక్కగా చదువుకోవడానికి ప్రశాంత వాతావరణం కల్పించినట్లు అవుతుందని కలెక్టర్ తెలిపారు.

# ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఆన్లైన్ బెట్టింగ్స్, బెట్టింగ్ యాప్స్, సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- నిర్మల్ జిల్లా ఎస్పీ జి.జానకి షర్మిల




**నిర్మల్ బ్యూరో, ఆగస్టు26(జనంసాక్షి) :** క్రైమ్ రివ్యు మీటింగ్ లో భాగంగా జిల్లా ఎస్పీ .జానకి షర్మిల మంగళవారం నిర్మల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అధికారులతో నెల వారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో నేరాలను అరికట్టడమే ప్రధాన లక్ష్యంగా కఠిన చర్యలు చేపట్టాలని,ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్లపై వాహన రద్దీ తగ్గేలా ముందస్తు చర్యలు తీసుకోవాలి అని తెలియ జేశారు. ముఖ్యంగా ఇళ్లలో జరిగే దొంగతనాలు ప్రజలకు ఆర్థికంగా నష్టం కలిగిస్తున్నాయని, వాటిని నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. "మహిళలు, పిల్లలపై నేరాలు తగ్గించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ, కఠిన చర్యలు తప్పవు అని స్పష్టం చేశారు. జిల్లాలో అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, మిస్సింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు అండగా ఉండాలని, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమిత లిమిట్ లో ఉండాలని సూచించారు.లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ఈ కేసుల ఛేదనకు సర్కిల్ పరిధిలో స్పెషల్ టీం లను ఏర్పాటు చేయాలన్నారు.ఆన్లైన్ బెట్టింగ్స్, బెట్టింగ్ యాప్స్, ఆన్లైన్ మోసాలు, సైబర్ మోసాలు,డ్రగ్ దుర్వినియోగం మరియు ట్రాఫిక్ రూల్స్ పై జిల్లా ప్రజలలో, విద్యాసంస్థలలో అవగాహన కల్పిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని యస్.హెచ్.ఒ లకు సూచించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో ఆన్లైన్ లో వీడియో కాల్స్ చేసి, పోలీసు అధికారులం అంటే నమ్మరాదని, ఏ పోలీస్ అధికారి వీడియో కాల్స్ చేయరని గుర్తించాలని అన్నారు. డిజిటల్ అరెస్ట్ లు ఉండవు, ఫిజికల్ అరెస్ట్ మాత్రమే ఉంటుందన్నారు. సైబర్ స్లేవరీ పేరుతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి ఇతర దేశాలకు పంపి ఇబ్బందులకు గురిచేస్తారని అన్నారు. వినాయక నవరాత్రులు ప్రారంభం కానున్న నేపథ్యంలో పండగ మొదలు నుండి నిమజ్జన శోభాయాత్ర వరకు ఎలాంటి భద్రతా లోపం లేకుండా అన్ని ఏర్పాట్లు చేసి, తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏ.ఎస్పీ అవినాష్ కుమార్ ఐపిఎస్, రాజేష్ మీన ఐపిఎస్, ఇన్స్పెక్టర్లు గోవర్ధన్ రెడ్డి ఖానాపూర్, నైలు భైంసా రూరల్, గోపీనాథ్ భైంసా టౌన్ , గోవర్ధన్ రెడ్డి సోన్ ,ప్రవీణ్ కుమార్ నిర్మల్ టౌన్,కృష్ణ నిర్మల్ రూరల్, మల్లేష్ ముధోల్ , సి సి ఎస్ ఇన్స్పెక్టర్ మల్లేష్, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ రవీంద్ర నాయక్, సమ్మయ్య, సాయి కుమార్ గౌడ్,అన్ని స్టేషన్ల ఎస్ హెచ్ ఓ లు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించండి

- బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్



**బెల్లంపల్లి, ఆగష్టు 26, (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణకు ప్రజలు మట్టి గణపతులనే పూజించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ సూచించారు. మంగళవారం ఆయనబెల్లంపల్లి వన్ టౌన్ సీఐ శ్రీనివాస రావుతో కలిసి జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో దాతలు, సభ్యుల సహకారంతో పర్యావరణ పరిరక్షణ కొరకు బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా వద్ద పర్యావరణ పరిరక్షణ కొరకు భక్తులకు ఉచితంగా 801 మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మనోజ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు అందరు మట్టి గణపతులు పూజించాలన్నారు. ప్రతి సంవత్సరం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి గణపతులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. జనహిత సేవా సమితి సేవలని అభినందించారు. ఈసందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జనహిత సేవా సమితి ఆవిర్భావం నుండి తొమ్మిది సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ కొరకు దాతల సహకారంతో మట్టి గణపతులు పంపిణీ చేస్తున్నామని, దాతల సహకారంతో 801 మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేశామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు రసాయనాలతో కూడిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు కాకుండా మట్టి గణపతులు పూజించి పర్యావరణ పరిరక్షణ కొరకు సహకరించాలని కోరారు. మట్టి గణపతులు పంపిణీ కార్యక్రమం కోసం సహకారం అందించిన దాతలకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి వన్ టౌన్ సీఐ శ్రీనివాస రావు, ఫారెస్టు బీట్ ఆఫీసర్ శంకర్ రాథోడ్, మాజీ కౌన్సిలర్ గెల్లి రాజలింగు, జనహిత సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అభ్యసన ఫలితాలు సాధించాలి

- ఆర్ జె డి సత్యనారాయణ రెడ్డి



**నిర్మల్ బ్యూరో (జనంసాక్షి) :** ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, సత్యనారాయణ రెడ్డి, జిల్లా విద్యాధికారి రామా రావు తో కలిసి జిల్లాలోని పలు పాఠశాలను సందర్శించారు. సోన్ మండలంలోని సోన్ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడ ప్రాథమిక తరగతులలో జరుగుతున్న తొలిమెట్టు కార్యక్రమాలను పరిశీలించారు. అభ్యసన ఫలితాల సంబంధిత ప్రశ్నలు విద్యార్థులను అడిగి, వారి ప్రగతిని తెలుసుకున్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, పాఠశాలలో జరుగుతున్న విద్యా సంబంధిత కార్యక్రమాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత గూర్చి తెలుసుకున్నారు. విద్యార్థుల వివరాలు యూ డైస్ లో ఆన్లైన్ లో నమోదు చేయలని సూచించారు.సోన్ భవిత కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో విద్యార్థులకు అందిస్తున్న సహిత విద్య సేవలను గురించి ఐఆర్పిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సహాయ కార్యదర్శి భానుమూర్తి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జనంసాక్షి కథనానికి స్పందన



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు26 (జనంసాక్షి) :** నిర్మల్లో రోడ్లపై మురికి నీరు-అంటు రోగాల బారిన జనం శీర్షిక గత ఐదు రోజుల క్రితం జనంసాక్షిలో వ్రాయడతో స్పందించిన అధికారులు గాంధీచౌక్ నుండి బుధవార్ పెట్,పాత బస్టాండ్ గుండా సిమెంట్ కాంక్రీట్‌తో గుంతలు పూడ్చి రోడ్డు అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టారు. సంబంధిత కాలనీ వాసులు,గాంధీచౌక్ వ్యాపారస్తులు జనంసాక్షి కథనానికి స్పందించి అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జలపాతం సందర్శనకు వెళ్లి తప్పి పోయిన యువకుడు

- కాపాడిన అటవీ శాఖ సిబ్బంది
- అనుమతి లేకుండా వచ్చినందుకు కేసు



**నూగూర్ వెంకటాపురం ఆగస్టు 26 (జనం సాక్షి ):** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో ని వీరభద్రవరం గ్రామ సమీపంలో ముత్యం దార జలపాతం ఉంది. భారీ వర్షాలు కారణం గా అటవీ శాఖ అధికారులు ముత్యం దార జలపాతం అడవి లో ఉండటం వలన పర్యాటకుల సందర్శన నిషేదం అని బోర్డు పెట్టారు. ఫారెస్ట్ అధికారులు కాపలా తో పాటు నిఘా ఏర్పాటు చేశారు. దట్టమైన అడవిలో ఉన్న జలపాతాన్ని సందర్శించేందుకు వరంగల్ చెందిన యువకుడు వెళ్లి దారి తప్పిపోయాడు. ఆ యువకుడు రిల్స్ చేయడానికి వెళ్లి చీకటి పడటం తో దారి తప్పి పోయి, భయం తో డయల్ 100కి ఫోన్ చేశాడు. వెంటనే స్పందించిన అటవీ శాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టి, మంగళవారం తెల్లవారు జామున ఆ యువకుడిని సురక్షితంగా బయట తీసుకువచ్చారు. ఈ సంఘటనలో పర్యాటక చట్టాలు ఉల్లంగించి నందుకు యువకుడిపై కేసు నమోదు చేశారు.

# జీవితంలో లక్ష్యసాధనకు ప్రయత్నించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 26(జనంసాక్షి) :** మంగళవారం కన్నాయిగూడెం మండలం లోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 8, 9, 10 వ తరగతి విద్యార్థులకు ఒకే తరగతి గతిలో కూర్చబెట్టి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. అప్పటికే 10 తరగతిలో ఉపాధ్యాయుడు సోషల్ స్టడీస్ బోధిస్తుండడంతో ఆ పాఠానికి సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. విద్యార్థుల తల్లిదండ్రుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని సూచించారు. సమస్యలేవైనా వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం కలెక్టర్ కన్నాయిగూడెం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆరోగ్య కేంద్రంలోని జనరల్ ఇన్ పేషెంట్ వార్డ్ ను, ల్యాబ్ టెక్నీషియన్ గదిని పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్యాధికారులు మరియు వైద్య సిబ్బంది ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఉద్యోగులు నిర్దేశిత, హెడ్- క్వార్టర్లలో ఉండి, ప్రజల అనారోగ్య సమస్యలు, వర్షకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, సేవలు అందించాలని, జనరల్ ఇన్ పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకుని, వైద్యాధికారి, వైద్య సిబ్బంది అందిస్తున్న సేవల పట్ల ఆరా తీశారు. జనరల్ ఓపి రిజిస్టర్ ను పరిశీలించి, ప్రతిరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కొరకు ఎంతమంది వస్తున్నారని, జ్వరంతో వచ్చిన ప్రతి వ్యక్తికి మలేరియా డెంగ్యూ ఆర్డిటి పరీక్షలు చేయాలని, వర్షా కాలానికి సరిపడే మలేరియా డెంగ్యూ ఆర్డీటి కిట్లు మరియు మందులు అందుబాటులో ఉండేటట్లు చూసుకోవాలని, లేని ఏడల జిల్లా కార్యాలయానికి ఇండెంట్ పెట్టి మందులను సమకూర్చుకోవాలని వైద్యాధికారునికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటనారాయణ, ఎంపిడిఓ సాజిద, హెడ్మాస్టర్ రాజ శేఖర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుడు డాక్టర్ అభినవ్, ఉపాధ్యాయులు నరేష్, కోటయ్య, లక్ష్మయ్య, విద్యార్థులు, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాతకేసుల పురోగతిని సమీక్షించుకోవాలి

- ములుగు జిల్లా ఎస్పీ డా.శబరిష్.పి
- నెలవారి నేర సమీక్ష సమావేశం



**ములుగు బ్యూరో,ఆగస్ట్26(జనం సాక్షి):** పాతకేసుల పురోగతిని సమీక్షించుకోవాలని ములుగు జిల్లా ఎస్పీ డా.శబరిష్.పి అన్నారు. మంగళవారం రోజున ములుగు జిల్లా కేంద్రం లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ డా.శబరిష్.పి నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్,సస్పెక్ట్ షీటర్స్ గురించి ఆరా తీసి,వారిని ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ ఉండాలని,వారి వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలని ఆదేశించారు.ముఖ్యంగా వినాయక చవితి సందర్భంగా జిల్లాలో విగ్రహాలు ప్రతిష్టించే ప్రతి ఒక్కరు కూడా ఆన్లైన్ దరఖాస్తు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.అలాగే మండపాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొనేలా చూడాలని అన్నారు.అలాగే విగ్రహాల ఏర్పాటు అనంతరం వాటిని జియో టాగింగ్ చేయాలని సూచించారు. మండపాలలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని,నిమజ్జనం జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ కావలసిన ఏర్పాట్లు ముందుగానే చేయాలని సూచించారు.కోర్టులో ట్రయల్ లో ఉన్న కేసుల గురించి ఆరా తీసి, ప్రతికేసులోను తప్పనిసరిగా సాక్షులకు,ముద్దాయిలకు సమన్లు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.నేరస్తులకు శిక్ష పడే విధంగా కోర్టు కానిస్టేబుల్ లు విధులు నిర్వహించాలని, అంతిమంగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలలో నమోదైన కేసుల వివరాలపై పోలీస్ స్టేషన్ ల వారీగా ఆరా తీసి, కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ప్రతి కేసులోనూ ఎప్పటికప్పుడు ఆన్లైన్లో ఫైల్ అప్డేట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.దొంగతనాలు,ఆర్థిక నేరాలలో ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా దర్యాప్తును ముమ్మరం చేయాలని, పోగొట్టుకున్న నగదు లేదా వస్తువులను బాధితులకు అప్పగించేలా కృషి చేయాలి అని ఆదేశించారు.పాత కేసుల దర్యాప్తులో పురోగతిని పరిశీలించి, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని, బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.అదే విధంగా జిల్లాలో ఇసుక అక్రమ రవాణ పైన నిఘా ఉంచాలని అన్నారు.చెక్ పోస్టులలో సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఇసుక అక్రమ రవాణా ను కట్టడి చేయాలని ఆదేశించారు.అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రజలలో అవగాహన తీసుకొని వచ్చి కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచనలు చేశారు.రోడ్డు ప్రమాదాలపై ప్రజలలో అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. మహిళలపై జరిగే నేరాలలో వీలైనంత త్వరగా విచారణ చేసి పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలి అని ఆదేశించారు.యువత ఆన్లైన్ బెట్టింగ్ వలలో పడి మోసపోకుండా పోలీస్ స్టేషన్ ల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఎవరైనా ఆన్లైన్ బెట్టింగ్ ని ప్రోత్సహిస్తే వల్ల పైన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారి చేశారు.యువత, ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా సైబర్ క్రైమ్ నేరాలపై ఆయా పోలీస్ స్టేషన్ ల పరిధి లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదేశించారు.ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ,ములుగు డీఎస్పీ రవీందర్,ఎస్బి ఇన్స్పెక్టర్ శంకర్,సీసీఎస్ ఇన్స్పెక్టర్ కుమార్,సిఐ ఏటూరునాగారం శ్రీనివాస్,సిఐ ములుగు సురేష్, సిఐ వెంకటాపురం రమేష్,సిఐ పస్రా దయాకర్, ఎస్ఐ ములుగు వెంకటేశ్వరరావు, ఎస్ఐ వెంకటాపూర్ రాజు,ఎస్ఐ పస్రా కమలాకర్, ఎస్ఐ తాడ్వాయి శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఐ ఏటూరునాగారం రాజ్ కుమార్,ఎస్ఐ మంగపేట సురేష్,ఎస్సై కన్నాయిగూడెం వెంకటేష్,ఎస్ఐ వాజేడు సతీష్,ఎస్ఐ పేరూరు కృష్ణ ప్రసాద్, ఎస్సై వెంకటాపురం తిరుపతి,డిసిఆర్బి ఎస్సై జగదీష్ మరియు ఐటీ కోర్ టీం, డిసిఆర్బి సిబ్బంది పాల్గొన్నారు.

# నవోదయ విద్యాలయాలు విద్యార్థుల భవిష్యత్తుకు సోపానాలు

- జిల్లా కలెక్టర్ వెంకటేష్



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 26 ( జనంసాక్షి) :** జవహర్ నవోదయ విద్యాలయాలు విద్యార్థుల యొక్క ఉన్నతికి సోపానాలుగా మారుతున్నాయని జిల్లా కలెక్టర్ వెంకటేష్ అన్నారు. మంగళవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాలయంలో నూతనంగా నిర్మించిన అతిథి గృహాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ను నవోదయ ప్రిన్సిపాల్ కృష్ణ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు మొదట తల్లిదండ్రులను గౌరవించాలని, ఆ తర్వాతే ఉపాధ్యాయులు ముఖ్యమని అన్నారు. విద్యార్థి జీవితంలో వినయము, క్రమశిక్షణ, పట్టుదల అనేవి చాలా ముఖ్యమైన అంశాలని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు టెక్నాలజీలో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన గుస్సాడీ నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
27 ఆగస్టు 2025

# గంజాయి విక్రయిస్తున్న 10 మంది నిందితులు అరెస్ట్

- వారి నుండి 1350 గ్రాముల గంజాయి
- 22 గంజాయి చాక్లెట్లు మూడు మోటార్ సైకిల్ 8 సెల్ ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డి.ఎస్.పి రాజశేఖర్ రాజు



మిర్యాలగూడ, ఆగస్టు 26 (జనం సాక్షి) : అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న పదిమంది అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకొని అరెస్ట్ చేసినట్లు మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు తెలిపారు. మంగళవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడలోని రూరల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన గంజాయి నిందితుల వివరాలను వెల్లడించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సికిందర్ తో పాటు రాజ్ కుమార్ పటేల్, మిర్యాలగూడ కు చెందిన షేక్ సమీర్, కొండేటి యశ్వంత్, కోడల శివ, బొల్లంపల్లి విష్ణు, బుర్రి లోకేష్, ద్రైద సందీప్, గుండెబోయిన వంశీ, పందిరి చరణ్, మిరియాల వివేకానంద రెడ్డి, బుర్రి నవీన్, శివం ఫార్మా డైరెక్టర్ ఉన్నావ్‌లు ఒక ముఠాగా ఏర్పడి గంజాయి మరియు మాదకద్రవ్యాలను కొనుగోలు చేసి మాడుగులపల్లి మండల పరిధిలోని పలు గ్రామాలలో వీటికి బానిసలైన యువకులకు అమ్ముతున్నారు. ఈ క్రమంలో గంజాయి అలవాటు ఉన్న కొంతమంది వ్యక్తుల ద్వారా బీహార్ రాష్ట్రం నుండి మాదక ద్రవ్యాలను తీసుకువచ్చి మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ఎక్కువగా అమ్ముతూ యువతను నాశనం చేస్తున్నారు. వీరు చేస్తున్న అక్రమ గంజాయి వ్యాపారం పై తమకు అందిన సమాచారం మేరకు నిఘాను పెట్టమన్నారు. ఈనెల 25న ఈ ముఠా సభ్యులు మాడుగులపల్లి పాత రైల్వే క్వార్టర్స్ వద్ద గంజాయి మరియు గంజాయి చాక్లెట్లు పరస్పరం మార్చుతున్న సమయంలో తమ పోలీస్ సిబ్బంది చాకచక్యాంగా పట్టుకొని అరెస్టు చేశారన్నారు. అనంతరం జరిపిన విచారణలో పూర్తి వివరాలు తెలిసాయన్నారు. వారి వద్ద నుండి 1350 గ్రాముల గంజాయి, 22 గంజాయి చాక్లెట్లు, మూడు మోటార్ సైకిల్ తో పాటు 8 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని రిమాండ్ కు పంపినట్లు తెలిపారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా జల్సాలకు అలవాటు పడినవారు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వారి ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ ఉండాలని తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాలకు మేరకు మిషన్ పరివర్తనలో భాగంగా తమ సబ్ డివిజన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేస్తూ గంజాయి మాదకద్రవ్యాల మహమ్మారి వంటి వాటిని అరికట్టేందుకు కృషి చేయడంతో పాటు ప్రతిరోజు తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఈ గంజాయి కేసును అత్యంత చాకచక్యంగా చేదించిన మిర్యాలగూడ రూరల్ సీఐ పీ ఎన్ డి ప్రసాద్, మాడుగుల పల్లి ఎస్ఐ కృష్ణయ్య తోపాటు సిబ్బంది నరసింహారావు, జాఫర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసు, సైదులు, సైదిరెడ్డి, అనిల్, ఆంజనేయులు, యాదయ్య, నరేష్, శ్రీనునాయక్, డ్రైవర్ సురేష్ లను ఆయన అభినందించారు.

## సెప్టెంబర్ 6 నుంచి రాష్ట్రస్థాయి మహిళా వాలీబాల్ పోటీలు..



జడ్చర్ల, ఆగస్టు 26 (జనంసాక్షి) : మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా రెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని శ్వేతా రెడ్డి జ్ఞాపకార్థం, సెప్టెంబర్ 6 నుంచి మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి మహిళల వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్టు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తెలిపారు. సోమవారం జడ్చర్ల లోని లక్ష్మారెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో యాదయ్య మాట్లాడుతూ శ్వేతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి మహిళ వాలీబాల్ జట్లు పాల్గొననున్నారని, గెలుపొందిన విజేతలకు బహుమతితో పాటు షీల్డు, మెడల్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వాలీబాల్ పోటీల గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రనిల్ చందర్, పిట్టల మురళి, రామ్మోహన్, సుదర్శన్ గౌడ్, రఘుపతి రెడ్డి, శ్రీశైలం, ప్రశాంత్ రెడ్డి, సతీష్, దేవ, కరాటే శ్రీను, వీరేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రెటరీ భీమ్ సింగ్



సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 26 (జనంసాక్షి) : తెలంగాణ ఇంటర్ బోర్డు డైరెక్టర్, సెక్రెటరీ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు మంగళవారం ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రెటరీ, ఉమ్మడి నల్గొండ జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఎల్.భీమ్ సింగ్ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ను కలిశారు.జిల్లాలో ఇంటర్ విద్యకు సంబంధించి అంశాలపై చర్చించి వివరించారు.గత సంవత్సరం ఇంటర్ విద్యలో సూర్యాపేట జిల్లా సాధించిన ఉత్తీర్ణత శాతంపై చర్చించారు.ఈ సంవత్సరం ప్రభుత్వ కళాశాలలో జరిగిన ప్రవేశాల గురించి వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరమ్మతులకు సంబంధించిన సివిల్ వర్క్స్ తదితర పనులు, వాటి పురోగతి గురించి తెలిపారు . ఇటీవల ఇంటర్మీడియట్ వ్యవస్థలో తీసుకొచ్చిన ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుందని పేర్కొన్నారు.గత సంవత్సరం ఇంటర్ ఫలితాలతో పాటు వచ్చే విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై వచ్చే నెల 2న రివ్యూ మీటింగ్ నిర్వహిస్తామని చెప్పినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట డిఐఈఓ వి.భాను నాయక్ పాల్గొన్నారు.

# కడుపులో నుంచి 4.2 కిలోల భారీ కణితి తొలగింపు

దేవరకొండ, ఆగస్టు 26 (జనం సాక్షి) : సాధారణంగా మనుషుల కడుపులో చిన్న చిన్న పరిణామంలో కణితులు ఏర్పడడం సహజం. కానీ ఓ రోగి కడుపులో ఏకంగా 4.200 కిలోల కణితి ఏర్పడిందంటే మీరు నమ్ముతారా..? అవును తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న ఓ స్త్రీ ఆస్పత్రికి రాగా, వైద్యులు శస్త్రచికిత్స చేసి భారీ పరిమాణంలో ఉన్న కణితిని తొలగించారు. ఈ అరుదైన సంఘటన దేవరకొండలో జరిగింది. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం, కొద్దిరోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న నాంపల్లి మండలం ముష్టిపల్లి రాజ్యా తండా కు చెందిన రామావత్ సీతకు పరీక్షించిన వైద్యులు కడుపులో ఏదో ఉందని గ్రహించారు. స్కానింగ్ చేయగా, కడుపులో భారీ కణితి ఉన్నట్లు తెలిసింది. దేవరకొండ పట్టణంలోని లక్ష్మీ విజయ హాస్పిటల్ వైద్య బృందం తీవ్రంగా శ్రమించి రోగి కడుపులోని



4.2 కిలోల జీర్ణశయాంతర కణితిని విజయవంతంగా తొలగించారు. గర్భసంచి తొలగించిన ఐదు సంవత్సరముల తర్వాత రోగి ఈ సమస్యతో బాధపడుతున్నాదని వైద్యులు చెప్పారు. కణితి భారీ పరిమాణంలో ఉండడం వల్ల నడవడానికి కూడా ఇబ్బంది పడ్డినట్లు తెలిపారు.ఆ భారీ కణితిని తొలగించడం తమ వైద్య బృందం సాధించిన ఓ విజయమని లక్ష్మీ విజయ హాస్పిటల్ వైద్య బృందం అన్నారు. ఇటువంటి సంక్లిష్ట సమస్యలకు అధునాతన శస్త్రచికిత్స నైపుణ్యాలు, సమన్వయం ఎంతో అవసరమన్నారు. ఇలాంటి కణితులను శస్త్రచికిత్స చేయకుండా వదిలేస్తే ప్రాణాలకే ప్రమాదమని అన్నారు.ప్రాణాలు కాపాడిన వైద్య బృందానికి సీత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీత ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రస్తుతం సదరు మహిళ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్లను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించుకోవాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 26 (జనంసాక్షి) : ఇందిరమ్మ ఇండ్లను నాణ్యత ప్రమాణాలతో నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ చెప్పారు.మంగళవారం చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరిలో పందిరి నవ్య నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇల్లును పరిశీలించారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను ఖచ్చితమైన కొలతలతో, ప్రభుత్వం నిర్దేశించిన స్థలములోనే నిర్మించుకోవాలని, స్థానిక మేస్త్రీలతో ఇంటి నిర్మాణాలు చేపట్టాలని, ముందుగా అగ్రిమెంట్ చేసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, దానిని సద్వినియోగం చేసుకొని త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని అన్నారు.అనంతరం ఉన్నత పాఠశాలను, ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.9వ తరగతికి వెళ్లి విద్యార్థులతో తెలుగు చదివించారు.ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని, అప్పుడే మంచి ఫలితం వస్తుందని, కష్టపడే మనస్తత్వాన్ని విద్యార్థి దశ నుండే అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.ప్రైమరీ స్కూల్ లో 4,5వ తరగతులకు వెళ్లి విద్యార్థులతో ఎక్కాలు చదివించారు, ఇంగ్లీషు, లెక్కలు చేయించారు. పిల్లలు బాగా చదవడంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.వంట గదిని పరిశీలించారు. వంట గదిలో వెలుతురు ఉండే విధంగా చూసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సంతోష్, ఎంపీడీవో ప్రకాష్ రావు,ఎంఈఓ కళారాణి, హెడ్మాస్టర్ బి.శైలజ,హౌసింగ్ ఏఈ ప్రేమలత, పంచాయతీ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్, ఆగస్టు 26 (జనం సాక్షి) : జిల్లాలో మంగళవారం సహా రాబోయే కొన్ని రోజులపాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలనిజిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. వర్షాలు కొనసాగుతున్న సమయంలో ఎలాంటి నిర్లక్ష్యం చూపకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. తక్కువ ప్రదేశాలు, వంతెనలు, వాగులు, చెరువులు వంటి నీటిమునిగే ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. విద్యుత్ తీగలు, కరెంట్ స్తంభాల దగ్గరికి వెళ్లరాదని, మండల, గ్రామ స్థాయి అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజల నుండి వచ్చే సమాచారం పై వెంటనే స్పందించాలని ఆయన ఆదేశించారు. సహాయక చర్యల కోసం తహసీల్దార్లు, ఎమర్జెన్సీ టీములు సిద్ధంగా ఉంచాలని సూచించారు. వాతావరణ శాఖ ముందస్తు ఇస్తున్న సమాచారం ప్రకారం ప్రజలు, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

# బోధన అభ్యాసన మేళాతో బోధన సులభతరం

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 26 (జనంసాక్షి) : బోధనాభ్యసన మేళా ద్వారా ప్రాథమిక స్థాయిలో బోధించడం సులభతరం అవుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మంగళవారం చివ్వెంల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి బోధనాభ్యసన ప్రదర్శనను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ఇలాంటి ప్రదర్శన ఏర్పాట్లు చేయడం చాలా సంతోషమని అన్నారు. 37 పాఠశాలల ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించి ప్రతి స్టాల్ లో ప్రదర్శించిన బోధన పరికరాలను గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకుకొని సంబంధించిన ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఎంఈఓ కళారాణి మాట్లాడుతూ చివ్వెంల మండల స్థాయి నందు 1 నుండి 5 వ తరగతి వరుకు ప్రాథమిక స్థాయి బోధన అభ్యసన ప్రదర్శన నందు 37 ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారని చెప్పారు.వీరిలో 4 సబ్జెక్టుల నుండి 10 ఉపకరణాలను ఎంపిక చేసి, జిల్లా స్థాయి ప్రదర్శనకు పంపడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సంతోష్, ఎంపీడీవో ప్రకాష్ రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

బిజినేపల్లి, ఆగస్టు 26 (జనం సాక్షి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికాలను ఆదేశించారు. మంగళవారం బిజినపల్లి మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారు బీసం కృష్ణవేణి ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ పరిశీలించారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని, అవి ఏఏ దశలో ఉన్నాయో ఇప్పటి వరకు ఎన్ని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరిగాయని, జరిగినంత వరకు లబ్ధిదారుల అకౌంట్ లలో డబ్బులు జమ అయ్యాయా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కావాల్సిన సిమెంటు, ఇటుక, స్టీల్ కూడా తక్కువ ధరలకు ఇచ్చేలా చూడాలన్నారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఇసుక కూడా ప్రభుత్వమే ఇస్తుందని అన్నారు. మేస్త్రిలు కూడా నిర్ణయించిన ధర ప్రకారం ఇల్లు కట్టాలని, ఇల్లు కట్టుకునే లబ్ధిదారులు మేస్త్రి లకు ఎక్కువ ధర డబ్బులు ఇవ్వకూడదని అన్నారు. ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి దశల వారీగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. మంజూరైన ఇళ్లు బేస్‌మెట్ లెవల్‌కు చేరిన వెంటనే లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారి ఖాతాలో జమ అవుతుందన్నారు. ఏమైనా



సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట బిజినపల్లి తహసిల్దార్ మున్నూరుద్దీన్ ఎంపీడీవో కథలప్ప పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఎంపీ చామల, ఎమ్మెల్యే మందుల



తుంగతుర్తి, ఆగస్టు 26 (జనం సాక్షి) : గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ ను ఎంపీ ఎమ్మెల్యే తో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి కి వచ్చే రోగులు వారి సహాయకులు సందర్శకుల తాగునీటి అవసరాల కోసం తాగునీటిని ప్లాంటు ఏర్పాటు చేశామని అన్నారు. వైద్య సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కల్పిస్తూ..పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సాధ్యమైనంత త్వరలో ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పెండింగ్ లో ఉన్న ఆస్పత్రి బిల్లులపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహా తో మాట్లాడి బిల్లులు మంజూరు చేపిస్తానని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా వైద్యానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ఒక్కొక్కటిగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, రైతు భరోసా, రుణమాఫీ, గృహ లక్ష్మీ, మహాలక్ష్మి పథకాలను అమలు చేస్తూ ప్రజల హృదయాల్లో నిలిచిపోతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ నిర్మల్ కుమార్, తహసిల్దార్ దయానందం, ఎంపీడీవో శేషు కుమార్, డి ఎచ్ వెంకటేశ్వర్లు, పిసిసి సభ్యులు గుడిపాటి నరసయ్య ఉమ్మడి జిల్లా,డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, కాంగ్రెస్ కమిటీ జిల్లా మహిళ అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు, మండల అధ్యక్షురాలు, సత్తమ్మ, సావిత్రమ్మ, దేవాలయ చైర్మన్ సంజీవ, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కోరు కొప్పుల నరేష్ , ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ అధ్యక్షుడు కొండగడుపుల ప్రవీణ్,సంవిధాన్ మండల కోఆర్డినేటర్ మాచర్ల అనిల్,కొండ రాజు, పెద్ద బోయిన అజయ్, కొమ్ము జోహార్, పొన్నాల సృజన్, జిల్లా నాయకులు దాసరి శ్రీను,కలకోట్ల మల్లేష్, సంకినేని రమేష్,మంగళపల్లి నాగరాజు,ఆస్పత్రి సిబ్బంది, ఎన్ ఎస్ యు ఐ, యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు. పాల్గొన్నారు.

## ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



మర్రిగూడ, ఆగస్టు 26 (జనం సాక్షి) : నల్లగొండ జిల్లా, గట్టుప్పల్ మండల కేంద్రంలో పలు ప్రభుత్వ సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి. మంగళవారం గట్టుపల్ లోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను ఆమె పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రత, చదువు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పి హెచ్ సి ఆస్పత్రి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ,సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వెంట చండూరు ఆర్డీవో శ్రీదేవి, తహసిల్దార్ రాములు, ఎంపీడీవో మాధవరెడ్డి, తదితరులు ఉన్నారు.






# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..!

**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాల్లో ముగిశాయి. భారత్ ఎగుమతి చేసే వస్తువులపై అమెరికా అదనపు సుంకాలు బుధవారం నుంచి అమలు కానున్నాయి. ఇప్పటికే 25శాతం సుంకాలు అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అదనంగా 25శాతం సుంకాలు విధించగా.. బుధవారం (ఆగస్టు 27 నుంచి) 50శాతానికి చేరనున్నాయి. ఈ క్రమంలో సుంకాల ఆందోళనల నేపథ్యంలో మార్కెట్లు ఒకశాతానికిపైగా పడిపోయాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 81,377.39 వద్ద నష్టాల్లో మొదలైంది. సుంకాల ఆందోళన నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. ఇంట్రాడేలో 81,450.28 పాయింట్ల గరిష్టాన్ని నమోదు చేసిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,685.98 పాయింట్లకు పడిపోయింది. చివరకు 849.37 పాయింట్ల నష్టంతో 80,786.54 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 255.70 పాయింట్లు తగ్గి 24,712.05 వద్ద స్థిరపడింది. యూఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి 13 పైసలు తగ్గి 87.69 వద్ద ముగిసింది. మార్కెట్లు దాదాపు 1,167 షేర్లు లాభపడగా.. 2,751 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్ నష్టపోగా.. ఐషర్ మోటార్స్, హెచ్‌యూఎల్, మారుతి సుజుకి, నెస్లే ఇండియా, ఐటీసీ లాభాల్లో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా అన్నిరంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్, మెటల్, ఫార్మా, ఆయిల్ అండ్ గ్యాస్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ, టెలికాం ఒకటి నుంచి రెండుశాతం వరకు తగ్గాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.3శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.7 శాతం తగ్గాయి.

# ఆటో రంగంలో విప్లవాత్మక మార్పులు

- భారత్‌లో రూ.70 వేలకోట్ల పెట్టుబడి పెట్టనున్న సుజుకి..



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** భారతదేశంలోనే అతిపెద్ద కార్ల తయారీదారు మారుతి సుజుకి మాతృ సంస్థ అయిన సుజుకి మోటార్ కార్పొరేషన్ .. రాబోయే 5-6 సంవత్సరాలలో సుమారు రూ. 70 వేల కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ఈ మేరకు కంపెనీ డైరెక్టర్ అధ్యక్షుడు తోషిహిరో సుజుకి మంగళవారం గుజరాత్‌లో ప్రకటించారు.గుజరాత్‌లోని హన్సల్‌పూర్ ప్లాంట్ వద్ద జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి తోషిహిరో సుజుకి కలిసి కంపెనీ తొలి గ్లోబల్ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం (బీఈవీ)- ఈ వితారాను ఆవిష్కరించారు.భారతదేశంలో ఎలక్ట్రోడ్-స్థాయి స్థానికీకరణతో తయారు చేసిన తొలి లిథియం-అయాన్ బ్యాటరీ మరియు సెల్ ను కూడా ప్రధాని మోడీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా తోషిహిరో సుజుకి మాట్లాడుతూ.. భారతదేశం గ్రీన్ మొబిలిటీ వైపు దూసుకెళ్తోందన్నారు. ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావడం మా గౌరవంగా భావిస్తున్నాం. రాబోయే 5 నుంచి 6 సంవత్సరాల్లో రూ. 70 వేల కోట్ల పెట్టుబడి పెట్టి వికసిత భారత్ లక్ష్యానికి తోడ్పడతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం మారుతి సుజుకి రెండు ప్రధాన రాష్ట్రాలలో (హర్యానా,గుజరాత్) లో ఉత్పత్తి యూనిట్లను నడుపుతోంది. కంపెనీ 2030-31 నాటికి 4 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకుంది. ఇది ప్రస్తుతం ఉన్న సామర్థ్యానికి దాదాపు రెండింతలుగా చెప్పుకోవచ్చు. హన్సల్‌పూర్ ప్లాంట్ భవిష్యత్తులో 1 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉండబోతోంది. దీంతో, ఇది ప్రపంచంలోని అతిపెద్ద ఆటోమొబైల్ తయారీ కేంద్రాలలో ఒకటిగా నిలవనుంది. ఈ సౌకర్యం ద్వారా సుజుకి తన మొదటి ఎలక్ట్రిక్ వాహనం ఈ-వితారాను తయారు చేసి జపాన్, యూరప్‌తో సహా 100కి పైగా దేశాలకు ఎగుమతి చేయనుంది.

ఈ ప్రాజెక్ట్‌లో మరో ముఖ్యమైన మైలురాయి భారతదేశపు తొలి లిథియం-అయాన్ బ్యాటరీ మరియు సెల్ ఉత్పత్తి ప్రారంభాన్ని చెప్పుకోవచ్చు. ఇది తోషిబా-డెన్సో-సుజుకి సంయుక్త ప్లాంటులో తయారవుతుంది. జపాన్ నుండి వచ్చే ముడి పదార్థం కొన్ని సెమీకండక్టర్ భాగాలను ఉపయోగిస్తున్నప్పటికీ, మిగతా ఉత్పత్తి పూర్తిగా భారతదేశంలోనే జరుగుతుంది. ఇది ఆత్మనిర్భర్ భారత్ కు ముఖ్యమైన మద్దతు అవుతుందని కంపెనీ తెలిపింది.

2030-31 నాటికి ఉత్పత్తి సామర్థ్యాన్ని రెండింతలు పెంచడాన్ని సుజుకీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈవీలు, హైబ్రిడ్ వాహనాలు, బ్యాటరీ ఉత్పత్తిలో ముందంజలో ఉండడం, హన్సల్‌పూర్‌ను ప్రపంచ స్థాయి ఎలక్ట్రిక్ వాహన ఉత్పత్తి హబ్ గా మార్చడం, భారతదేశాన్ని కేంద్రంగా చేసుకుని గ్లోబల్ ఎగుమతులను పెంచడం వంటి వాటిని టార్గెట్ చేసుకుంది. సుజుకి పెట్టుబడి ప్రణాళిక భారత ఆటో పరిశ్రమలో విప్లవాత్మక మార్పులకు నాంది పలకనుంది. భారతదేశ గ్రీన్ మొబిలిటీ లక్ష్యానికి, విక్సిత్ భారత్ దిశగా పయనానికి ఒక పెద్ద బలం కానుంది.

# మళ్లీ పెరిగిన బంగారం ధర..



- వెండి ఒకే రోజు రూ.3వేలు జంప్..!

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** బంగారం ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా బలమైన ట్రెండ్ నేపథ్యంలో ధరలు పెరిగాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో మంగళవారం 24 క్యారెట్ల పసిడి ధర రూ.600 పెరిగి.. తులం ధర రూ.1,00,770కి చేరుకుంది. 22 క్యారెట్ల పుత్తడి ధర రూ.500 పెరిగి తులం ధర రూ.1,00,400కి చేరుకుంది. మరో వైపు వెండి రూ.3వేలు పెరిగి.. తులం ధర రూ.1,18,000కి పెరిగిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ లిసా కుక్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలగించడం ప్రభావం చూపిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు (కమోడిటీస్) సౌమిల్ గాంధీ తెలిపారు. పెట్టుబడిదారులు సాంప్రదాయ సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గు చూపడంతో బంగారం ధరలు పెరిగాయి. ఈ నిర్ణయం సెంట్రల్ బ్యాంకు స్వతంత్రపై ఆందోళనలు రేకెత్తించింది. అలాగే, ట్రంప్ చర్యలు వడ్డీ రేట్లను త్వరగా తగ్గించడానికి ఫెడ్ నాయకత్వంపై అదనపు ఒత్తిడిని తీసుకువచ్చారు. ఇది బంగారానికి ప్రయోజనం చేకూర్చే చర్యగా సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా బంగారం 0.37 శాతం పెరిగి ఔన్స్‌కు 3,378.37 డాలర్లకు ఎగిసింది. మరోవైపు, స్పాట్ సిల్వర్ 0.21 శాతం తగ్గి ఔన్స్‌కు 38.48కి చేరుకుంది.

అధ్యక్షుడు ట్రంప్ ఫెడ్ గవర్నర్ లిసా కుక్‌ను తొలగించిన తర్వాత యూఎస్ సెంట్రల్ బ్యాంక్ స్వతంత్రపై ఆందోళనల మధ్య డాలర్ మళ్లీ బలహీనపడడంతో స్పాట్ గోల్డ్ పెరిగిందని కోటక్ సెక్యూరిటీస్‌లోని ఏవీపీ కమోడిటీ రీసెర్చ్ కైనత్ చైన్వాలా తెలిపారు. సుంకాలపై అనిశ్చితి సైతం పెరుగుదలకు కారణమని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. ఆగస్టు 27 నుంచి భారతదేశంపై అదనంగా 25 శాతం సుంకం విధించాలన్న ట్రంప్ చర్యలు.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు శాంతి చర్చలలో ఏదైనా అర్థవంతమైన పురోగతిపై వ్యాపారులను సందిగ్ధంలో పడేస్తున్నాయి. మరో వైపు సెంట్రల్ బ్యాంకులు తమ బంగారం నిల్వలు పెంచుకుంటున్నాయి. ముఖ్యంగా చైనా, టర్కీ, బంగారు నిల్వలను భారీగా కొనుగోళ్లు చేయడంతో మార్కెట్‌లో ఊపు వస్తుందని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు.

# వెండిని దాచుకుంటున్న సౌదీ సెంట్రల్ బ్యాంక్

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** దేశంలోని సెంట్రల్ బ్యాంకులు సాధారణంగా బంగారాన్ని రిజర్వ్ ఆస్తిగా నిల్వ చేసుకుంటున్నాయనే విషయం అందరికీ తెలిసిందే. అయితే వెండిని కూడా నిల్వ చేసుకుంటాయా.. అంటే లేదనే చెప్పవచ్చు. తాజాగా సౌదీ అరేబియా సెంట్రల్ బ్యాంక్ తీసుకున్న నిర్ణయం ఈ ధోరణిని మార్చే సూచనలు ఇస్తోంది. సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్ కీర్తన్ ఎ. షా లింక్డ్‌ఇన్‌లో చేసిన ఒక పోస్ట్‌లో ఈ పరిణామాన్ని ప్రస్తావించారు. సౌదీ సెంట్రల్ బ్యాంక్ నిశ్శబ్దంగా వెండిలో స్థానం సంపాదించడం యాదృచ్ఛికం కాదు. ఇది రాబోయే కాలంలో బంగారం-వెండి సమతౌల్యంపై కొత్త దృష్టి కోణాన్ని తెచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. వెండి కేవలం ఆభరణాల లోహం మాత్రమే కాదు, నేటి పారిశ్రామిక రంగంలో అది అనివార్యంగా చెప్పుకోవచ్చు. దీనిని ఎలక్ట్రానిక్స్ తయారీలో వాడతారు. అలాగే.. 5%+% మౌలిక సదుపాయాలతో పాటుగా సౌర ఫలకాలు, ఎలక్ట్రిక్ వాహనాలు (బ్యాటరీలు, ఛార్జింగ్ సిస్టమ్స్, సెన్సార్లు) అలాగే సెమీకండక్టర్ తయారీ మరియు డేటా సర్వర్ కూలింగ్ వంటి విభాగాల్లో వెండి కీలక పాత్ర పోషిస్తోంది. సిల్వర్ ఇన్స్టిట్యూట్ తాజా వరల్డ్ సిల్వర్ సర్వే 2025ప్రకారం.. వెండి మార్కెట్ వరుసగా నాలుగో సంవత్సరం సరఫరా లోటుతో కొనసాగుతోంది. 2024లో మాత్రమే సుమారుగా 4,600 టన్నుల లోటు నమోదైంది. అంతేకాక.. గని ఉత్పత్తి 2026లో గరిష్ట స్థాయికి చేరుకుంటుందని అంచనా.

# కష్ణానగర్‌లో ‘హైడ్రా’ నాలా ఆపరేషన్

- 2 మీటర్ల దూరం.. ఏడెనిమిది ట్రాక్టర్ల సిల్ట్
- 8 అడుగుల లోతు .. ఆరడుగుల మేర పూడిక
- పూడిక తీత పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్

**హైదరాబాద్, ఆగస్టు 26 (జనంసాక్షి) :** నాలాలో ఒకటి రెండు అడుగుల మేర పూడిక ఉండడం సహజం. కాని కృష్ణా నగర్‌లో నాలా లోతు 8 అడుగులుంటే.. అందులో 6 అడుగుల మేర సిల్ట్ పేరుకుపోయిన దృశ్యాలు అందరినీ ఆశ్చర్య పరిచాయి. రెండు మీటర్ల మేర పూడికను తీస్తే.. ఏడెనిమిది ట్రాక్టర్లు నిండుతున్న పరిస్థితి అక్కడ నెలొకంది. ఈ దృశ్యాలను కళ్లారా చూస్తున్న స్థానికులు.. ఔరా.. అనుకుంటున్నారు. ఏమాత్రం వర్షం పడినా.. వరద నీరంతా రహదారులను, నివాసాలను ముంచెత్తడానికి ఇది కూడా చాలావరకు కారణమని భావిస్తున్నారు. బయట పడుతున్న సిల్ట్‌ను, పూడిక తీత పనులను చూసి.. ఈ స్థాయిలో పనులు జరగడాన్ని తాము ఎన్నడూ చూడలేదని స్థానికులు చెబుతున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం నాలా క్లీనింగ్ పనులను పరిశీలించారు. మొత్తం పూడిక తీసిన వరకూ ఈ పనులను కొనసాగించాలని ఆదేశించారు. పదిహేను.. ఇరవై రోజులైనా పనులు పూర్తి చేయాలని సూచించారు. నాలాలో ఉన్న పూడిక మొత్తం తొలగితే.. గాయంత్రి హిల్స్, యూసుఫ్‌గూడ బెటాలియన్, వెంకటగిరి ప్రాంతాల నుంచి వచ్చే వరద చాలా వరకు సాఫీగా వెళ్లడానికి వీలుంటుందని స్థానికులు చెబుతున్నారు.



**నాలా ఆక్రమణలపై కమిషనర్ ఆగ్రహం**

జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 1లో జీవీకే దయగ్నాస్టిక్స్ వద్ద నాలాను ఆక్రమించడమే కాకుండా.. ఏకంగా నాలాపై షెడ్డులు వేయడాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా పరిగణించారు. వెంటనే నాలా ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. హైడ్రాకు ఫిర్యాదుల నేపథ్యంలో నాలా ఆక్రమణలను హైడ్రా కమిషనర్ మంగళవారం పరిశీలించారు. 5 మీటర్ల విస్తీర్ణంలో ఉండాల్సిన నాలాను కేవలం 2 మీటర్లకే పరిమితం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నాలాకు ఇరువైపుల ఉన్న నివాసితులు షెడ్డులు వేసి వారి ఇళ్లల్లో పని చేస్తున్నవారికి ఇచ్చారని స్థానికులు తెలిపారు. కొంతమందిని వాకబు చేయగా తాము రెంట్లు కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు. నాలా కుంచిచుకోపవడంతో భారీ వర్షం పడినప్పుడు వరద నీరు రోడ్డులను ముంచెత్తుతోందని.. స్థానికులు ఫిర్యాదు చేశారు. షెడ్డులను ఖాళీ చేయడానికి సమయం ఇచ్చి.. వెంటనే ఆక్రమణలను తొలగించాలని హైడ్రా కమిషనర్ ఆదేశించారు. అనంతరం జూబ్లీహిల్స్ చెక్ పోస్టు సమీపంలో సోమవారం ఆక్రమణలు తొలగించిన 2 వేల గజాల స్థలాన్ని హైడ్రా కమిషనర్ పరిశీలించారు. ఆక్రమణలకు ఆస్కారం లేకుండా.. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాన్ని కాపాడాలని అధికారులను ఆదేశించారు. ఆక్రమణలకు పాల్పడితే చర్యలుంటాయంటూ హైడ్రా ఏర్పాటు చేసిన బోర్డులను పరిశీలించారు.

# భాగ్యనగరంలో ఉత్సవాలకు ప్రత్యేకత

- ఖైరతాబాద్ గణపతికి పెరుగుతున్న ఆదరణ
- వేలంలో బాలాపూర్ లడ్డూ ప్రత్యేకం

**హైదరాబాద్, ఆగస్ట్26 (జనంసాక్షి) :** గణేశ్ ఉత్సవాల పేరెత్తగానే మహారాష్ట్ర తరవాత హైదరాబాదే గుర్తుకు వస్తుంది. హైదరాబాద్‌లో ఈ ఉత్సవాలకు అంతటి ఘనత ఉంది. భాగ్యనగర గణపతి నవరాత్రి ఉత్సవాలు నగర ప్రజల సామరస్య జీవనానికి, ఐకమత్యకు అద్దం పడతాయి. భాగ్యనగర గణపతి నవరాత్రి ఉత్సవాలు నగర ప్రజల సామరస్య జీవనానికి, ఐకమత్యకు అద్దం పడతాయి. ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించు కునేందుకు ఏటా లక్షల్లో జనం తరలి వస్తారు. ఇక్కడ ఏటా ఓ రకమైన వినాయకుడి ప్రతిమను తయారు చేస్తున్నారు. మట్టి గణపతికి ప్రాధాన్యం పెరిగింది. బాలాపూర్ లడ్డూ వేలానికి ప్రతీక.ఇలా అనేక ప్రత్యేకతలు వినాయక ఉత్సవాల్లో ఉన్నాయి. నిమజ్జనం కూడా జంటనగరాల్లో బహుళ ప్రాచుర్యం పొందింది. హైదరాబాద్‌లోని కొన్ని వినాయక మండపాలలో లంబోదరుడి లడ్డూ ప్రసాదాన్ని కొందరు ముస్లిం, క్రిష్టియన్లూ వేలంపాట ద్వారా దక్కించుకో వడం అందుకు తార్కాణం. అంతేకాదు, చార్మినార్ తదితర ప్రాంతాలలో గణపతి శోభాయాత్ర సమయంలో కొందరు ముస్లింలు ఎదురెళ్లి భక్తులకు మంచినీరు అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన సందర్భాలెన్నో. రాజా బహద్దుర్ వేంకటరామారెడ్డి హైదరాబాద్ కొత్వాల్‌గా బాధ్యతలు నిర్వర్తి స్తున్న సమయంలో గణపతి శోభాయాత్రలో చిన్నపాటి సమస్య తలెత్తింది. ఆ సమయంలో ఒక ఉన్నత పోలీసు అధికారిగా ఆయన అనుసరించిన వ్యూహం నేటి పోలీసులకూ ఆదర్శనీయం. గణపతి నిమజ్జనం సమయంలో కొందరు పోలీసులే భక్తులతో గొడవపెట్టు కున్నారు. దాంతో, ఊరేగింపు నడిరోడ్డుపై నిలిచింది. భక్తులు వినాయకుడి శోభాయాత్ర పల్లకిని నడిరోడ్డుపై దింపేశారు. ఆ సంగతి తెలిసి హుటాహుటిన సంఘట నా స్థలానికి చేరుకున్న కొత్వాల్, సమస్యకు కారణమైన పోలీసు జవానులను మందలించారు. అయినా భక్తులు వాదులాట ఆపలేదు. దాంతో వేంకటరామారెడ్డి స్వయంగా వినాయకుని ఊరేగింపు పల్లకిని భుజానికెత్తుకోబోయారు.

# వరదల్లో కొట్టుకుపోయి నలుగురు మృతి

**రాయపూర్, ఆగస్ట్26 (జనంసాక్షి) :** ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో వరదల్లో కొట్టుకుపోయి నలుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు, ఓ వ్యక్తి ఉన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 40 మందితో కూడిన ఓ కుటుంబం స్థానికంగా ఓ ఆలయ సందర్శనకు వచ్చింది. తిరుగు ప్రయాణంలో వారు నడుచుకుంటూ వాగు దాటుతుండగా.. భారీ వర్షం కురిసింది. వాగులో అకస్మాత్తుగా వరద ప్రవాహం పెరగడంతో అందులోని నలుగురు కొట్టుకుపోయారు. సహాయక చర్యలు చేపట్టిన అధికారులు.. వారి మృతదేహాలను వెలికితీశారు.

# సూర్యాపేట జిల్లాలో యూరియాకు కొరత లేదు

- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** జిల్లాలో యూరియాకు కొరత లేదని, సరిపడా నిల్వలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మంగళవారం కలెక్టరేట్ లో డీఏఓ శ్రీధర్ రెడ్డి, డిసిఓ పద్మతో కలిసి మండల వ్యవసాయ అధికారులు, మండల విస్తరణ అధికారులు మరియు కోపరేటివ్ డివిజనల్ అధికారులతో వెబ్ ఎక్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యూరియా సరఫరాపై సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1600 మెట్రిక్ టన్నుల యూరియా నిన్నటి వరకు అందుబాటులో ఉందని, రాబోయే 2, 3 రోజులలో 1000 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు సరఫరా కానున్నట్లు తెలిపారు. నిన్నటి వరకు 29000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటికే 31000 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయటం జరిగిందని పేర్కొన్నారు.రైతులు ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వారి అవసరాలకు తగ్గట్టుగా నిరంతరం ఈ సీజన్ పూర్తయ్యే వరకు యూరియా సరఫరా చేయటం జరుగుతుందని తెలిపారు. అందువలన యూరియా దొరకదని ఆందోళనతో రైతులు ఎవరు ముందస్తుగా యూరియా కొనుగోలు చేయరాదని, జిల్లాలో 5600 లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉన్నదని, యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా మంచి ఫలితాలను ఇస్తుందని తెలిపారు.దీనిని అన్ని రకాల పురుగు మందులలో కలిపి పిచికారి చేయొచ్చని చెప్పారు. వ్యవసాయ అధికారులు నిరంతరం అన్ని సొసైటీలలో,ఎరువుల దుకాణాలలో యూరియా సరఫరాను జాగ్రత్తగా పరిశీలించాలని, కోపరేటివ్ అధికారులు కూడ నిరంతరం యూరియా సరఫరాను పర్యవేక్షించాలని ఆదేశించారు.

# హిమాచల్‌లో మళ్లీ భారీ వర్షాలు

- ప్రమాదస్థాయిలో బియాస్ నది ప్రవాహం

**సిమ్లా, ఆగస్ట్26 (జనంసాక్షి) :** హిమాచల్ ప్రదేశ్ పై మళ్లీ ప్రకృతి తన ప్రకోపాన్ని చూపించింది. తీవ్ర స్థాయి వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడ్డాయి. భారీ వరదల వల్ల కిరాట్పూర్-మనాలీ జాతీయ హైవేపై నష్టం జరిగింది. దీంతో మండీ, మనాలీ లో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల .. బియాస్ నది ఉప్పొంగుతున్నది. దాని ఉప నదులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో అత్యవసర సహాయక చర్యలు చేపడుతున్నారు. జాతీయ రహదారి పలు ప్రదేశాల్లో బ్లాక్ అయ్యింది. మనాలీ సమీపంలో ఉన్న బిందు ధంక్ వద్ద బియాస్ నది వరద నీటికి జాతీయ హైవే కొట్టుకుపోయింది. దీంతో మనాలి పర్యాటక కేంద్రానికి రాకపోకలు తెగిపోయాయి. మనాలీలో నది సమీపంలో ఉన్న ఓ హోటల్.. ఆ వరదలో కొట్టుకుపోయింది. మండి, కులు ప్రాంతాల్లో డేంజర్ మార్క్ దాటి నది ప్రవహిస్తున్నది. లోతట్టు ప్రాంతాల్లో జీవిస్తున్న వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నది. బహంగ్, అలూ గ్రౌండ్ ప్రాంతాల నుంచి జనాలను తరలిస్తున్నారు. మరో 24 గంటల పాటు నది సమీపానికి వెళ్లవద్దు అని పర్యాటకులకు అధికారులు హెచ్చరిక చేశారు.

# గణేశ్ ఉత్సవాలతోనే ప్లాస్టిక్ నిషేధం




**హైదరాబాద్, ఆగస్ట్26 (జనంసాక్షి) :** వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకోవాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ రహితంగా ఉత్సవాలను జరుపుకోవాలన్న ప్రతిన తీసుకుంటే మన భూమిని మనం కాపాడుకుంటామని అంటున్నారు. భూసారాన్ని దెబ్బతీస్తున్న పాలిథిన్ వినియోగాన్ని తగ్గించాలని కోరుతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో వాటి వినియోగాన్ని నియంత్రించలేక పోతున్నారు. ఇందుకు ఉద్యమ తరహా మార్పు అవసరమని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు. స్వచ్ఛభారత్ అమలు చేస్తున్నా గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగంపై నిసేధం అమలు కాకపోవడంతో తీవ్ర కాలుష్యం ఏర్పడుతోంది. అయితే కరోనా ఎఫెక్ట్‌తో ప్రపంచం మొత్తంగా పర్యావరణహితంగా ప్లాస్టిక్ వాడకమూ తగ్గింది. ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను జార విడుస్తున్న కారణంగా భూమిలో అవి కరగక కాలుష్యం ఏర్పడుతోంది. భూమిలో అది చేరి వాతావరణ కాలుష్యాన్నిపెంచుతోంది. కేన్సర్ వ్యాధి వ్యాప్తికి, వాతావరణం కాలుష్యానికి కారణమౌతున్న ప్లాస్టిక్‌పై ప్రభుత్వం నిషేధం విధించింది. గ్రామాల పరిధిలో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరిగిపోతోంది. దీనికితోడు చెత్త శుద్ధి లోపించడంతో ప్రధాన రహదారుల్లో దుర్వాసన వెదజల్లుతోంది. పెళ్లిళ్లు, పండుగలు, పార్టీల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్ల ను వినియోగిస్తున్నారు. వినియోగం అనంతరం రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో గుట్టలుగా పడేసి చేతులు దులుపు కుంటున్నారు. వాతావరణాన్ని కలుషితం చేసి మన ప్రాణాలను హరిస్తున్నాయన్న విషయం గుర్తించ లేకపోతున్నాం. గుట్టలు గుట్టలుగా పడిఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా భావించి తింటున్న పశువులు, జంతువులు మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, సీసాలను తరచూ వినియోగిస్తూ కేన్సర్ వ్యాధి సోకే లక్షణాలు అధికంగా ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్న పిల్లలకు కూడా సోకే అవకాశం అధిక శాతం ఉందని సూచిస్తున్నారు. వినియోగం విపరీతంగా పెరిగి పోవడంతో కాలువలు, డ్రెయిన్లు, ఖాళీ ప్రదేశాలు, డంపింగ్‌యార్డుల్లో గుట్టలు గుట్టలుగా ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోతున్నాయి.

# విశాఖలో రెండు యుద్ధనౌకలు జాతికి అంకితం

- ఆపరేషన్ సిందూర్ ముగియలేదన్న రాజ్‌నాథ్



**విశాఖపట్నం, ఆగస్ట్26 (జనంసాక్షి) :** ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. పాక్ ఉల్లంఘనలరకు పాల్పడితే మరోమారు బుద్ధి చెప్పడానికి సైనిక బలగాలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. కొత్తగా తయారు చేసిన యుద్ధ నౌకలు 'ఉదయగిరి', 'హిమగిరి'లను విశాఖపట్నంలో ఏర్పాటు- చేసిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ జాతికి అంకితం చేశారు. ఈ నౌకలను డిజైన్, స్టెల్త్, ఆయుధాలు, సెన్సార్ వ్యవస్థల్లో అత్యాధునిక సాంకేతికతో తయారు చేశారు. దేశంలోని వేర్వేరు షిప్‌యార్డులలో నిర్మించిన రెండు ఫ్రంట్‌లైన్ సర్ఫేస్ యుద్ధ నౌకలను ఒకేసారి జాతికి అంకితం చేయడం ఇదే ప్రథమం. బ్లూ వాటర్ పరిస్థితుల్లో రక్షణ బాధ్యతలను నిర్వర్తించే సామర్థం ఈ నౌకల సొంతం అని తెలిపారు. ఈ రెండు నౌకలు బహుళ పాత్రలు పోషించనున్నాయని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

స్వదేశీ యుద్ధనౌక సామర్థ్యానికి ఈ



## అభివృద్ధి పనులను పర్యవేక్షించిన కలెక్టర్ బి. సత్యప్రసాద్!

**రాయికల్ ఆగస్టు 26 (జనంసాక్షి):**
ప్రభుత్వ ఆదేశాల క్రమము గిరిజన గ్రామాలలో వివిధ అభివృద్ధి పనుల కొరకు అంచనాలను తయారు చేయడానికి జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జగన్నాథ్ పూర్ మరియు నాయకపు గూడెం గ్రామాలలో పలు అభివృద్ధి పనుల కొరకు ప్రత్యక్షంగా పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలోనీ గిరిజన గ్రామాలు మరియు తండాలలో అవసరమైన పలు అభివృద్ధి పనులు సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాల భవనాలు, అంగన్వాడీ సెంటర్లు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, వాటర్ ట్యాంకులు వంటి సౌకర్యాలను గుర్తించి, అవసరమైన అంచనాలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రాజ్‌కుమార్, డిపిఓ మదన్ మోహన్, పీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు లక్మన్ రావు, ఎంపీడీవో చిరంజీవి, తహసిల్దార్ నాగార్జున, డీఈఈ మిలింద్, ఏఈ పీఆర్ ప్రసాద్, ఆర్ఐ పద్మయ్య, పీఎస్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.



# సైకిళ్ల పంపిణీతో టెన్త్‌లో డ్రాపవుట్స్ రేట్ తగ్గుతోంది

### త్వరలోనే 9వ తరగతి విద్యార్థులకూ సైకిళ్లను అందించాలని యోచిస్తున్నా

- మానకొండూరులో టెన్త్ విద్యార్థు లకు సైకిళ్లను పంపిణీ చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- ఉబ్బితబ్బిబ్బైన విద్యార్థులు..
- భావోద్వేగంతో ఆనందభాష్పాలు రాల్చిన బూస అర్చన



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 26 (జనంసాక్షి)**
'సంజయన్నా... మాది నిరుపేద కుటుంబం, తండ్రి తాగుడకు బానిసైండు, అమ్మ కూలీ పనిచేస్తుంది, తినడానికే ఇబ్బంది పడుతున్నాం అని అట్లాంటి మాకు ఇంత పెద్ద సైకిల్ గిఫ్ట్ ఇచ్చారు. ఏమిచ్చి మీ రుణం తీర్చుకోవాలి? అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎదుట మానకొండూరు నియోజకవర్గంలోని తాడికల్ గ్రామానికి చెందిన టెన్త్ క్లాస్ విద్యార్థిని బూస అర్చన ఆనంద భాష్పాలు రాలుస్తూ చెప్పిన మాటలివి. మంగళవారం రోజు మానకొండూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'మోదీ గిఫ్ట్' పేరుతో నిర్వహించిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా "మోదీ గిఫ్ట్" పేరుతో బండి సంజయ్ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అర్చన సంతోషంతో తీవ్ర భావోద్వేగానికి గురై పై విధంగా స్పందించారు. అర్చన ఒక్కతే కాదు... టెన్త్ క్లాస్ చదువుతూ సైకిళ్లు అందుకున్న విద్యార్థుల ఆనందానికి హద్దుల్లేకుండా పోయాయి. సైకిళ్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా మానకొండూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి తోపాటు జిల్లా అదనపు డీఈవో, ఏసీపీ, ఎమ్మార్వో, ఎంపీడీవో తోపాటు బీజేపీ జిల్లా కరీంనగర్, పెద్దపల్లి అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, సంజీవరెడ్డి, కరీంనగర్ మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు.

ప్రజాసంగ్రామ యాత్రలో చాలా మంది పిల్లలకు చెప్పులు లేకుండా ఎండలో నడిచి వెళ్లడం చూసిన. దాదాపు 10 వేల మందికి చెప్పులు కొనిచ్చిన. పేదరికం ఎంత దారుణంగా ఉందో నాకు తెలుసు. కళ్లారా చూసిన. ఆ బాధలు అనుభవించిన. నేను కూడా పేద కుటుంబం నుండే వచ్చిన. శిశు మందిర్ స్కూలులో చదువుకున్నా. మా నాన్న టీచర్. కష్టపడి మమ్ముల్ని చదివించారు. ఇయాళ మిమ్ముల్ని చూసుకోవడానికి నరేంద్రమోదీ ఉన్నారు. కానీ ఆనాడు మమ్ముల్ని ఎవరూ పట్టించుకోలేదు. నాకు తెలుసు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు స్కూల్ కు వెళ్లాలంటే ఇంటి నుండి చాలా దూరం నడిచి వెళుతున్నారని. ఆటోలు, బస్సుల్లో వెళదామంటే పైసలుండవు. సొంతంగా బండి కొనే స్థోమత ఉండదు. ముఖ్యంగా టెన్త్ క్లాస్ పిల్లలకు స్పెషల్ క్లాస్ లు ఉంటాయి. దీంతో చాలా ఇబ్బంది పడుతున్న విషయాన్ని ద్రుష్టిలో ఉంచుకుని ఈ సైకిళ్ల పంపిణీని చేపట్టినం. ఈ సైకిళ్ల పంపిణీ కరీంనగర్, హుజూరాబాద్, హుస్నాబాద్, చొప్పదండి, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో పూర్తయింది. ఈరోజు వేములవాడ, మానకొండూరు నియోజకవర్గాల్లో పంపిణీని ప్రారంభిస్తున్నం. సైకిళ్ల పంపిణీపై దేశవ్యాప్తంగా సానుకూల చర్చ జరుగుతోంది. సైకిళ్లు అందుకున్న విద్యార్థులు చాలా సంతోషంగా ఉన్నారు. సమయానికి క్లాసులకు హాజరవుతున్నారు. డ్రాపవుట్స్ తగ్గుతోందని పేర్కొన్నారు.

**ఎంపీగా ఉన్నంత కాలం సైకిళ్లను పంపిణీ చేస్తా..**

నేను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నంత కాలం ప్రభుత్వ పాఠశాలలు, శిశు మందిర్ లో టెన్త్ చదివే విద్యార్థులందరికీ సైకిళ్లను పంపిణీ చేస్తా. ఓట్ల కోసం, పేరు కోసం సైకిల్ ఇవ్వడం లేదు. విద్యార్థుల రెగ్యులర్ గా స్కూల్ కు వెళ్లి బాగా చదువుకుని భవిష్యత్తులో బాగుపడాలనే ఉద్దేశంతోనే సైకిళ్లను ఇస్తున్నా. త్వరలోనే ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్ కేజీ నుండి 6వ తరగతి వరకు 'మోదీ కిట్స్' ను పంపిణీ చేస్తాం. ఒక స్కూల్ బ్యాగ్ తోపాటు వాటర్ బాటిల్, పెన్ను, పెన్సిళ్లు, నోట్ పుస్తకాలు, రబ్బర్ ను 'మోదీ కిట్స్' పేరుతో అందిస్తా. తప్పనిసరిగా వినియోగించుకుని బాగా చదువుకుని రాణించాలని విద్యార్థులను కోరుతున్నా అని తెలిపారు.



## పర్యావరణ పరిరక్షణకు రెవెన్యూ ఉద్యోగుల కృషి

### పదహారు ఏళ్లుగా మట్టి వినాయకుల పంపిణీ

**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 26 (జనంసాక్షి) :** పదహారు సంవత్సరాలుగా మట్టి వినాయకులను జిల్లాకు తెప్పించి పంపిణీ చేస్తున్నారు. పీ వో పీ వినాయకులు, రంగు రంగుల వినాయకులను మత్రమే ఎంపిక చేసిన తరుణంలోమట్టి వినాయకులను కూడా రంగు రంగులుగా ఎంతో అందంగా ఉన్నావని తెలియజేస్తూ తమ వంతుగా మట్టి వినాయకుల ద్వారా ప్రజలను జాగృతం చేసింది వీరే. ' హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్' ఈపేరు బహుశా ఎప్పుడో ఒకసారి ఏదో ఒక చోట వినే ఉంటారు. దీని వ్యవస్థాపక అధ్యక్షుడు రమణ్‌రెడ్డి మరియు కొంతమంది రెవెన్యూ ఉద్యోగులు కలిసి దీన్ని ఏర్పాటు చేశారు. రెవెన్యూ శాఖలో ఎంతో బిజీబిజీగా ఉన్నా.. ఓ వైపు పర్యావరణ పరిరక్షణ.. మరోవైపు సామాజిక సేవ, పేదలకు అండగా నిలిచేందుకు ఈ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ వేదికగా తమ వంతు సహాయాన్ని అందిస్తున్నారు. ఐడిఓసీలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి , జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు రక్తదానం చేసేందుకు విరివిగా క్యాంపులు పెట్టి పలువురి చేత ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిరణ్ కుమార్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, కలెక్టరేట్ ఏవో, జిల్లా కార్యదర్శి ప్రశాంత్ కుమార్, కోశాధికారి విజయ్ కాంత్ రావు, ఉపాధ్యక్షులు భూపతి ప్రభు, కలెక్టరేట్ సూపరెండెంట్ శ్రీనివాసరావు, డిచ్ పల్లి తహసిల్దార్ సతీష్ రెడ్డి కలెక్టరేట్ ఉద్యోగులు రవీందర్ రెడ్డి, సంతోష్, ప్రవీణ్ కుమార్ సహచర ఉద్యోగులందరు పాల్గొన్నారు.

## చెప్పినట్టే సిరిసిల్ల నేతన్నలకు "చేతి"నిండా పని..

- తుమ్మల నాగేశ్వరరావు చేనేత జౌలి శాఖ మంత్రి
- కార్మికులకు 'త్రిఫ్ట్ "ద్వారా 24 కోట్ల 60 లక్షలు పంపిణీ
- పరిశ్రమలోని అన్ని సమస్య లను పరిష్కరిస్తాం





**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 26 (జనంసాక్షి):**
గతంలో ప్రజా ప్రభుత్వం చెప్పినట్టే సిరిసిల్ల నేతన్నలకు చేతినిండా పని కల్పిస్తుందని చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సిరిసిల్లలో త్రిఫ్ట్ పథకం ద్వారా నేత కార్మికులకు చెక్కులను పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిరిసిల్ల పట్టణంలోని కే కన్వెన్షన్ హాల్లో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో సిరిసిల్ల నేత కార్మికుల సమస్యల విషయంలో ప్రజలను కొందరు నాయకులుఎంతో భయపెట్టారని బిఆర్ఎస్ పార్టీని ఉద్దేశించి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలు తెలుసని అన్నారు. గత ప్రభుత్వం వివిధ రకాలుగా బకాయి పెట్టి పోయిన సుమారు 1000 కోట్ల రూపాయలను దశలవారీగా ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. గతంలో తమ ప్రభుత్వం చెప్పినట్టే సిరిసిల్ల నేత కార్మికులకు చేతినిండా పని కల్పించడంలో సఫలమైందని అన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను భయపెడుతున్న విద్యుత్ "బ్యాక్ బిల్లింగ్" తోపాటు వస్త్ర పరిశ్రమలు నెలకొన్న సమస్యలను పరిష్కరిం చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని అన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి వడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రధానంగా చేతివృత్తులతో పాటు,విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల వేములవాడ లను పారిశ్రామిక,ఆధ్యాత్మిక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి అభివృద్ధి కోసం కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ చేనేత జౌలి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య మాట్లాడుతూ ప్రత్యేకంగా సిరిసిల్ల నేత కార్మికుల కుటుంబాల ప్రయోజనాలకోసం రెండు సంవత్సరాలలో పూర్తయ్యేలా త్రిఫ్ట్ పథకాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా త్రిఫ్ట్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ మహేష్ గీతే, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కే.కే .మహేందర్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ సిరిసిల్ల వ్యవసాయ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూప అధికారులు సిరిసిల్ల వస్త్ర పారిశ్రామికులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనానికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు : జిల్లా ఎస్‌పి యం.రాజేశ్ చంద్ర





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 26 (జనంసాక్షి):** గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా, భద్రతతో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు చేపట్టింది. బాన్సువాడ పట్టణంలో గణేశ్ ప్రతిష్టాపన మరియు నిమజ్జన ప్రదేశాలను జిల్లా ఎస్‌పి యం. రాజేశ్ చంద్ర, స్వయంగా సందర్శించి పరిశీలించారు. గ్రామ చావిడి నుండి సంగమేశ్వర కాలనీ చౌరస్తా, కమాన్ చౌరస్తా మార్గంగా కల్కి చెరువులో జరిగే నిమజ్జన మార్గాన్ని పరిశీలించిన ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు ఎస్పీ కె. నరసింహారెడ్డి, పట్టణ ఎస్‌హెచ్‌ఓ అశోక్, స్పెషల్ బ్యాచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గణేశ్ ప్రతిష్ఠాపన నుండి నిమజ్జన వరకు విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు, స్థానిక ప్రముఖులతో సమన్వయ సమావేశం జరిగింది. అలాగే బాన్స్ వాడ లో విగ్రహాలను ప్రతిష్ఠించే నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మార్గదర్శకాలు అందజేశారు. గత సంవత్సరం జిల్లాలో 3600కు పైగా, బాన్సువాడలో 245 గణేశ్ విగ్రహాలు ప్రతిష్ఠించబడి శాంతియుతంగా నిమజ్జనం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు 2200 విగ్రహాలు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ పూర్తయ్యాయి. మిగతా నిర్వాహకులు తమ విగ్రహాల వివరాలను ఎత్తు, పరిమాణం, నిమజ్జన స్థలం మొదలైనవి తప్పనిసరిగా ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ,ఈ సంవత్సరం గణేశ్ ఉత్సవాలు మరింత ఘనంగా జరగాలని ఆకాంక్షిస్తున్నాము. అందులో భాగంగా ప్రతి ఒక్కరూ శాంతియుత వాతా వరణంలో పోలీసు సూచనలు పాటిస్తూ బాధ్యతతో వ్యవహరించాలి. అగ్నిప్రమాదాలు, విద్యుత్ సమస్యలు, ట్రాఫిక్ అంతరాయాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అన్ని అన్నారు . ప్రజల సహకారం, నిర్వాహకుల చొరవ, జిల్లా యంత్రాంగం పర్యవేక్షణతో ఈ గణేశ్ నిమజ్జన మహోత్సవం విజయవంతంగా, సురక్షితంగా జరుపుకోవాలని జిల్లా ఎస్‌పి సూచించారు. ఇట్టి కార్యక్రమంలో అదనపు ఎస్పీ కే. నరసింహారెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, బాన్సువాడ డీఎస్పీ విట్టల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఎస్‌హెచ్‌ఓ అశోక్, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపయ్య, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ చేసే ఆరోపణలన్నీ తొండి ఆరోపణలే

- సమాధానం చెప్పలేక పక్కదారి పట్టించడం బండికి వెన్నతో పెట్టిన విద్య
- కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోం
- సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 26 (జనంసాక్షి) :**
పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా పక్కదారి పట్టిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ చేస్తున్న ఆరోపణలన్నీ తొండి ఆరోపణలే అని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. 42 శాతం రిజర్వేషన్ లో మైనారిటీలకు పది శాతం అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఓట్ చోరీ జరుగుతుందంటే ఓటు వేసిన అందరినీ అవమానపరచినట్టని తప్పుడు ప్రచారం చేస్తున్నారని దేవుళ్లపై వ్యాఖ్యలు చేయకున్నా చేసినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈ విధంగా సమాధానం చెప్పలేక తప్పుడు ప్రచారం చేయడం పక్క దారి పట్టించడం బండి సంజయ్ కుమార్ కు వెన్నతో పెట్టిన విద్య అని నరేందర్ రెడ్డి ఆరోపించారు. ఒక బీసీ నాయకుడు 45 సంవత్సరాలుగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని నిబద్ధతతో కాంగ్రెస్ పార్టీలో పని చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడైన మహేష్ కుమార్ గౌడ్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీని బిచ్చగాళ్ల పార్టీ అని మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, దిష్టి బొమ్మలు, ఫ్లెక్సీలు కాలపెట్టడం మేము మొదలు పెడితే మీరు తట్టుకోలేరని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికైనా బండి సంజయ్ కుమార్ 42 శాతం రిజర్వేషన్, ఓట్ చోరి ఈ రెండు అంశాలపై ప్రజలకు మీ వైఖరి స్పష్టం చేయాలని నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఎండి తాజ్, జీడి రమేష్, పెద్దిగారి తిరుపతి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అస్థాపురం రమేష్, శభాన మహమ్మద్, ఊరడి లత, యనమల మంజుల, కిరణ్ రెడ్డి, మాసుం ఖాన్, తోట అంజయ్య, కొట్టే ప్రభాకర్, మామిడి సత్యనారాయణ రెడ్డి, ఇమ్రాన్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నేరరహిత సమాజానికి సీసీ కెమెరాలు చాలా ముఖ్యం

### సీసీ కెమెరాలు ప్రారంభించిన జిల్లా ఎస్పీ







**కామారెడ్డి జిల్లా గాంధారి ప్రతినిధి ఆగస్టు 26 జనంసాక్షి:** గాంధారి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 42 సీసీ కెమెరాలను మంగళవారం జిల్లా ఎస్పీ ప్రారంభించారు. నేరాలను నియంత్రించడంలో, నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల కీలక పాత్ర వహిస్తాయని,సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చని,నేరరహిత సమాజానికి సీసీ కెమెరాలు చాలా ముఖ్యం ప్రజలకు భద్రత, సెన్సాఫ్ ఆఫ్ సెక్యూరిటీ కలిగించడంలో సీసీ కెమెరాలు చాలా ముఖ్యంసీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వ్యాపారస్తులను, వివిధ సంఘాల నాయకులను, ప్రజా ప్రతినిధులను అభినందించారు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర అన్నారు.. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వ్యాపారస్తులను, వివిధ సంఘాల నాయకులను, ప్రజా ప్రతినిధులను, గ్రామ అభివృద్ధి సంఘం, క్లాత్ అసోసియేషన్, మెడికల్ అసోసియేషన్, కిరాణా వర్తక సంఘం, ఫర్టిలైజర్స్ అసోసియేషన్, ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్, అధ్యక్షులను కార్యవర్గ సభ్యులను అభినందించి సన్మానించారు. అలాగే ఇట్టి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయుటలో ముఖ్యపాత్ర వహించిన ఎస్సై ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ రవి, సంజయ్ లను ఎస్పీ గారు అభినందించినారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ గాంధారి మండల ఎంట్రీ, ఎగ్జిట్, ముఖ్యమైన చౌరస్తాలలో, గ్రామంలో 42 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేరాలను నియంత్రించడంలో నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల కీలక పాత్ర వహిస్తాయి, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చు, నేరరహిత సమాజానికి సీసీ కెమెరాలు చాలా ముఖ్యం, ఒక్క సీసీ కెమెరా 10 మంది పోలీసులతో సమానం, ప్రజలకు భద్రత, సెన్సాఫ్ ఆఫ్ సెక్యూరిటీ కలిగించడంలో సీసీ కెమెరాలు చాలా ముఖ్యం, నేరాలను నియంత్రించడంలో మరియు నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయి, సీసీ కెమెరాలు 24 గంటల నిరంతరం పనిచేస్తాయని తెలిపారు. జిల్లాలో నేరాల అదుపు చేయడానికి పోలీసులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు భాగస్వామ్యం చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. నేరస్తుడు నేరం చెయ్యలేను అని చెప్పినా సీసీ కెమెరాలు చూపించినచో తను చేసిన నేరాన్ని ఒప్పుకోవడం జరుగుతుందన్నారు. సీసీ కెమెరాలు ఉన్న ఇండ్లలో కాలనీలలో గ్రామాలలో నేరస్తులు నేరం చేయడానికి భయపడతారని తెలిపారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ అందుబాటులో ఉన్నందున ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అందుకు గ్రామస్తులు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సూచించారు. ప్రజలు కూడా ఇంటి ఆవరణలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో పట్టణాలలో ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు జియోట్యాగింగ్ ద్వారా కామారెడ్డి కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేసే తర్వాత హైదరాబాద్ కమాండ్ కంట్రోల్స్ సెంటర్ కు అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా షాపుల యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఒక కెమెరా రోడ్డు వైపు పెట్టుకోవాలని సూచించారు. ఏదైనా జరగరాని సంఘటన జరిగినా దొంగతనం జరిగిన నేరస్తులను పట్టుకోవడం సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ కే నర్సింహారెడ్డి ఎస్ శ్రీనివాసరావు, స్పెషల్ బ్యాంక్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, సదాశివ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, గాంధారి ఎస్సై ఆంజనేయులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్లతో వస్తారు.. మేకలను కాజేస్తారు..

- అంతర్ జిల్లా మేకల దొంగల ముఠా అరెస్ట్
- రూ.2.40 లక్షల నగదు, 22 గొర్రెలు, 8 కార్లు సీజ్
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్




**నల్లగొండ బ్యూరో, ఆగస్టు 26 (జనంసాక్షి) :** ఖరీదైన కార్లలో రాత్రి సమయాల్లో మేకల దొంగతనాలకు పాల్పడుతున్న 16 మందితో కూడిన నాలుగు అంతర్ జిల్లా దొంగల ముఠాలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. నిందితుల వద్ద నుండి రూ. 2.46 లక్షల నగదు, 22 గొర్రెలు, రూ. 17 లక్షల విలువ గల 8 కార్లను స్వాధీనం చేసుకున్నట్లు వెలడించారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత కొంత కాలంగా జిల్లాలో మేకలు, గొర్రెలు వరుసగా చోరీకి గురైతున్న నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం సమయంలో శాలిగౌరారం మండలంలోని బైరవోనిబండ క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న సమయంలో అటుగా వచ్చిన షిఫ్ట్ డిజైర్ కారును తనిఖీ చేసేందుకు దగ్గరకు వెళ్తుండగా అందులోని వారు తప్పించుకుని పారిపోయేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. వెంటనే వాహనాన్ని వెంబడించి పట్టుకోగా అందులో ముగ్గురు పురుషులు, ఓ మహిళ ఉన్నట్లుగా తెలిపారు. వారి వేలి ముద్రలను స్కాన్ చేయడంతో సంఘం, వెంకటేశ్, వెంరెడ్డి శ్రీనివాసరెడ్డి, సంపంగి శారద, దాసర్ల వినోద్ కుమార్ అలియాస్ కోటిగా గుర్తించినట్లు తెలిపారు. వీరిపైన గతంలో నల్లగొండ రూరల్, కనగల్, చండూర్, విజయపురి, నార్కట్‌పల్లి, నల్లగొండ 2 టౌన్, మర్రిగూడ, దేవరకొండ, శాలిగౌరారం, నాంపల్లి, మునుగోడు, చింతపల్లి పోలీస్ స్టేషన్లలో మేకల దొంగతనాల కేసులు నమోదై అరెస్టై జైలుకు వెళ్లి వచ్చినట్లు వెల్లడించారు. వీరితో పాటు పరిచయం ఉన్న మరో 12 మందితో కలిసి నాలుగు ముఠాలుగా ఏర్పడినట్లు తెలిపారు. పట్టుబడిన వారు ఒక గ్యాంగ్‌గా వరికుప్పల రవి ఏ చింటూ, గండికోట శివకుమార్, అమ్ములూరి విజయ్, వరికుప్పల రాజు, లింగాల ఆశోక్, ఉండం కళ్యాణి, కౌటేశ్ ( లక్ష్మీ, కనుకుల బేబీ, రెండో గ్యాంగ్‌గా వల్లెపు ప్రసాద్, మత్యాల సహదేవ్, మూడో గ్యాంగ్‌గా కోడిసే వంశీ కృష్ణ, కంపాటి హుస్సేన్, కంపాటి అజయ్ కుమార్, మట్టి సురేశ్ నాలుగు గ్యాంగ్‌లుగా ఏర్పడినట్లు తెలిపారు. వీరంతా ఎవరికీ అనుమానం రాకుండా ఖరీదైన కార్లలో వచ్చి పగటి పూట రెక్కి నిర్వహించి రాత్రి సమయాల్లో వచ్చి మేకలు, గొర్రెలను కార్లలో వేసుకుని దొంగతనాలకు పాల్పడేవారన్నారు.

### అమ్మిన డబ్బులతో జల్సాలు

విచారణలో వీరంతా జిల్లాలో 15 చోట్ల, రాచకొండ, సైబరాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల పరిధిలో 10 చోట్ల మేకల దొంగతనాలకు పాల్పడినట్టు తేలిందన్నారు. దొంగలించిన మేకలను సంతల్లో అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తుండేవారన్నారు. మొత్తం 23 నేరాలకు సంబంధించి 200కు పైగా మేకలు, గొర్రెలు అమ్మినట్లు తెలిపారు. కేసును నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి పర్యవేక్షంలో చేధించారు. డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, నల్లగొండ సీసీఎస్ సీఐలు ఎం. జితేందర్ రెడ్డి. ఎం.నాగభూషణ్, శాలిగౌరారం సీఐ కె.కొండల్ రెడ్డి, నార్కట్ పల్లి సీఐ కె. నాగరాజు, ఎస్ఐలు శివకుమార్, విజయ్ కుమార్, రవి, రవి కుమార్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన గిరి, వహీద్ పాషా, సూఫీయాన్ అలీ, రామ్ ప్రసాద్, నాగరాజు, సీసీఎస్ కానిస్టేబుల్ అశ్రార్, మహేశ్, సాయి, వెంకట్ రామ్‌ను ఎస్పీ అభినందించారు. వారికి ప్రత్యేకంగా ప్రశంసా పత్రాలు, రివార్డులు అందజేశారు.

## వీధి కుక్కల బెడద తప్పేది ఎన్నడు..?

- వీధుల్లోకి వెళ్లాలంటే జంకుతున్న జనం
- ద్విచక్ర వాహన దారుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు



**మర్పల్లి, ఆగస్టు 26 (జనంసాక్షి) :** మర్పల్లి మండలంలోని గ్రామాలలో కుక్కల బెడద ఎక్కువవుతుంది. కుక్కలు గుంపులు గుంపులుగా స్వైరా విహారం చేస్తున్నాయి. చిన్న పెద్ద అని తేడా లేకుండా దాడి చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో పలు గ్రామాలలో రోడ్డు పైకి వెళ్లాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కుక్కలు దాడులు చేయడంతో పలువురు గాయాల పాలై ఆసుపత్రిలో పరుగులు తీస్తున్నారు. వాహనదారుల వెంట వెళ్లే ప్రజలు మూగజీవులు పశువులు పైకి కుక్కలు పరుగులు తీసి దాడులు చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి వెంట కుక్కలు వెంట పడుతుండంతో వారు గాయాల బారిన పడుతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాలలో తెల్లవారుజామున వాకింగ్ కి వెళ్లేవారు కుక్కల బారిన పడి గాయాల పాలవుతున్నారు. కుక్కల దానిలో పరువురికి చెందిన ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ళు మృత్యువాత పడ్డ సంఘటనలు సైతం ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నివారించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## బాలికకు జగ్గారెడ్డి చేయూత

- 3 లక్షల ఆర్థిక సహాయం చేసిన జగ్గారెడ్డి



**హైదరాబాద్, ఆగస్ట్ 26 (జనంసాక్షి) :** హైదరాబాద్ లో కార్పొరేట్ ఆసుపత్రిలో బాలిక చికిత్సకు సహాయం చేస్తానని హామీ ఇచ్చిన జగ్గారెడ్డి మాట నిలబెట్టుకున్నారు. తమ దీనస్థితిని గాంధీ భవన్ మీడియాకు చెప్పడంతో విషయాన్ని జగ్గారెడ్డికి చేరవేశారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ గ్రామానికి చెందిన సుష్మ 9 సంవత్సరాల వయస్సులో అనారోగ్యానికి గురైంది. దసరా పండగ సందర్భంగా అమ్మమ్మ ఇంటికి వెల్లిన సుష్మ.. అనుకోకుండా జరిగిన పొరపాటుతో చపాతీ పిండిలో చీమల మందు కలిసిన చపాతీ తిని తీవ్ర అనారోగ్యం పాలైంది. 9 సంవత్సరాలుగా మంచానికే పరిమితమైంది సుష్మ. ఆర్థిక స్థోమత లేకపోవడంతో తండి చెవుగాని మహేష్ కార్పోరేట్ ఆస్పత్రిలో చికిత్స అందించలేకపోయారు. విషయం తెలుసుకున్న జగ్గారెడ్డి.. తండ్రి మహేష్ ను పిలిపించి నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. డాక్టర్ చంద్రశేఖర్ తో మాట్లాడి అన్నిరకాల వైద్య పరీక్షలు చేసి, ఎలాంటి వైద్యం చేస్తే పాప మళ్ళీ లేచి నడవగలదో చెప్పాలని సూచించారు. సర్జరీ లాంటి చికిత్స అవసరం అయితే తాను మరికొంత ఆర్థిక సహాయం చేయడమే కాకుండా సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి పూర్తి వైద్య ఖర్చులు ప్రభుత్వం భరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. జగ్గారెడ్డి 3 లక్షల ఆర్థిక సహాయం చేస్తూ.. సుష్మ ఆరోగ్యానికి తమవంతుగా ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఆర్థిక సహాయం చేయాలనుకునేవారు తండ్రి మహేష్ నెంబర్ ను 9553461480 కాంట్రాక్టు చేయాలని కోరారు.

# ఎంజీఎంలో 'రోగి సహాయ సేవలు' ప్రారంభం

- గ్రామీణ ప్రాంతాల రోగులకు ఉపయోగకరం
- టైర్ 2 నగరాలలో ఇదే ప్రథమం



**హైదరాబాద్, ఆగస్టు 26 (జనంసాక్షి) :** మహాత్మాగాంధీ మెమోరియల్ హాస్పిటల్ (ఎంజీఎంహెచ్)లో హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'రోగి సహాయ సేవలు'ను వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. ఇందులో భాగంగా శిక్షణ పొందిన ఏడుగురు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఈ హాస్పిటల్‌లో నియమించారు. ముగ్గురు మహిళా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఓపీ రిజిస్ట్రేషన్‌లో రోగులకు సహాయం చేయనున్నారు. ముఖ్యంగా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ నమోదు, ఫార్మసీ సహాయం, మార్గనిర్దేశనం, ప్రభుత్వ పథకాలకు అవసరమైన పేపర్ డాక్యుమెంటేషన్ తదితర సేవలు అందిస్తారు. నలుగురు పురుష కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు క్యాజువాల్టీ, ఎమర్జెన్సీ బ్లాక్‌లో ఉంటారు. క్యాజువాల్టీ నుంచి ఇతర విభాగాలకు రోగులను తరలించేందుకు సహాయం చేయనున్నారు. శస్త్రచికిత్స, ఈసీజీ, ఎంఆటీ, ఎక్స్-రే, యూఎస్జీ స్కాన్లు, సీటీ స్కాన్ వంటి వివిధ విభాగాలకు రిఫరల్స్, ట్రాన్స్‌ఫర్లకు సహాయం అందిస్తారు. డిశ్చార్జ్ అయిన రోగులు హాస్పిటల్ పరిధి నుంచి బయటికి వెళ్లే వరకు అవసరమైన సహాయం అందిస్తారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్ ద్వారా రోగులకు సులభమైన సేవలు అందించనున్నారు. గిరిజన రోగులు వరంగల్ ఎంజీఎం నుంచి హైదరాబాద్‌లోని ప్రభుత్వ హాస్పిటల్స్‌కు వెళ్లడంలో హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ హెల్ప్‌డెస్క్ ద్వారా సహాయం చేయనున్నారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధి ముజ్తబా హసన్ ఆస్కారి మాట్లాడుతూ ఈ రోగి సహాయ సేవలతో రోగులకు త్వరితగతిన వైద్య సేవలు అందుతాయన్నారు. హెల్ప్‌డెస్క్ ద్వారా మార్గదర్శనం లభించడం వల్ల సులభంగా చేరుకోవడం, ఒత్తిడి తగ్గడం, సమయం ఆదా కావడం, పునరావృత ప్రశ్నలు తగ్గడం వంటి ప్రయోజనాలు ఉంటాయన్నారు. తద్వారా దీర్ఘకాలంలో ప్రభుత్వ వైద్య సేవలపై రోగులకు విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కే కిషోర్ కుమార్, డిప్యూటీ సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ వసంతరావు, డాక్టర్లు శశికుమార్, మమతాదేవి, అశ్వినీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరతపై బీజేపీ తప్పుడు ప్రచారం తగదు

### సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**హైదరాబాద్, ఆగస్టు 26 (జనంసాక్షి) :** వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు మాసాలు గడుస్తున్నప్పటికీ, రైతులకు కావాల్సిన యూరియాను అందించడంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తున్నది. రైతులు యూరియా కొరకు నెల రోజులుగా రోడ్లపైకి వస్తున్నప్పటికీ బీజేపీ నాయకులు కుంటి సాకులు చెబుతూ "కృత్రిమ కొరత" సృష్టించారనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ తప్పుడు ప్రచారాన్ని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. ఇప్పటికైనా కేంద్రం నుండి రాష్ట్రానికి కావాల్సినంత యూరియాను తెప్పించడానికి బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అండగా నిలబడాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. రాష్ట్రానికి 9.8 లక్షల టన్నులు యూరియా కావాల్సి ఉంగా, 1.5 లక్షల టన్నులు కేంద్రం తగ్గించింది. ఈ కోటాను కూడా ఇంత వరకు సకాలంలో సరఫరా చేయకపోవడంతో తీవ్ర యూరియా కొరత ఏర్పడిరది. రైతులంతా సహకార సంఘాలు, షాపుల ముందు పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ముందు, రహదారుల మీద నిరసనలు తెలియజేస్తున్నారు. చాలా చోట్ల తొక్కిసలాటలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుండైనా రాష్ట్ర అవసరాలకు యూరియాను సరఫరా చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు కోరినా, ఉద్దేశ్యపూర్వకంగానే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. దీంతో 45 కేజీల యూరియా బస్తా రు. 242లు కాగా, ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లో రు. 350కి అమ్ముతున్నారు. ఇప్పటికైనా కేంద్ర బీజేపీ ప్రభుత్వం యూరియా కొరతను తీర్చడానికి, బ్లాక్ మార్కెట్‌ను నిరోధించడానికి ప్రభుత్వ సంస్థల్కెన హాకా, సహకార సంఘాల ద్వారా సరిపడా ఎరువులను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది. రాష్ట్రానికి అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వం నుండి తెప్పించడానికి అన్ని రకాల చర్యలు తీసుకొని, రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

## భారత్‌లో కల్మికియా ప్రతినిధి బృందం

- కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ తో భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 26 (జనంసాక్షి) :** భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలపర్చేందుకు కల్మికియా రిపబ్లిక్ అధినేత బాటు ఖసికోవ్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం భారత్ పర్యటనకు వచ్చింది. ఈ పర్యటన ఉభయ దేశాల మధ్య ఉన్న విలువలు, సాంస్కృతిక సంబంధాలు, ప్రపంచ శాంతి, భద్రత కోసం ఉమ్మడి దృక్పథాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ సందర్భంగా న్యూఢిల్లీలో కేంద్ర పర్యాటక, సాంస్కృతి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ తో భేటీ అయ్యారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక అంశాలపై చర్చించారు. 2026 ఏప్రిల్‌లో జరగబోయే ట్యూలిప్ ఫెస్టివల్ సందర్భంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పర్యాటక ఆకర్షణలను ప్రదర్శించే 'ఇండియా డేస్' కల్మికియాలో నిర్వహించేందుకు ఇద్దరూ అంగీకరించారు. 2025 సెప్టెంబర్‌లో ఎలిస్తాలో జరగబోయే మూడవ అంతర్జాతీయ బౌద్ధ ఫోరమ్‌లో పాల్గొనాలని గజేంద్ర సింగ్ శేఖావత్ ను ఆహ్వానించారు.

## మహీంద్రా యూనివర్సిటీలో మాదకద్రవ్యాల తనిఖీలు



**నిజాంపేట్, ఆగస్టు 26 (జనం సాక్షి) :** హైదరాబాద్ నగరంలో మాదకద్రవ్యాల మూలాలు ఇప్పటికే పలు కళాశాలలో , యూనివర్సిటీలలో విక్రయాలు వినియోగాలు జరుగుతున్ యన్న సమాచారం అందరికీ విధితమే. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల పట్ల కఠినంగా వ్యవహరిస్తు వీటి నియంత్రణకు ఈగల్ టీం ఏర్పాటుచేసి ఓవైపు కఠినంగా వ్యవహరిస్తుంటే మాదకద్రవ్యాల వినియోగం చాప కింద నీరులా వ్యాపిస్తూ కలకలం రేకెత్తిస్తుంది. తాజాగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహుదూర్‌పల్లిలో గల మహీంద్రా యూనివర్సిటీలో మాదకద్రవ్యాల విక్రయాల, వినియోగాలపై సమాచారంతో నార్కోటిక్ ప్రత్యేక విభాగం మంగళవారం తనిఖీలు నిర్వహించడంతో మహేంద్ర విశ్వవిద్యాలయంలో ఏకంగా 1.5 కేజీల గంజాయి తో పాటు 45 గ్రాముల ఓడి వీడ్, 20 కి పైగా డ్రగ్స్ ప్యాకెట్లు అందుకు సంబంధించిన మిషన్స్ , ఫోన్స్ స్వాధీన పరుచుకోగా కొంతమంది మాదకద్రవ్యాలు సేవించినట్లు నిర్ధారణ గా అధికారులు తేల్చారు. గతంలో మాదిరిగా నైజీరియన్ వ్యక్తి ద్వారా ఢిల్లీ నుంచి ఓ వ్యక్తి తో కొరియర్ ద్వారా హైదరాబాద్ నగరంలో కి తీసుకువచ్చి యూనివర్సిటీ లో విక్రయాలు జరిపిస్తున్నట్లు, అందులో భాగంగానే మహేంద్ర యూనివర్సిటీలో విద్యార్థులకు విక్రయాలు జరపడంతో చాలామంది విద్యార్థులు గంజాయి సేవించినట్లు నార్కోటిక్ విభాగం దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం నలుగురు సభ్యులు ముఠాను అరెస్టు చేయగా అందులో ముగ్గురు మహేంద్ర యూనివర్సిటీ విద్యార్థులు ఉన్నారని. భవిష్యత్తులో పునరావృతం కాకుండా వారికి కౌన్సిలింగ్ జరిపినట్లు తెలిసింది. మహేంద్ర యూనివర్సిటీలో విద్యార్థుల పట్ల యాజమాన్యం తగిన జాగ్రత్తలు చర్యలు చేపట్ట లేకపోవడం వల్లనే ,అలాగే విశ్వవిద్యాలయ మాదకద్రవ్యాల వ్యతిరేక కమిటీ పోలీసులకు సమాచారం ఇవ్వడంలో విద్యార్థులు గంజాయి సేవించినట్లు తెలుస్తుందని అధికారులు తెలియజేస్తున్నారు. ఈగల్ టీం అన్ని కళాశాలలో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## టిఎల్‌ఎంతో విద్యార్థులు విద్యను సులువుగా నేర్చుకోవచ్చు



**మహమ్మదాబాద్, ఆగస్టు 26 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో మంగళవారం బాలుర ఉన్నత పాఠశాలలో టిఎల్ఎం మేళ ఏర్పాటు చేశారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తో విద్యార్థులు విద్యను సులువుగా నేర్చుకోవచ్చని మండల విద్య అధికారి రాజు నాయక్ తెలిపారు. ఉపాధ్యాయులు ఇలాంటి మెటీరియల్ తో విద్యార్థులకు బోధన చేస్తే ఎంతో సులువుగానేర్చుకునే అవకాశం ఉందన్నారు. వివిధ పాఠశాలలో గణితం ఆంగ్లము తెలుగు నేర్చుకునే సులువైన పద్ధతులను ఎంతో చాకచక్యంగ తయారుచేసుకోవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు తయారు చేసుకోవచ్చిన మెటీరియల్ ను వివిధ మండలాలకు చెందిన డిఆర్ పిలు జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, ప్రకాష్ పరిశీలించి న్యాయ రెత్రాలుగా వ్యవహరించారు అందులో మొదటిస్థానంలో మహమ్మదాబాద్ నెంబర్ 1 మహ్మదాబాద్ నెంబర్ 2, సంగాయపల్లి పాఠశాలలో నిలువుగా ద్వితీయస్థానంలో దేశయిపల్లి నంచర్ల లింగాయపల్లి పాఠశాలలు నిలిచాయి. ఈకార్యక్రమంలో వెంకటేశ్వర్లు, భీమ్ రెడ్డి, విజయ్ గౌడ్, పుట్టి శ్రీనివాసులు, మహేశ్వర్, సాయిలు, మహేష్, జయప్రకాశ్ నారాయణ, అన్నపూర్ణ, వనజ, రాములు, ఖాదర్, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 26 (జనంసాక్షి) :** యూరియా లభ్యతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందకూడదనే భరోసా ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలో యూరియా లభ్యత, సరిహద్దుల్లో చెక్ పోస్ట్ ల ఏర్పాటు తదితర అంశాలపై వ్యవసాయ అధికారులతో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రైతులకు యూరియా లభ్యతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉంచే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. గత సంవత్సరం జిల్లాలో 19764 మెట్రిక్ టన్నుల యూరియాను అందించడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా ఇప్పటివరకు 19534 మెట్రిక్ టన్నుల యురియా సరఫరా చేయడం జరిగిందన్నారు. వారం రోజుల్లోగా జిల్లాకు అదనంగా 1080 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందని ఆయన తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు యూరియా విక్రయ కేంద్రాల వద్ద ఉంటూ క్షుణ్ణంగా పరిశీలిస్తూ రైతులకు యూరియా అందే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా నుండి యూరియా అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఉండేందుకు సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను నిర్వహించి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి యూరియా ఇతర ప్రాంతాలకు తరల కుండ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. నానో యూరియాను నేరుగా మొక్కలు, ఆకులపై పిచికారి చేయవచ్చు అనే విషయాన్ని రైతులకు తెలియజేస్తూ వారిని ప్రోత్సహించాలని ఆయన అధికారులకు సూచించారు. ఇప్పటికీ జిల్లాలో 1000 లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. నానో యూరియాను ఉపయోగించడం ద్వారా రైతులు సాంప్రదాయ యూరియా ఏరువులపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం, ఏడిఏ సందీప్ కుమార్, ఎడిఒ ప్రసన్న లక్ష్మి, శంకర్ నాయక్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ ఆర్చరీలో తెలంగాణ ముద్దుబిడ్డ

- చికిత స్వర్ణ చరిత్ర దేశానికే గర్వకారణం
- ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్



**హైదరాబాద్, ఆగస్టు 26 (జనంసాక్షి) :** కెనడాలోని విన్నిపెంగ్‌లో జరిగిన వరల్డ్ ఆర్చరీ యూత్ చాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఇండియా యంగ్ ఆర్చర్, తెలంగాణ ముద్దు బిడ్డ, తానిపర్తి చికితకు ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ అభినందనలు తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్ పూర్ గ్రామానికి చెందిన చికిత తానిపర్తి సాధించిన విజయం యువతి, యువకులకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. చిన్నప్పటి నుంచే కష్టాలను, కన్నీళ్లను అధిగమించి, ఆత్మవిశ్వాసం, అంకితభావంతో ప్రపంచ ఆర్చరీ చరిత్రలో తనకంటూ ఓ గుర్తింపును సంపాదించడం తెలంగాణ ప్రజలకు గర్వకారణనన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. చికిత తాని పర్తికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. చికిత్సలోని ఆర్చరీ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన తల్లి తండ్రులను ఎమ్మెల్సీ వెంకట్ అభినందనలు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
27 ఆగస్టు 2025

# ఓట్ చోరీ జరిగితే బిజెపి 16 సీట్లు గెలిచేది

- మాది నిజంగానే దేవుళ్ల పార్టీ
- ఇచ్చిన హామీలు నిలుపుకోలేక కాంగ్రెస్ నానా తంటాలు
- ఓట్ చోరీ అంటూ ప్రజలను అవమానిస్తున్న కాంగ్రెస్
- పిసిసి చీఫ్ వ్యాఖ్యలకు బండి సంజయ్ కౌంటర్



కరీంనగర్ బ్యూరో, ఆగస్ట్26 (జనంసాక్షి): కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే.. రాజకీయ సన్యాసం తీసుకుంటానని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ వాగ్దానాలు అమలుకాలేదని, మోసపూరిత హామీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఆ పార్టీకి మళ్లీ అధికారం కలేనని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు ఏమయ్యాయో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చెప్పాలని బండి సవాల్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించిన సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 30 ఏళ్లుగా తాను ప్రజాప్రతినిధిగా ఉన్నానని చెప్పారు. వార్డు మెంబర్ కానివాళ్లు కూడా విమర్శించడం సరికాదన్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. దొంగ ఓట్లు- అంటూ కాంగ్రెస్ నేతలు చేసే దుష్ప్రచారం ప్రజలను అవమానించడమేనని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు ఒక్క పైసా అయినా ఇచ్చిందా? కేంద్రం నిధులు ఇస్తుందనే ఇప్పుడు స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు రాత్రిపూట యాత్రలు చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. కరీంనగర్‌లో ప్రతి ఓటూ పరిశీలించి దొంగ ఓట్ల తీసేయాలి. రెండు చోట్ల ఓటు- వేయడం ఎవరికైనా సాధ్యమా? అవగాహన లేకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు ఓట్ల చోరీ గురించి కాకుండా సీట్ల చోరీ గురించి మాట్లాడాలి. రొహింగ్యాల విషయంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు. దేశం ముఖ్యమా? ఓటు- బ్యాంకు ముఖ్యమా? అప్పుడు భారత రాష్ట్ర సమితి.. ఇప్పుడు కాంగ్రెస్.. రెండూ అదే తరహా రాజకీయాలు చేస్తున్నాయని బండి సంజయ్ విమర్శించారు. ప్రజలను కలవకుండా రాత్రి పూట యాత్రలు ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. టీ-పీసీసీ చీఫ్ ఒక గజినీ.. ఆయనను ఎవరైనా గుర్తు పడతారా అని ప్రశ్నించారు. మహేష్ గౌడ్ వార్డు మెంబర్‌గా కూడా గెలిచావా అని బండి సంజయ్ నిలదీశారు. తెలంగాణలో ఓటు- చోరీ జరిగితే.. కాంగ్రెస్ ఎనిమిది ఎంపీ సీట్లు కూడా తామే గెలిచే వాళ్లమని చెప్పుకొచ్చారు. ప్రజల ఓట్లతో మహేష్ గౌడ్ ఒక్కసారైనా గెలవాలని ఛాలెంజ్ చేశారు. కర్ణాటక, తెలంగాణలో మీరెలా గెలిచారని ప్రశ్నించారు. టీపీసీసీ చీఫ్ బీఆర్‌ఎస్ మనిషి అని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఆయనకు సెక్యూరిటీ- కావాలని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఓటు- చోరీ జరిగిందని ప్రజలను మహేష్ గౌడ్ అవమానిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలే ఓట్ల బిచ్చగాళ్లు అని విమర్శించారు. టోపీలు పెట్టుకుని ఓట్ల కోసం వెళ్లేది కాంగ్రెస్ నేతలే అని ఆక్షేపించారు. రోహింగ్యాలు వచ్చింది కాంగ్రెస్ హయాంలోనేనని బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్రం నిధుల కోసమే ఇప్పుడు స్థానిక ఎన్నికలు జరుగుతాయని బండిసంజయ్ తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పంచాయితీలకు ఒక్క పైసా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. 6 గ్యారెంటీలపై ప్రజలు కొట్టేట్లు ఉన్నారని, కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరారు. కరీంనగర్ లో ఒక్కో మైనార్టీ ఇంట్లో 200 ఓట్లున్నాయని పేర్కొన్నారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ లో అధికారం ఎలా వచ్చిందని బండి ప్రశ్నించారు. ఎన్నికలున్నా.. లేకున్నా హిందూ ధర్మం కోసం నిలబెడతాం అని స్పష్టం చేశారు. భైంసాలో హిందువుల ఇళ్లు తగలబెట్టినప్పుడు వాళ్లెక్కడికి వెళ్లారని నిలదీశారు. తమది దేవుళ్ల పార్టీ అని మీది బిచ్చపు బతుకు అని ఎద్దేవా చేశారు. సనాతన ధర్మం కోసం బిజెపి నిలబడుతుందని, యుపిఎ హయాంలోనే రోహింగ్యాలు దేశంలోకి వచ్చారని తెలిపారు. కరీంనగర్ లో హిందూ ఓటు- ద్వారానే గెలిచానని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# కాశ్మీర్‌లో మరోమారు భారీ వర్షాలు

- క్లౌడ్ బరస్ట్‌తో నలుగురు మృతి



శ్రీనగర్, ఆగస్ట్26 (జనంసాక్షి) : జమ్మూకశ్మీర్ ను భారీ వర్షాలు కుదిపేస్తున్నాయి. స్థానికంగా ఆకస్మిక వరదలు విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలోనే డోడా జిల్లాలో క్లౌడ్‌బరస్ట్ కారణంగా నలుగురు మృతి చెందారు. కఠువా, కిశ్త్‌వాడ్‌లోనూ ఇటువంటి విపత్తులు సంభవించాయి. జమ్మూ రీజియన్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. కఠువా, సాంబా, డోడా, జమ్మూ, రాంబన్, కిశ్త్‌వాడ్ జిల్లాల పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్కర వాతావరణ పరిస్థితుల కారణంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. భారీ వర్షాలకుతోడు రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్, కేలా మోర్, బ్యాటరీ చెష్మా వద్ద కొండచరియలు విరిగిపడటంతో.. ముందు జాగ్రత్త చర్యగా జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను నిలిపేశారు. వరదల ధాటికి కిశ్త్‌వాడ్, డొడా, రాజౌరీ జిల్లాల్లో పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చీనాబ్, తావి, రావి తదితర నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. ఈ నెల 27వరకు క్లౌడ్ బరస్ట్‌లు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో సహాయక బృందాలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. జమ్మూకశ్మీర్ అంతటా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంగలు పొంగుతున్నాయి. తావి, రావి వంటి ప్రధాన నదులు ప్రమాదస్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. దోడా జిల్లాలో మంగళవారం నాడు మెరుపు వరదల కారణంగా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. పదికి పైగా ఇళ్లు దెబ్బతిన్నాయి. జమ్మూలోని కథువా, సాంబ, దోడా, జమ్మూ, రాంబాన్, కిష్త్వార్ జిల్లాలతో సహా పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. వాతావరణ ప్రతికూలత దృష్ట్యా జమ్మూ డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూసివేశారు. కొండచరియలు విరిగిపడుతుండటంతో ముందుజాగ్రత్త చర్యగా జమ్మూశ్రీనగర్ జాతీయ రహదారి వెంబడి రాకపోకలను నిలిపివేశారు. దోదాలోని కీలకమైన రోడ్డు కొట్టుకుపోయింది. తావి నది పొంగి పొర్లుతోంది. పలు నదులు ఇప్పటికే ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నట్టు- అధికారులు తెలిపారు. జమ్మూ ప్రాంతంలో ఫ్లడ్ అలర్ట్ ప్రకటించారు. ప్రజలు నదీ ప్రవాహాలు, కొండచరియలు విరిగిపడే ప్రదేశాలకు దూరంగా ఉండాలని సూచించారు.కాగా, కథువా జిల్లాలో గత 24 గంటల్లో అత్యధికంగా 155.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దోడాలోని బదెర్వాహ్ 99.9 మి.మీ., జమ్మూలో 81.5 మి.మీ., కాత్రాలో 68.9 మి.మీ. వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. ఎత్తైన ప్రాంతాల్లో క్రౌడ్‌బరస్ట్‌లు, మెరుపు వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కశ్మీర్‌లోని సదరన్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతుండగా, జీలం నదిలో ప్రవాహం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతానికి ఫ్లడ్ అలర్ట్ ప్రకటించలేదు. సెంట్రల్ కశ్మీర్‌లో చెదురుమదురు వర్షాలు పడుతుండగా, నార్త్ కశ్మీర్‌లో ఓ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్‌లో పలు నదుల్లో నీటిమట్టం పెరుగుతుండటంతో ప్రభుత్వ యంత్రాంగం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. హెల్ప్‌లైన్ మెంబర్లను జారీ చేసింది.

# రేవంత్ రెడ్డి ఎవరు?

- బీహారీలు ఆయనను కర్రలతో తరిమికొడుతరు
- జన్ సూరజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్



పాట్నా (జనంసాక్షి) : జన్ సూరజ్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అసలు రేవంత్ రెడ్డి ఎవరని, బీహార్ లో ఆయనకు ఏం పని అని ప్రశ్నించారు. ఆయన బీహార్‌లో ఎక్కడికి వెళ్లినా అక్కడి ప్రజలు కర్రలతో తరిమి కొడుతారని అన్నారు. బీహార్ రాజకీయాల్లో రేవంత్ జోక్యాన్ని ప్రశాంత్ కిషోర్ తప్పుబట్టారు. 'అసలు రేవంత్ రెడ్డి ఎవరు..? బీహార్‌లో ఆయనకు ఏం పని..? బీహార్‌తో రేవంత్ రెడ్డికి ఉన్న సంబంధం ఏమిటి..? రేవంత్ రెడ్డి స్థాయి ఏమిటి..? అని ప్రశాంత్ కిశోర్ ప్రశ్నల వర్షం కురిపించారు. రేవంత్ రెడ్డి ఒకవైపు బీహార్ ప్రజలను అవమానించేలా మాట్లాడుతూ.. మరోవైపు అదే బీహార్‌కు ఓట్లు అడగడానికి ఎలా వస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ రెడ్డి వైఖరిపై పీకే తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. బీహార్‌ను అవమానించే నాయకులు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారని, ఇది రాహుల్‌గాంధీ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుందని అంటూ రాహుల్‌గాంధీపై కూడా విమర్శలు చేశారు. ఓట్ల చోరీ అంటూ రాహుల్‌గాంధీ ప్రధాని మోదీని విమర్శిస్తున్నారని, తప్పుడు ఆరోపణలంటూ మోదీ.. రాహుల్‌గాంధీని విమర్శిస్తున్నారని, అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ నాటకాలని ఆరోపించారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతుల పూజ

- సమాచారశాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక




హైదరాబాద్, ఆగస్ట్26(జనంసాక్షి) : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్.ప్రియాంక సూచించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం ప్రాంగణంలోని మీడియా సెంటర్‌లో సుమారు 150 మట్టి వినాయక విగ్రహాలను జర్నలిస్టు సోదరులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి నష్టం జరగకుండా మట్టి వినాయకులనే పూజించాలని, పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరుకుంటూ ప్రజలకు వినాయక చవిత హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు సంచాలకులు డిఎస్ జగన్, జాయింట్ డైరెక్టర్ కె. వెంకటరమణ, సమాచారశాఖ సిబ్బంది పాల్గొన్నారు.




# ఖమ్మంలో వాడిన కమలం

- గతం కంటే మరింతగా కనుమరుగు
- వారిలో విద్వేశాలు రగిలిచడం తప్పా... ఐక్యతకు లేదు చోటు
- ప్రపంచ శాంతి ర్యాలీ నిర్వహిస్తే.. అశాంతిలో బిజెపి బ్యాచ్



ఖమ్మం(జనం సాక్షి) : ఖమ్మంలో కమలనాధులు కానరావడం లేదు. ఉన్నదే అరకొర అంటే ఆ కొద్ది మందిలో అనేక గ్రూపులున్నాయి. ఖమ్మం జిల్లాలో జిబెపి పార్టీ గతం కంటే మరింతగా బలహీన పడింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బిజెపి అభ్యర్థులు ఎక్కడి నుంచి పోటి చేసిన వెయ్యి, పదిహేను వందల ఓట్ల కంటే ఎక్కువగా వచ్చే పరిస్థితి లేదు. ఖమ్మం అంటే కామ్రేడ్ల కంచుకోట, కాంగ్రెస్ కు పెద్ద పీట. ఈ జిల్లాలో కమలం వికసించడం అసాధ్యం. ప్రస్తుతం కమలం పార్టీలో ఉన్న పది మందిలో అనేక గ్రూపులున్నాయి. ఉన్న ఆ నలుగురు అనేక రకాలుగా వివాదాలు సృష్టించాలని భావిస్తున్నారు. శాంతిగా ఉన్న ఖమ్మంలో అలజడి సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కల్పించాలనే తలంపుతో వారి వ్యవహార శైలి ఉంది. నిత్యం బిజెపి సోషల్ మీడియా వేదికగా కామ్రేడ్స్, కాంగ్రెస్ , బిఆర్ఎస్, ముస్లిం, క్రిస్టియన్స్, ఎథీట్స్, ప్రజా సంఘాలు, పౌర సంఘాల పై విషం చిమ్మడం. అభ్యంతకర పోస్టింగులు పెట్టడం. ఇతరుల వ్యక్తిత్వ హననం చేయడం వంటివి కొనసాగిస్తున్నారు. ప్రజలకు అవసరం అయినా అంశాలను లేవనెత్తడంలో పూర్తిగా విఫలం చెందారు. ప్రజా సమస్యలపై ఏ మాత్రం అవగాహన లేదు. ప్రతి సంధర్భంలో మత ప్రస్తావన తప్పితే పౌర సమాజానికి మేలు చేసే అంశాలపై ఫోకస్ లోపించింది. చిన్నప్పటి నుంచి హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరు ఏకాదశి నుంచి మొదలు శ్రీరామ నవమి వరకు వినాయక చవితి, శివ రాత్రి అన్ని పండుగలను విశిష్టమైన సంధర్భాలను జరుపుకుంటూనే ఉన్నారు. అందరు కలిసి మెలసి ఉంటున్నారు. ఇప్పుడు బిజెపి వచ్చిన తర్వాతనే కొత్తగా పండుగలు జరుపుకునే విధానం నేర్పుతున్నట్లు హిందువు సమాజాన్ని అవమానించే విధంగా వారి వ్యవహారశైలి ఉంటుంది. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి జిల్లా అభివృద్ధిలో తమ పాత్ర గురించి చెప్పుకునే సంధర్భాలను వీడి ప్రతి రోజు వ్యక్తిగత అంశాలైన మతం అనే ప్రచారాన్ని మాత్రమే కొనసాగిస్తున్నారు. మానవ విలువలు మరిచి మనిషి అనే వారిని అనకూడని మాటలు అంటూ కొత్త సాంప్రదాయానికి తెరలేపారు. సంధర్భం ఏదైనా తమ పార్టీ కాని వారిపై విషం చిమ్మడమే లక్ష్యంగా పెట్టుకుం టున్నారు. బూతు పదజాలం లేనిది వారి సోషల్ మీడియాలో పోస్టిం గ్ ఉండటం లేదు. ఇప్ప టికే పెడదోవ పడుతున్న యువత ఇలాంటి వారి ఉచ్చులో పడితే మరింతగా పక్కదారి పట్టే అవకాశం ఉంది.

### చదువుకున్న వారు దూరంగా....

భారతీయ జనతా పార్టీ వ్యవహరిస్తున్న తీరు చూసి చదువుకున్న వారు ఆ పార్టీ దరి చేరడం లేదు. అనేక మంది తల్లి తండ్రులు బిజెపి వెంట పంపడం లేదు. స్కూల్ , కాలేజీల్లో వర్గ, వర్ణాలతో సంబంధం లేకుండా విధ్యార్థులు చదువు కొనసాగిస్తారు. వారితో చదువుకునే విధ్యార్థికి వ్యతిరేకంగా ప్రచారం చేయాలి, విద్వేషంతో మాట్లాడాలి అంటే ఇన్నాళ్లు కలిసి చదువుకొని కష్టసుఖాలు పంచుకొని జీవితంలో స్నేహితుడు ఓ బాగమైన తర్వాత అతడి గురించి చెడుగా, తప్పుగా, వ్యతిరేకంగా మాట్లాడే పరిస్థితి ఉండబోదు కాబట్టి విధ్యార్థి లోకం బిజెపి వైపు ఆకర్షితులు కాకపోవడానికి ప్రధాన కారణం స్థానిక నాయకులు తమకు వ్యతిరేకంగా మెలిగే వారిపట్ల వైషమ్యాలు కలిగి ఉండటమే అని చెప్పొచ్చు. అనేక సంధర్భాల్లో ఖమ్మం బిజెపి ర్యాలీల్లో జనం లేక వెలవెలబోతుంది. రాష్ట్ర అధ్యక్షుడు రాంచదర్ రావు మొదటి సారి ఖమ్మం జిల్లా పర్యటనకు వస్తే పట్టుమని యాభై మంది లేకుండా ర్యాలీ కొనసాగింది. అభివాదం చేసుకుంటూ వచ్చిన రథం పై ఉన్న జనం తప్పా మిగతా చోట్ల జనమే లేకుండా పోయారు. రాష్ట్ర అధ్యక్షుడికి ఘన స్వాగతం పలకలేకపోయారు. దాంతో గతం కంటే పార్టీ మరింతగా పలుచబడిందని చెప్పడానికి రాష్ట్ర అధ్యక్షుడు వచ్చిన సమయంలో నిర్వహించిన ర్యాలీ.

ప్రపంచ శాంతి కోరి కొన్ని విద్యా సంస్థలు ముందుకు వచ్చాయి దానిని తప్పు బట్టడం బిజెపి మొదలు పెట్టింది. నిర్విరమంగా ఆ ర్యాలీ నిర్వహించిన నాటి నుంచి ప్రతి రోజు ఏదో రకమైన విష ప్రచారం చేస్తున్నారు. మానవ త్వానికి మతాన్ని అంటగడుతున్నారు. చిన్నారులకు సంఘీభావంగా చిన్నారులు ర్యాలీలో పాల్గొంటే వారి తల్లి తండ్రుల పట్ల అసభ్య పదజాలం వాడు తున్నారు. ఇష్టారీతిన యూ ట్యూబర్లతో నోటికొచ్చిన భాష మాట్లాడిస్తున్నారు. మానవత్వం అనేది పూర్తిగా కనుమరుగైనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా అంటే బంగ్లాదేశ్ ఉదాహరాణ తీసుకొస్తున్నారు. విశ్వగురువు అని చెప్పుకునే మోది ఎన్నో దేశాల యుద్ధాలను ఆపానని చెప్పుకుంటున్నారు. మరి బంగ్లాదేశ్ అంశంలో ఎందుకు జోక్యం చేసుకోవడం లేదు. అక్కడ శాంతి నెలకొంటే ఎన్నికల్లో మాట్లాడానికి మతం అనే అంశం సజీవంగా ఉండాలని బిజెపి కోరుకుంటున్నదా అందుకే బంగ్లాదేశ్ లాంటి చోట జోక్యం చేసుకోవడం లేదా అని అనేక మంది మేధావులు అభిప్రాయ పడుతున్నారు. ఖమ్మం జిల్లాలో ప్రజలను విడగొట్టడం ఎవరి తరం కాదనే విషయాన్ని విషం చిమ్మే నాయకులు అర్థం చేసుకుంటే వారికి వారి పార్టీ పురోగతికి మంచిదనే విషయాన్ని మరువద్దు.

**ఖమ్మం లో వివాదాలకు తావు లేదు. :** ఖమ్మం జిల్లా అంటేనే శాంతి, ఐక్యత కు మారు పేరు. ఇక్కడ అన్ని వర్గాలు కలిసి మెలిసి ఉంటాయి. కులాలు, మతాలకు సంబంధం లేకుండా ఇక్కడ వరుసలతో పిలుచుకుంటారు. చిన్న నాటి నుంచి కలిసి మెలిసి పెరిగినా బాంధావ్యలు ఖమ్మంలో ఉంటాయి. మత విద్వేషాలకు ఖమ్మంలో తావుండదు. అన్ని పండుగలను సమ దృష్టితో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజానీకం చూస్తారు. ఖమ్మం జిల్లాలోని స్నేహితులు, ఆట పాటలు విభిన్నంగా ఉంటాయి. ఖమ్మం అనే పదంలో అమ్మ ఉంది. అలాంటి అమ్మకు బిడ్డలందరు సమానమే.. అమ్మను ప్రేమలో విషం నింపాలని చూస్తే అది వాళ్లకే చేటవుతుంది. సుదీర్ఘ కాలం నుంచి ఖమ్మం జిల్లా ఎంతో ఘనంగా కీర్తి ప్రఖ్యాతలు గాంచిన జిల్లా. ఖమ్మం జిల్లాలో పుట్టాలంటే అదృష్టం ఉండాలి. అమ్మ లాంటి ఖమ్మం జిల్లాను కాపాడుకో వడానికి విద్వేషాలు, విష ప్రచారాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఖమ్మం జిల్లా పౌరులుగా మనందరిపై ఉంది.







Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370